Postail Licence No. L/KNL/3-19(D). 2016 - 2018

# ఉత్తేజిత దినపత్రిక

ఎడిటర్ : చంద్ర శేఖర్ యం

Published from Kurnool ---- Circulated by Andhrapradesh, Telangana & New Delhi

సంపుటి :04 సంచిక : 38 పేజీలు 8 వెల : 5 బుధవారం 30 జూలై 2025

ఉత్తేజిత దినపత్రిక
ఎడిటర్ : చంద్ర శేఖర్ యం
అక్షరాన్నే ఆయుధంగా మలుచుకున్న పత్రిక




వార్షికోత్సవ ప్రత్యేక సంచిక

ప్రకటనదారులకు, పాఠకులకు మా నమస్సుమాంజలులు...

16వ వార్షికోత్సవ సందర్భంగా ప్రకటనలు మంజూరు చేయుట గురించి పాఠకులారా !.. ఉత్తేజిత దినపత్రికను హృదయపూర్వకంగా అభిమానించినందుకు మేనేజ్‌మెంట్ మీకు అభినందనలు తెలియజేస్తుంది.

జన వాక్కులే వార్తలుగా మలుచుకొని నిజాన్ని ఇజంగా చేసుకొని నిరంతరం నూతన వరవడిలో పత్రికను మీ ముందుకు తెస్తున్నామన్నా విషయం మీకందరికీ తెలిసిందే.

పత్రిక నడవాలంటే ఆర్థిక మూలాలు ముఖ్యం. కావున మీరంతా వార్షికోత్సవ సందర్భంగా ప్రకటనులు మంజూరు చేసి పత్రికాభివృద్ధికి మీ వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా అందజేయవలసిందిగా ఆకాంక్షిస్తున్నాము ....

మీ... ఉత్తేజిత దినపత్రిక ఎడిటర్

తారీఫ్

| | |
|---|---|
| | బ్లాక్ & వైట్ పేజి |
| బ్యాక్ కవర్ పేజి మల్టీకలర్ : 50,000/- | బ్యాక్ పేజి : 20,000/- |
| ఇన్నర్ మల్టీకలర్ పేజి : 20,000/- | ఇన్నర్ పేజి : 20,000/- |
| ఫ్రంట్ మల్టీకలర్ పేజి : 70,000/- | ఫ్రంట్ పేజి : 30,000/- |

ప్రకటనదారులకు విజ్ఞప్తి...

గమనిక : సకాలంలో ప్రకటనల తాలుకా ఫోటోలు మరియు మెటీరియల్‌ను ఉత్తేజిత తెలుగు దినపత్రిక విలేకరులకు అందజేయవలసిందిగా కోరడమైనది.



# పాలనకు పాతరేసిన కూటమి నేతలు

రాష్ట్రంలో అధ్వాన్న పరిస్థితులు

భయానక వాతావరణంతో అరెస్టులు

ముఖ్య నేతలను ఏదో కేసు పెట్టి అరెస్ట చేస్తున్నారు

కలెక్షన్ ఏజెంట్లుగా మారిన పోలీసులు

రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో అరాచకం

వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుల భేటీలో జగన్ విమర్శలు

2లో..

ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయాలు ఆయన జేబులోకి పోతున్నాయన్నారు. చంద్రబాబు ఏదైతో విత్తారో అదే చెట్టవుతోంది. రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో.. కార్యక్రమం కింద బాబు ష్యూరిటీ-, మోసం గ్యారంటీ-.. కార్యక్రమాలు బాగా జరుగుతున్నాయి.

నన్ను చూసి వాళ్లు రాజకీయాల్లోకి వచ్చారు. రాష్ట్రంలోని అంశాలకు మిథున్‌కు ఏం సంబంధం?. మిథున్ తండ్రి పెద్దిరెడ్డిగారు ఆ శాఖను కూడా చూడలేదు. కేవలం వేధించాలన్న ఉద్దేశంతో తప్పడు కేసులు పెట్టారు. చంద్రగిరి చంద్రబాబు సొంత నియోజకవర్గం. గతంలో చంద్రబాబు మంత్రిగా పనిచేసి చంద్రగిరిలో ఓడిపోయారు. తర్వాత ఎన్టీఆర్ కాళ్లు పట్టుకుని మళ్లీ టీడీపీలో చేరాడు.



2లో..

## కాలుష్యరహిత నగరంగా హైదరాబాద్

25 ఏళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రణాళికలు

అధికారులకు సీఎం రేవంత్ ఆదేశం




2లో..

## ఏనుగుల సంచారంపై నిరంతర పర్యవేక్షణ

అటవీ అధికారులకు డిప్యూటి సిఎం పవన్ ఆదేశం

వాట్సాప్ గ్రూపల ద్వారా ప్రజలను అప్రమత్తం చేయాలని సూచన



# అమరావతి అభివృద్ధిలో సింగపూర్ భాగస్వామ్యం

రాష్ట్రంలోని ప్రాజెక్టుల్లో ఏపీతో కలిసి పని చేసేందుకు సిద్ధం

సింగపూర్ మంత్రి కీలక ప్రకటన

మూడోరోజు బిజీగా సిఎం సింగపూర్ పర్యటన

వివిధ పారిశ్రామిక దిగ్గజ కంపెనీలతో భేటీ

కెప్పెల్ కార్పొరేషన్ ఇడితో సమావేశం

అమరావతి:సీఎం చంద్రబాబు సింగపూర్ పర్యటనలో ఉండగానే ఆ దేశ మానవనరులు, సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి టాన్సీ లెంగ్ కీలక ప్రకటన చేశారు. వివిధ రంగాల్లో ఏపీ ప్రభుత్వంతో కలిసి పని చేయడానికి సంసిద్ధతను వ్యక్తం చేయడమే కాకుండా.. గత ప్రభుత్వ విధానాలను ప్రస్తావిస్తూ ఎక్స్ వేదికగా సింగపూర్ మంత్రి చేసిన ప్రకటన ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఆంధ్రప్రదేశ్, అమరావతి అభివృద్ధిలో సింగపూర్ భాగస్వామ్యంగా ఉండేందుకు సిద్ధంగా ఉందని ఆ దేశ ట్రేడ్ ఇండస్ట్రీ శాఖలోని మానవ వనరులు, శాస్త్రసాంకేతిక మంత్రి టాన్ సీ లెంగ్ స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో జరిగిన సమావేశంపై ఎక్స్ హ్యాండిల్ లో ట్వీట్ చేసిన ఆయన ఆంధప్రదేశ్ రాష్ట్రంలోని ప్రాజెక్టుల్లో ఏపీతో కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు- వెల్లడించారు. వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్, పునరుత్పాదక ఇంధనం లాంటి రంగాలు పెట్టుబడులకు అనుకూలమని టాన్సీ లెంగ్ పేర్కొన్నారు. భారత్ లో అత్యంత వేగంగా ఎదుగుతున్న రాష్ట్రాల్లో ఒక-టైన ఏపీలో ఫుడ్ ఎంపైర్, ఎవర్ వోల్ట్ లాంటి సింగపూర్ కంపెనీలు ఇప్పటికే ఏపీలో పెట్టు-బడులు, కార్యకలాపాల విస్తరణకు ఆ సంస్థలు ఎదురు చూస్తున్నాయని పేర్కొన్నారు.

# నిండుకుండలా నాగార్జున సాగర్

14 గేట్లు ఎత్తి నీటిని విడదల చేసిన మంత్రులు

18 ఏళ్ల తరవాత జూలైలో ఈ మోతాదులో నీటి చేరిక

నాగార్జునసాగర్:ఎగువ నుంచి వస్తున్న భారీ వరద ప్రవాహంతో నాగార్జునసాగర్ జలాశయం నిండుకుండలా మారింది. దీంతో ప్రాజెక్టు క్రస్ట్ గేట్లు- ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రాజెక్టు పూర్తి సామర్థం 590.00అడుగులకుగాను ప్రస్తుతం 586.60 అడుగులకు చేరింది. ప్రాజెక్టు గేట్లు- ఎత్తిన నేపథ్యంలో.. దిగువ భాగంలో లోతట్టు- ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. 18 ఏళ్ల తర్వాత.. నెల ముందుగానే నాగార్జున సాగర్ నుంచి నీటిని విడుదల చేయడం ఇదే తొలిసారి. వరద ప్రవాహం పెరగడంతో మంగళవారం నాగార్జున సాగర్ గేట్లను ఎత్తారు. మంత్రులచేతుల మీదుగా ఉదయం 11 గంటలకు గేట్లను తెరిచారు. మొత్తం 14 గేట్లను 5 అడుగుల మేర ఓపెన్ చేశారు. అయితే సాగర్ గేట్లను ఎత్తడానికి ముందు బేగంపేట ఎయిర్‌పోర్టులో మంత్రుల గొడవపడ్డారు. షెడ్యూల్ ప్రకారం నల్లగొండ జిల్లా మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ చేతుల మీదుగా మంగళవారం ఉదయం 10 గంటలకు నాగార్జున సాగర్ గేట్లను తెరువాల్సి ఉంది.





సింగపూర్ పర్యటనలో భాగంగా ఆ దేశాధ్యక్షుడు థర్మన్ షణ్ముగరత్నంతో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశం అయ్యారు. ఏపీలో సింగపూర్ పెట్టుబడులు, వ్యాపార అభివృద్ధి అవకాశాలపై ఈ భేటీలో వీరిద్దరూ విస్తృతంగా చర్చించారు. ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమలు, ముఖ్యంగా డిజిటల్, గ్రీన్ ఎనర్జీ రంగాలకు ఉన్న అపారమైన అవకాశాలను సింగపూర్ అధ్యక్షుడికి వివరించారు చంద్రబాబు. రాష్ట్రంలో పెట్టు-బడులకు గల సానుకూల వాతావరణం, నూతన పారిశ్రామిక విధానాలను తెలిపారు.

# కాల్పుల విరమణలో మూడో దేశం జోక్యం లేదు

ట్రంప్ మధ్యవర్తిత్వ ప్రకటనను తోసిపుచ్చిన మోడీ

ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్రమూకలకు బుద్ది చెప్పాం

సిందూర్‌లో త్రివిధ దళాలు సత్తా చాటాయి

కేవలం 22 నిమిషాల్లో ఆపరేషన్ పూర్తి చేసిన త్రివిధ దళాలు

ఆపరేషన్‌పై కాంగ్రెస్, విపక్షాల తీరు దారుణం

సైన్యం స్థయిర్యం దెబ్బతినేలా వ్యాఖ్యాలు

హెడ్‌లైన్స్‌లో ఉండేలా చేస్తున్న వారికి ప్రజల్లో స్థానం లేదు

ఆపరేషన్ సిందూర్‌పై లోక్‌సభలో ప్రధాని మోడీ సమాధానం

2లో..





2లో..

## సైన్యం చేతులు కట్టేసి.. పాక్‌తో సయోధ్య

ఉగ్రదాడులకు దీటుగా సమాధానం చెప్పడంలో విఫలం

దమ్ముంటే ట్రంప్ వ్యాఖ్యలను ఖండించాలి

ఆపరేషన్ సిందూర్ చర్చపై రాహుల్



2లో..

## ఎపిలో ఇక రేషన్ మరింత స్మార్ట్

క్యూఆర్ కోడ్‌తో చిన్నిసైజులో కార్డులు

ఆగస్టు 25 నుంచి 31 వరకు స్మార్ట్ కార్డులు పంపిణీ

రేషన్ పంపిణిలో ఇక మరింత పారదర్శకత

మీడియా సమావేశంలో మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడి

# పాలనకు పాతరేసిన కూటమి నేతలు



అమరావతి:రాష్ట్రంలో భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారని.. సీనియర్ నేతలను తప్పుడు కేసుల్లో ఇరికిస్తున్నారంటూ కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండిపడ్డారు. ఇదే సంప్రదాయం కొనసాగితే... టీడీపీలో అందరూ జైలుకెళ్లాల్సిం దేనని ఆయన హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యులతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ మాట్లాడుతూ.. మిథున్‌రెడ్డి అరెస్ట్ బాధాకరమన్నారు. మిథున్‌ను, గౌతం రెడ్డిని రాజకీయాల్లో నా ద్వారా వచ్చారు. నన్ను చూసి ప్రేరణ పొంది రాజకీయాల్లోకి వచ్చారు. వారి తండ్రులతో కన్నా, వీరితోనే నాకు ఎక్కువ సాన్నిహిత్యం. నన్ను చూసి వాళ్లు రాజకీయాల్లోకి వచ్చారు. రాష్ట్రంలోని అంశాలకు మిథున్‌కు ఏం సంబంధం?. మిథున్ తండ్రి పెద్దిరెడ్డిగారు ఆ శాఖను కూడా చూడలేదు. కేవలం వేధించాలన్న ఉద్దేశంతో తప్పుడు కేసులు పెట్టారు. చంద్రగిరి చంద్రబాబు సొంత నియోజకవర్గం. గతంలో చంద్రబాబు మంత్రిగా పనిచేసి చంద్రగిరిలో ఓడిపోయారు. తర్వాత ఎన్టీఆర్ కాళ్లు పట్టుకుని మళ్లీ టీడీపీలో చేరాడు. తర్వాత చంద్రగిరి నుంచి కుప్పం పారిపోయాడు. కుప్పం బీసీల నియోజకవర్గం కాబట్టి అక్కడికి వెళ్లిపోయాడు. చంద్రబాబు కంట్లో భాస్కర్‌రెడ్డి నలుసులా మారాడు. భాస్కర్ కొడుకును కూడా జైలులో పెట్టాలని కుట్రపన్నాడు. భాస్కర్ కొడుకు లండన్‌లో చదువుకుని వచ్చాడు. అలాంటి వారిమీద కూడా కేసులు పెట్టి అరెస్టు చేయాలని చూస్తున్నారు. నందిగం సురేష్, ఒక సాధారణ స్థాయి నుంచి ఎంపీగా ఎదిగాడు. గట్టిగా తన స్వరాన్ని వినిపిస్తున్నాడని 191 రోజులు జైల్లో పెట్టారు. కేసు మీద కేసు పెట్టి వేధిస్తున్నారు. కాకాణి గోవర్ధన్ మీద కూడా కేసులు మీద కేసులు పెట్టారు. .టోల్‌గేట్ల వద్ద ఫీజుల వద్దకూడా వసూలు చేశారని తప్పుడు కేసు. లేని అక్రమాలు చూపించి.. తప్పుడు కేసులు పెడుతున్నారు. ఇప్పుడు మళ్లీ మరో మాజీ మంత్రి అనిల్ కుమార్ మీద తప్పుడు కేసులు పెడుతున్నారు. దీని కోసం తప్పుడు వాంగ్మూలం చెప్పించే ప్రయత్నంచేశారు. మెజిస్ట్రేట్ వద్ద తనపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారని శ్రీకాంత్‌రెడ్డి అనే వ్యక్తి చెప్పాడు. పార్టీలో ఇలా ముఖ్యమైన, క్రియాశీలకంగా ఉన్నవారిపై కేసులు పెడుతున్నారు. ప్రజల తరఫున గొంతు వినిపించనీయకూడదన్నది చంద్రబాబు ఉద్దేశం. చంద్రబాబు పాలన ఘోరంగా ఉంది. అసలు పరిపాలనే కనిపించడంలేదన్నారు. .సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ సహా ఏ హామీలు నిలబెట్టుకోలేదు. ఘోరంగా వైఫల్యం చెందాడు కాబట్టే... ఈ తప్పుడు కేసులు. మాజీ మంత్రి రోజా మీద తీవ్రంగా దుర్భాషలాడారు. మన పార్టీలో ఉన్న మహిళలకు ఆత్మగౌరవం ఉండదా?. బీసీ మహిళ, కృష్ణాజడ్పీ ఛైర్మన్ హారిక మీద నేరుగా దాడులు చేశారు. నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిమీద హత్యాయత్నమే లక్ష్యంగా దాడులు చేశారు. ఆ రోజు ప్రసన్న ఇంట్లో ఉండి ఉంటే.. ఆయన పరిస్థితి ఏంటి?. రాడ్లతో, కర్రలతో దాడులు చేశారు. తాడిపత్రి నియోజకవర్గ హెడ్ క్వార్టర్‌కు మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి వెళ్లలేకపోతున్నాడు. .ఏకంగా సీఐ గన్ చూపించి మనుషులను భయపెట్టే ప్రయత్నంచేస్తున్నాడు. కొంతమంది డీఐజీలు, పోలీసు అధికారులు అవినీతిలో భాగస్వామ్యం అయ్యారు. ఈ కొంతమంది పోలీసులు కలెక్షన్ ఏజెంట్లుగా మారారు. అధికారపార్టీ ఎమ్మెల్యేలకు కలెక్షన్లు పంచుతున్నారు. ముఖ్య నేతకు, ముఖ్య నేత కొడుక్కి.. కలెక్షన్లు పంచుతున్నారు. వ్యవస్థీకృతంగా అవినీతి జరుగుతోంది. బెల్టుషాపులకు వేలం పాటలు వేస్తున్నారు. ఇసుక మాఫియా, లిక్కర్ మాఫియా, ర్వార్ట్జ్, సిలికా, లెటరైట్ మాఫియాలు జరుగుతున్నాయి. కొంతమంది పోలీసు అధికారుల సహాయంతో అవినీతిపై పంచాయతీలు చేయిస్తున్నారు. మనం ఎప్పుడూ చూడని విధంగా అవినీతి జరుగుతోందని జగన్ అన్నారు. రేషన్ బియ్యం మాఫియా కొనసాగుతోంది. పేకాట క్లబ్బులు నడుస్తున్నాయి. కొంతమంది డీఐజీలు కలెక్షన్ ఏజెంట్లు-గా పనిచేస్తున్నారు. రాష్ట్ర చరిత్రలో ఇంత అధ్వాన్నమైన పరిస్థితులు ఎప్పుడూ చూడలేదు. మహిళలకు నెలకు రూ.1500 ఇస్తానని, ఇప్పుడు రాష్ట్రాన్ని అమ్మాలి అంటున్నారు, ఇంతకన్నా పచ్చిమోసం ఉంటుందా?. ఫీజురియింబర్స్ మెంట్ ఇవ్వకపోవడం వల్ల పిల్లల చదువులు మానేస్తున్న పరిస్థితులు వచ్చాయి. రూ.4200 కోట్లు- పీజు రియింబర్స్ మెంట్ బకాయలు ఉన్నాయి, ఆరు క్వార్టర్లనుంచి పెండింగ్. వసతీ దీవెన కింద రూ.2200 కోట్లు- బకాయిలు ఉన్నాయి. ఆరోగ్యశ్రీ బిల్స్ నెలకు రూ.300 కోట్ల చొప్పున, రూ.4200 కోట్లు- పెండింగ్. ఆరోగ్య ఆసరా కింద ఒక్క పైసా ఇవ్వడంలేదు. నెట్ వర్క్ ఆస్పత్రులు చేతులు ఎత్తివేశాయి. ఏ రైతుకూ, ఏ పంటకూ గిట్టు-బాటు-ధర లేదు. రైతులను పరామర్శించడానికి వెళ్తే కేసులు పెడుతున్నారు. ఉచిత పంటల బీమా తీసేశారు. ఆర్బీకేలు, ఇ- క్రాప్ నిర్వీర్యం. నాడు-నేడు పనులు ఆగిపోయాయి. స్కూళ్లు మూసేస్తున్నారు. రాష్ట్రంలో అసలు పాలన ఎక్కడుంది?. రెండేళ్లపాటు- కోవిడ్ ఉన్నా.. మనం ప్రజలకు మెరుగైన సంక్షేమం అందించాం అని వివరించారు. ఐదేళ్లలో మనం చేసిన అన్నిరకాల అప్పులు రూ.3.32 లక్షల కోట్లు- చేశాం. ఈ 14 నెలల్లో చంద్రబాబు అందులో 52 శాతం వెళ్లాడు. కేవలం దోచుకున్న డబ్బులు దాచుకోవడానికి మాత్రమే సింగపూర్ పర్యటన. పోర్టులు, హార్బర్లు కట్టాం, స్కూళ్లు బాగుచేశాం, ఆర్బీకేలువ కట్టాం, సచివాలయాలు కట్టాలం, విలేజ్ క్లినిక్స్ కట్టాం, మెడికల్ కాలేజీలు కట్టాం. రాష్ట్రానికి రావాల్సిన ఆదాయాలు రావడంలేదు, అంతా దోచుకుంటున్నారు. దేశం ఆదాయం సగటున 12 శాతం పెరిగితే, రాష్ట్రం ఆదాయాలు 3శాతంకూడా పెరగడంలేదు. ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయాలు ఆయన జేబులోకి పోతున్నాయన్నారు. చంద్రబాబు ఏదైతో విత్తారో అదే చెట్టవుతోంది. రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో.. కార్యక్రమం కింద బాబు ష్యూరిటీ-, మోసం గ్యారంటీ-.. కార్యక్రమాలు బాగా జరుగుతున్నాయి. మండలాల్లో కూడా దాదాపుగా పూర్తికావొచ్చింది. 90 నియోజకవర్గాల్లో గ్రామస్థాయిలోకూడా ప్రారంభమై ముమ్మరంగా సాగుతోంది. వచ్చే నెలలో రచ్చబండ కార్యక్రమం ద్వారా గ్రామస్థాయిలో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ-కార్యక్రమం ఉధృతంగా చేయాలి. క్యూ ఆర్ కోడ్ ద్వారా చంద్రబాబు ఇచ్చిన వాగ్దానాలు, ప్రతి కుటుంబానికీ ఎంత బాకీ పడ్డాడో చెప్పాలి

అన్నారు.పార్టీ పరంగా ఉన్న వ్యవస్థలను ఉపయోగించుకోవాలి. చిన్న చిన్న విభేదాలను రూపుమాపి అందర్నీ ఒక్కతాటిపైకి తీసుకు రావాలి. పార్టీని బలోపేతం చేసుకోవడానికి ఇదో మంచి అవకాశం. పార్టీకోసం కష్టపడేవారు ఎవరన్నది ఇప్పుడే బయటకు వస్తుంది. పార్టీలో మంచి గుర్తింపు పొందడానికి ఇదొక అవకాశం అన్నారు. ఇకపోతే వైఎస్ జగన్ భద్రతపై పీఏసీ సమావేశంలో ఆందోళన వ్యక్తమమైంది. జరుగుతున్న పరిణామాలు చూస్తే చాలా ఆందోళనకరంగా ఉందని పీఏసీ సభ్యులు తెలిపారు. 'మీరు భద్రంగా ఉంటేనే మేం, ప్రజలు బాగుంటాం. ప్రభుత్వం ఉద్దేశ పూర్వకంగానే వైయస్.జగన్ భద్రతపై సమస్యలు సృష్టిస్తోంది. ఏ పర్యటన చూసినా భద్రతా లోపాలు చాలా స్పష్టంగా కనిపిస్తున్నాయి. భద్రత విషయంలో ఉపేక్షించడం కరెక్టు కాదు. మీ భద్రత విషయంలో కొత్త కొత్త వార్లు వింటు-న్నాం. మా అందరికీ చాలా ఆందోళన కరంగా ఉంది. తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది' అని ఇందులో రాజీ వద్దని పీఏసీ సభ్యులు.. జగన్‌కు సూచించారు. బంగారుపాళ్యం సహా ఇతర పర్యటనల్లో భద్రత విషయంలో పోలీసులు, ప్రభుత్వం కావాలనే రాజీ పడిందన్నారు.

# ఏనుగుల సంచారంపై నిరంతర పర్యవేక్షణ



అమరావతి: తిరుపతి జిల్లాల్లో ఏనుగులు గుంపులు గుంపులుగా సంచరిస్తున్న క్రమంలో అటవీశాఖ సిబ్బంది గ్రామాలలో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖల మంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించారు. సోమవారం ఉదయం అటవీ శాఖ ఉన్నతాధి కారులతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్ ద్వారా ఏనుగుల గుంపుల సంచారం, పంట పొలాలను ధ్వంసం చేయడం, ఏనుగుల దాడిలో ఇటీవల ఒక రైతు దుర్మరణంపై సమీక్షించారు. సోమవారం ఉదయం చంద్రగిరి నియోజకవర్గం పరిధిలో ఏనుగుల గుంపు తిరుగుతూ పొలాలు ధ్వంసం చేసిన ఘటనపై అధికారులు వివరాలు అందించారు. 11 ఏనుగులు ఒక గుంపుగా తిరుగుతూ కళ్యాణి డ్యామ్ సమీపంలోని సత్యసాయి ఎస్టీ కాలనీ దగ్గర పొలాలు, తోటలు తొక్కివేశాయని వివరించారు. డ్రోన్ ద్వారా ఏనుగుల గుంపు కదలికలను పరిశీలిస్తున్నట్లు-వివరించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ అధికారులకు దిశానిర్దేశర చేశారు. ఏనుగులు ఎటు-వైపు వెళ్తున్నాయి అనేది పరిశీలించడానికి డ్రోన్ టెక్నాలజీ వినియోగిస్తున్న క్రమంలో... అవి వెళ్ళే అవకాశం ఉన్న మార్గాల్లోని గ్రామాలవారిని అప్రమత్తం చేయడంలో ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలన్నారు. గ్రామాలవారీగా వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు- చేసి వాటికి ఎప్పటికప్పుడు ముందస్తు హెచ్చరికలు పంపించాలని ఆదేశించారు. ఏనుగుల కదలికలు, హెచ్చరిక సందేశాలు పంపించడాన్ని డి.ఎఫ్.ఓ. కార్యాలయాలు, పి.సి.సి.ఎఫ్. కార్యాలయం పర్యవేక్షించాలన్నారు. వీటితోపాటు- ఏనుగుల గుంపు పొలాల మీదకి రాకుండా, అటవీ ప్రాంతంలోకి పంపించే చర్యలను పకడ్బందీగా చేపట్టాలని స్పష్టం చేశారు. సోమవారం అర్ధరాత్రి తిరుపతి శ్రీవారి మెట్టు- మార్గంలో ఏనుగులు సంచరించిన విషయం తెలిసిందే. పంప్ హౌస్ వద్ద 11 ఏనుగులు సమీపంలోని పంట పొలాలను ధ్వంసం చేశాయి. ఈ నేపథ్యంలో పవన్ కల్యాణ్ సమీక్ష నిర్వహించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఏనుగులు సంచరిస్తున్న ప్రాంత ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని అధికారులకు పవన్ కల్యాణ్ సూచించారు. గ్రామస్థులతో వాట్సప్ గ్రూపులు ఏర్పాటు- చేసి ముందస్తు సమాచారం ఇవ్వాలని చెప్పారు. అటవీ శాఖ సిబ్బంది ఆయా గ్రామాల్లో నిరంతరం పర్యవేక్షించాలని చెప్పారు. ఏనుగుల గుంపు పొలాల మీదకి రాకుండా, అటవీ ప్రాంతంలోకి పంపించే చర్యలను పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు.

# కాల్పుల విరమణలో మూడో దేశం జోక్యం లేదు



న్యూఢిల్లీ: పాక్‌తో కాల్పుల విరమణలో అమెరికా పాత్రను లోక్‌సభ వేదికగా ప్రధాని మోడీ తోసిపుచా÷-చారు. ఇందులో మూడో వ్యక్తి ప్రమేయం లేదని తేల్చి చెప్పారు. ఇదే సందర్భంలో ప్రధాని మోదీ.. కాంగ్రెస్, విపక్షాల తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఉగ్రవాదులను మట్టిలో కలిపినందుకు భారత్ విజయోత్సవాలు చేసుకుంటోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడం, భారత సేనల శౌర్య, ప్రతాపాల ప్రదర్శన తర్వాత విజయోత్సవాలు చేసుకుంటున్నామన్నారు. 140 కోట్ల భారతీయుల ఐక్యత, ఇచ్ఛాశక్తి ఫలాలతో భారత్ విజయోత్సవాలు చేసుకుంటోందని తెలిపారు. 'ఆపరేషన్ సిందూర్'పై లోక్‌సభలో వాడీ వేడిగా జరిగిన చర్చకు సమాధానం గా ప్రధాని మోదీ ప్రసంగించారు. ఆపరేషన్ సిందూర్ ఆపాలని ప్రపంచంలో ఏ నేత కూడా మాకు చెప్పలేదు. మే 9న అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ నాతో ఫోన్‌లో మాట్లాడారు. పాక్ భారీగా దాడి చేయబోతోందని ఆయన హెచ్చరించారు. పాక్ భారీ మూల్యం చెల్లించుకుంటుందని జేడీ వాన్స్‌కు చెప్పా. పాక్‌కు ఎవరు సాయం చేసినా.. చూస్తూ ఊరుకొనేది లేదని చెప్పాం. పాక్ ఎలాంటి దాడి చేసినా మేం చూసుకుంటామని వాన్స్‌కు చెప్పాం. బుల్లెట్‌కు బుల్లెట్‌తోనే సమాధానం చెప్తామని జేడీ వాన్స్‌కు చెప్పాం. పాక్‌కు ఎవరు సహాయం చేసినా.. చూస్తూ ఊరుకునేది లేదని స్పష్టం చేశాం. పాక్‌కు చిరకాలం గుర్తుండి పోయే సమాధానం ఇచ్చాం. పాక్ డీజీఎం అర్ధరాత్రి ఫోన్ చేసి దాడులు ఆపాలని బతిమాలితేనే ఆపరేషన్ సిందూర్ నిలిపివేశామని అన్నారు. ఈ ఆపరేషన్ సందర్భంగా త్రివిధ ధళాలకు సంపూర్ణ స్వేఛ్ఛ నిచ్చామని మోదీ తెలిపారు. భారత సైన్యం పాక్‌లో ఉగ్రవాద స్థావరాలను మట్టుబెట్టిందని, ఊహలకు కూడా అందని విధంగా టెర్రరిస్టులను శిక్షించామని, ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్రవాదులను మట్టిలోనే కలిపేశామని అన్నారు. ఏప్రిల్ 22న కేవలం 22 నిమిషాల్లో ఆపరేషన్ పూర్తి చేశామన్నారు. మతాల మధ్య చిచ్చు పెట్టేందుకే పహల్గాం దాడులు అన్నారు. ఈ దాడి తర్వాత ఉగ్రవాదులను మట్టిలో కలుపుతామని ప్రతినబూనాం. ద్రోహులకు కలలో కూడా ఊహించని విధంగా శిక్షిస్తామని చెప్పాం. ఉగ్రవాదులకు గట్టి గుణపాఠం చెప్పాలని అఖిలపక్ష భేటీలోనూ చర్చించాం. పాక్ భూభాగంలోకి వెళ్లి ఉగ్రస్థావరాల్ని ధ్వంసం చేశాం. పాక్ ఎయిర్ బేస్‌లు ఇప్పటికీ ఐసీయూలో ఉన్నాయి. అణుబాంబులు బెదిరింపులు చెల్లవని పాక్‌ను హెచ్చరించాం. 193 దేశాల్లో 190 దేశాలు ఆపరేషన్ సిందూర్‌ని సమర్థించాయి. పాక్‌కు కేవలం మూడు దేశాలే అండగా నిలిచాయని అన్నారు. ఆపరేషన్ సిందూర్‌ను కాంగ్రెస్ మాత్రమే తప్పుపడుతోందని,స్వార్థ రాజకీయాల కోసం సైనికుల పరాక్రమాలను తక్కువ చేస్తోంది. తమ స్వార్థ రాజకీయాల కోసం కాంగ్రెస్ నేతలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మోడీ మండిపడ్డారు.తద్వారా సైన్యం మనోస్థయిర్యాన్ని దెబ్బతీస్తున్నారు. మీడియా హెడ్‌లైన్లలో వచ్చేందుకు కొందరు నేతలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. కాంగ్రెస్ నేతలు మీడియా హెడ్‌లైన్లలో ఉండొచ్చేమో గానీ.. ప్రజల మనస్సుల్ని గెలవలేరని అన్నారు. పాకిస్థాన్‌ను కాంగ్రెస్ వెనకేసుకురావడం దౌర్భాగ్యం. సర్జికల్ ÷-టస్రైక్స్ విషయంలోనూ కాంగ్రెస్ నేతలు ఇలాగే మాట్లాడారు. పైలట్ అభినందన్ పాక్‌కు చిక్కినప్పుడూ ఇలాగే మాట్లాడారు. పాక్ నుంచి అభినందన్‌ను మోదీ ఎలా తెస్తారో చూస్తామన్నారు. మేం ఆయన్ను సురక్షితంగా భారత్‌కు తీసుకొచ్చాం. విపక్షాల తీరు చూసి దేశమంతా నవ్వుకుంటోంది. భారత రక్షణ దళాల శక్తి, సామర్థ్యాలపై పూర్తి విశ్వాసం ఉంది. భారత రక్షణ దళాలకు పూర్తి స్వేఛ్ఛ ఇచ్చాం. నేనెప్పుడూ భారత ప్రజల పక్షమే. భారతీయుల భావనలతో నా స్వరం మిళితం చేసుకొని ముందుకెళ్తున్నా. ఆపరేషన్ సిందూర్ సమయంలో నాపై నమ్మకం ఉంచినందుకు దేశ ప్రజలకు రుణపడి ఉన్నానని మోదీ అన్నారు. పాకిస్థాన్ మళ్లీ ఎలాంటి కుయుక్తులు చేసినా ఆపరేషన్ సిందూర్ కొనసాగుతుంని స్పష్టం చేశారు. పాక్ ఎలాంటి దుశ్చర్యలకు పాల్పడినా దీటుగా బదులిస్తాంఅని ప్రధాని మోదీ హెచ్చరించారు. పహల్గాం దాడి ఉగ్రవాదులను సైతం మట్టు-బెట్టామన్నారు. ఆపరేషన్ మహాదేవ్ చేపట్టి ఉగ్రవాదుల్ని ఏరివేస్తున్నట్లు- చెప్పారు.

# ఎపిలో ఇక రేషన్ మరింత స్మార్ట్



అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా ఆగస్టు 25 నుంచి 31 వరకు స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ చేయనున్నట్లు- ఏపీ పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. అక్రమాలకు ఆస్కారం లేకుండా క్యూఆర్ కోడ్‌తో ఈ కార్డులను రూపొందించినట్లు- తెలిపారు. మంగళవారం మీడియాతో మంత్రి మాట్లాడారు. కొత్తగా 9లక్షల మందికిపైగా రేషన్‌కార్డులు మంజూరు చేస్తున్నాం. రాష్ట్రంలోని 29,796 రేషన్ షాపుల్లో ప్రతినెలా 1 నుంచి 15 వరకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్యం 12 వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 8 వరకు రేషన్ సరఫరా చేస్తున్నాం. ఐదేళ్లలోపు, 80 ఏళ్లు దాటిన వారికి ఈకేవైసీ అక్కర్లేదని మంత్రి నాదెండ్ల తెలిపారు. జాతీయ ఆహర భద్రతా చట్టం ప్రకారం కేంద్రప్రభుత్వ సాయంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రేషన్ కార్డులని పంపిణీ చేస్తోందని మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం 60శాతం, ఏపీ ప్రభుత్వం 40శాతం కార్డులను భరిస్తున్నాయని వెల్లడించారు. 4.72 శాతం రేషన్ కార్డు దరఖాస్తులు తిరస్కరించామని చెప్పుకొచ్చారు. ఏపీ వ్యాప్తంగా రేషన్ కార్డుల సంఖ్య కోటి 40 లక్షల 96వేల 86 మందికి కార్డులు ఉన్నాయని వివరించారు. పాత విధానాన్ని మార్చి స్మార్ట్ రేషన్ కార్డులు ఇచ్చేందుకు డిజిటలైజ్ చేశామని వెల్లడించారు. ఈ కార్డులపై ఎక్కడ కూడా నాయకుల ఫొటోలు ఉండకూడదని డిజైన్ చేశామని తెలిపారు. కుటుంబ సభ్యుల ఫొటోలు మాత్రమే రేషన్ కార్డులో ఉంటాయని.. వీటిని డెబిట్, క్రెడిట్ కార్డు సైజుల్లో ఇవ్వబోతున్నామని ప్రకటించారు. కుటుంబ సభ్యుల వివరాలు, కార్డునెంబర్ బాగా కనిపించేలా రూపొందించామని వెల్లడించారు. క్యూఆర్ కోడ్ ద్వారా ట్రాన్సెక్షన్ జరిగిన వెంటనే సెంట్రల్ ఆఫీసులో తెలుస్తోందని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఈ కార్డులు అన్ని ఉచితంగా అందిస్తామని ప్రకటించారు. ఆగస్టు 25వ తేదీ నుంచి 30వ తేదీ వరకూ ఈ కార్డులు అందిస్తామని ప్రకటించారు. జిల్లాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు ఇస్తారని, రాష్ట్రస్థాయిలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ-సీఎం పవన్ కల్యాణ్ ఈ కార్డులు పంపిణీ చేస్తారని వెల్లడించారు. 94శాతం మందికి ఈ కేవైసీ చేశామని తెలిపారు. 65 సంవత్సరాల దాటిన వృద్ధులకు ప్రతి నెల 26వ తేదీ నుంచి 30వ తేదీ మధ్య సరుకులు హోం డెలివరీ చేస్తామని వెల్లడించారు. ఒక్క అల్లూరి సీతారామరాజు జిల్లాలో మినహా అన్నిచోట్ల పంపిణీ బాగానే జరుగుతోందని చెప్పుకొచ్చారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఉన్న ఇబ్బందులను స్వయంగా తామే వెళ్లి పరిష్కరిస్తామని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. దీపం పథకంలో ఎలాంటి లోపం లేకుండా మూడు ఆయిల్ కంపెనీలతో ప్రతి వారం సమీక్షలు చేస్తున్నామని మంత్రి నాదెండ్ల మనోహర్ వ్యాఖ్యానించారు. రెండో విడతలో దీపం పథకంలో ఈరోజు వరకూ 93లక్షల 86వేల మందికి దీపం పథకం డెలివరీలు పంపిణీ చేశామని తెలిపారు. దీపం-2 పథకాన్ని లబ్ధిదారులు ఈ నెల 31వ తేదీ లోపు వినియోగించుకోవాలని సూచించారు. ఇకపై డైరెక్ట్‌గా వినియోగదారుల ఖాతాలో డబ్బులు జమ చేయడానికి 4281 మంది లబ్ధిదారులకు పంజాబ్ నేషనల్ బ్యాంకు ద్వారా డిజిటల్ వ్యాలెట్ ఇస్తామని స్పష్టం చేశారు. ఇప్పటి వరకూ దీపం పథకాన్ని 30శాతం మంది ఉపయోగించుకున్నారని గుర్తుచేశారు. 2580 మంది లబ్ధిదారులు ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారని మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు.

దీపం పథకంలో 86వేల మంది లబ్ధిదారుల అకౌంట్లు- సక్రమంగా లేకపోవడంతో వారికి డబ్బులు పడలేదని.. వారి వివరాలు తీసుకుంటామని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. ఇప్పటి వరకూ 4516 ట్రాన్సెక్షన్‌లు మాత్రమే ఫెయిల్ అయ్యాయని తెలిపారు. వేర్వేరు బ్యాంకు అకౌంట్లు-, ఫోన్ నెంబర్‌లు వేరే ఉండటంతో డబ్బులు పడలేదని చెప్పుకొచ్చారు. సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ కింద గ్యాస్ ఏజెన్సీకి మాత్రమే ఆ కూపన్ చెల్లుతుందని... దీంతో వ్యాలెట్‌లోని పైసలు వేరే అవసరాలకు వాడటానికి వీలుండదని స్పష్టం చేశారు. 86 వేల మంది లబ్ధిదారులని గుర్తించడం చాలా కష్టం అయిందని... అయితే అర్హత ఉన్నవారికి నూటికి నూరుశాతం అందజేస్తామని హామీ ఇచ్చారు. చివరి నిమిషంలో గ్యాస్ బుకింగ్ చేసుకోవడం వల్ల కూడా డబ్బులు పడే అవకాశం లేదని... కాబట్టి ముందే బుక్ చేసుకోవాలని సూచించారు. ఏపీలో అన్ని సంక్షేమ పథకాలకు రేషన్‌కార్డు ఓ అర్హతగా ఉందని తెలిపారు. ప్రస్తుతం డెత్ కేసుల వరకే ఇప్పుడు తొలగిస్తున్నామని.. ఇప్పటి వరకూ ఏపీలో 3 లక్షల 56 మంది వరకూ డెత్ కేసులుగా గుర్తించి వాటిని తొలగించామని వివరించారు. వలంటరీగా కార్డులు సరెండర్ చేయమని అడగటంతో 12 నుంచి 13 వందల మంది ముందుకు వచ్చారని పేర్కొన్నారు. అసెంబ్లీ పిటిషన్‌ల కమిటీ-ఇచ్చిన సిఫార్సులని కమిషనర్ తన దృష్టికి తీసుకువచ్చారని... ఈ విషయంపైనా ఆలోచిస్తామని మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పుకొచ్చారు. జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ కాబట్టే హరిహర వీరమల్లు సినిమాను తాము ప్రమోట్ చేస్తామని.. అది తమ బాధ్యత అని మంత్రి నాదెండ్ల మనోహర్ వ్యాఖ్యానించారు. తమ సినిమాలను తాము ప్రమోట్ చేయకుండా.. వారి సినిమాలను ప్రమోట్ చేస్తామా అని ప్రశ్నించారు. సినిమాకు ప్రమోషన్ చేస్తే తప్పేంటని నిలదీశారు.

తమ సినిమాని తాము ప్రమోషన్ చేసుకుంటామని స్పష్టం చేశారు.

# సైన్యం చేతులు కట్టేసి..పాక్‌తో సయోధ్య

న్యూఢిల్లీ: ఆపరేషన్ సిందూర్ సమయంలో మన సైనికుల చేతులు కట్టేశారని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. సాయుధ దళాలకు మద్దతుగా నిలిచే విషయంలో ప్రభుత్వానికి రాజకీయ సంకల్పం కొరవడిందని విమర్శించారు. తాము యుద్ధం కోరుకోవడం లేదని పాకిస్థాన్‌కు భారత ప్రభుత్వమే తెలియజేసిందన్నారు. 'ఆపరేషన్ సిందూర్ 'పై చర్చ సందర్భంగా లోక్‌సభలో రాహుల్ ప్రసంగిస్తూ.. పహల్గాం ఉగ్రదాడిని పాకిస్థాన్ కుట్రపన్నిన క్రూరమైన ఘటనగా పేర్కొన్నారు. సాయుధ దళాలను ఉపయోగించాలనుకుంటే.. బలమైన రాజకీయ సంకల్పం ఉండాలి. వారికి పూర్తి స్వేఛ్ఛ ఇవ్వాలి. కానీ.. ఆపరేషన్ సిందూర్ విషయంలో మన సైనికుల చేతులు కట్టేశారు. ఈ ఆపరేషన్‌కు సంబంధించిన సున్నితమైన వివరాలను దాయాదికి వెల్లడించారు. అర్ధరాత్రి 1.05 గంటలకు ఆపరేషన్ ప్రారంభమైందని.. 1.35కు పాకిస్థాన్‌కు ఫోన్ చేసి సైనికేతర లక్ష్యాలను ఛేదించామని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారన్నారు. ఉద్రిక్తతలు పెంచే ఆలోచన లేదని దాయాదితో చెప్పామన్నారు. అంటే.. పాక్‌తో యుద్ధం చేసే ఆలోచన లేదని ఆయన చెప్పకనే చెప్పారని రాహుల్ గాంధీ విమర్శించారు.పాక్ విజ్ఞప్తి మేరకు యుద్ధాన్ని ఆపామని ప్రభుత్వం చెబుతోంది. మరోవైపు.. భారత్-పాక్ యుద్ధాన్ని తానే ఆపానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇప్పటివరకు 29 సార్లు చెప్పుకొన్నారు. ఇందిరా గాంధీలా ధైర్యం ఉంటే.. ట్రంప్ 'అబద్ధాలకోరు' అని, భారత్ యుద్ధవిమానాలకు ఎటువంటి నష్టం వాటిల్లలేదని ప్రధాని మోదీ లోక్‌సభలో ప్రకటించాలని రాహుల్ డిమాండ్ చేశారు. 'ఆపరేషన్ సిందూర్'కు ముందు అన్ని పార్టీలు ఏకతాటిపై నిలిచాయని, తాను

పహల్గాం దాడి బాధిత కుటుంబాలను పరామర్శించినట్లు- తెలిపారు. పహల్గాం ఉగ్రదాడి అమానుషమని, ఈ దాడి అనంతరం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు ప్రతిపక్షాలు ముక్తకంఠంతో ప్రభుత్వానికి మద్దతు తెలిపాయని, ఇందుకు తాము గర్విస్తున్నామని రాహుల్ గాంధీ అన్నారు.హహల్గాం ఉగ్రదాడిలో పర్యాటకులను అత్యంత కిరాతకంగా కాల్చి చంపారని రాహుల్ అన్నారు.

# యూరియాపై ప్రభుత్వం తప్పుడు లెక్కలు



ఖమ్మం: తెలంగాణ రాష్ట్రానికి కేంద్రప్రభుత్వం అందజేస్తున్న యూరియా లెక్కలకు సంబంధించి రేవంత్ ప్రభుత్వం తప్పుడు లెక్కలు చెబుతోందని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రామచంద్రరావు ఆరోపించారు. తెలంగాణకు ఖరీఫ్ సీజన్‌కు ఇప్పటివరకు 6.14 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాని కేంద్రప్రభుత్వం అందజేసిందని స్పష్టం చేశారు. ఇంకా ఎంత యూరియా కావాలంటే అంత ఇచ్చేందుకు మోదీ ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పుకొచ్చారు. రబీ సీజన్‌లో 9 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉందని... కానీ తెలంగాణలో 12.5 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని స్పష్టం చేశారు. ఇప్పుడు యూరియా లేదని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారని.. రబీలో అదనంగా ఉన్న యూరియా ఇప్పుడు ఎందుకు లేకుండా పోయిందని.. ఎందుకు కొరత వచ్చిందో రేవంత్ ప్రభుత్వం పరిశీలించుకోవాలని సూచించారు. యూరియా విషయంలో మంత్రి తుమ్మల నాగేశ్వరావుకి రామచంద్ర రావు సవాల్ విసిరారు. ఆర్టీఏ చట్టం ద్వారా వివరాలు సేకరిద్దాం అని, తనది తప్పైతే రాజీనామా చేస్తానంటూ సవాల్ చేశారు. యూరియా సరఫరా విషయంలో ఆర్టీఏ చట్టం ద్వారా వివరాలు తీసుకోవచ్చని, అందులో తాము చెప్పేది అబద్ధమైతే తాను రాజీనామాకు సిద్ధమని.. మరి తుమ్మల రాజీనామా చేస్తాడో చూడాలని రామచంద్ర రావు అన్నారు. మంగళవారం ఖమ్మం జిల్లాలో రామచంద్రరావు పర్యటించారు. ఖమ్మం నగరంలో రామచంద్రరావు రోడ్ షో నిర్వహించారు. నగరంలోని సప్తపది ఫంక్షన్ హాల్‌లో బీజేపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడారు.ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నారని.. అభివృద్ధి మాత్రం లేదని రామచంద్రరావు ఆరోపించారు.

ఉత్తేజిత దినపత్రిక



# ప్రజా శ్రేయస్సు కొరకే కూటమిపాలన అడుగులు : ఎమ్మెల్యే గిత్త జయసూర్య





ఎంపీటీసీ యశోదమ్మా, మద్దిలేటీ,టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం

**ఉత్తేజిత ప్రతినిధి నందికొట్కూరు జూలై 29 :**

రాష్ట్రంలో సుపరిపాలన సీఎం చంద్రబాబు తోనే సాధ్యమని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య ఉన్నారు.మంగళవారం కూటమి ప్రభుత్వం పాలనలో తొలి ఏడాది విజయవంతంగా పూర్తి చేసిన సందర్భంగా మండల పరిధిలో మల్యాల గ్రామంలో నిర్వహించిన "సుపరిపాలన తొలి అడుగు" కార్యక్రమంలో భాగంగా ఎంపీటీసీ యశోదమ్మ, మద్దిలేటి మరియు టిడిపి నాయకుల ఆధ్వర్యంలో టిడిపి కార్యకర్తలు, నాయకుల తో కలిసి ఇంటింటికి తిరిగి ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం అందించిన అభివృద్ధి సంక్షేమంతో కూడిన సుపరిపాలన గురించి ఎమ్మెల్యే ప్రజలకు ఇంటింటికి వెళ్లి వివరించారు. స్థానిక ప్రజలతో మమేకమై వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకుంటూ ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అందుతున్న తదితర వాటిపై ఆయన ప్రత్యేకంగా ఆర తీశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏదైనా సంక్షేమ పథకాలు అర్హత ఉండి లబ్ధిదారులకు అందకపోతే స్థానిక నాయకుల దృష్టికి తీసుకెళ్తే ఆ సమస్యలను పరిష్కరిస్తారని ప్రజలకు తెలియజేశారు. రాబోయే 4ఏలల్లో రాష్ట్రాన్ని పునర్నిర్మించి, ప్రజలకు మరింత సుపరిపాలన అందించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.తమ వీధిలో నీటి సమస్య ఉందని కులాయి ఏర్పాటు చేయాలని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. విద్యుత్ స్తంభాలు కిందకు వేలాడాయని ఎప్పుడు ఇలాంటి ప్రమాదం జరుగుతోందని పిల్లలు తల్లిదండ్రులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే జయసూర్య ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయో లేదో తెలుసుకోవడంతో పాటు రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి కోసం ప్రభుత్వ కృషి చేస్తుందని తెలిపారు. ఎన్టీఆర్ భరోసా, పింఛన్ల పెంపు, ఉచిత గ్యాస్ సిలిండర్లో పంపిణీ, తల్లికి వందనం పథకాలు,అమలు చేయడంతో గ్రామ ప్రజలు మహిళలు చాలా సంతోషాన్ని వ్యక్తం చేశారు.కార్యక్రమంలో బాల మద్దయ్య,బోయ సూరి,టి. అంజిబాబు వార్డ్ మెంబర్, బాలకృష్ణ,నరసన్న గౌడ్, తాసిల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, అధికారులు పాల్గొన్నారు.

# వైజ్ఞానిక శిక్షణా తరగతులు జయప్రదం చేయండి

**-ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం ఆర్ నాయక్**

**ఉత్తేజిత ప్రతినిధి నందికొట్కూరు జూలై 29:**



ఆత్మకూరు పట్టణంలో ఆగస్టు ఒకటి రెండు మూడవ తేదీలలో నంద్యాల జిల్లా స్థాయి విద్యా వైజ్ఞాన శిక్షణ తరగతులు జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం ఆర్ నాయక్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నంద్యాల జిల్లా స్థాయి విద్యా విజ్ఞాన శిక్షణ తరగతుల కరపత్రం విడుదల చేశారు. వారు మాట్లాడుతూ స్వాతంత్రోద్యమ స్ఫూర్తి భగత్ సింగ్ వారసత్వంతో భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ అధ్యయన పోరాట నినాదంతో 1970లో ఏర్పడింది స్వాతంత్రం, ప్రజాస్వామ్యం, సోషలిజం లక్ష్యాలకై అలుపెరుగని పోరాటాలు పయనంలో పోరాడుతుందని వారు అన్నారు.
55 సంవత్సరాలు పూర్తి చేస్తుందని వారు అన్నారు. అందరికీ నాణ్యమైన విద్య ఉపాధి అందించాలని వారు డిమాండ్ చేశారు. విద్యార్థులలో శాస్త్రీయ దక్పథం సజనాత్మకత శక్తి నైపుణ్యాన్ని పెంపొందించుకొని విద్యార్థులు ఆగస్టు ఒకటి రెండు మూడో తేదీల్లో జరిగే నంద్యాల జిల్లా స్థాయి విద్య వైజ్ఞానిక శిక్షణ తరగతులను విద్యార్థులందరూ కలిసి జయప్రదం చేయాలని వారు తెలిపారు. స్వాతంత్రం వచ్చి 77 ఏళ్లు గడుస్తున్నా విద్య అందని ద్రాక్షగా మారిందని ప్రస్తుతం సమాజంలో ఎన్ని అసమానతలు అంతరాలు ఉన్నాయో అన్నిటిని నేటి విద్యారంగం కళ్లకు కట్టినట్టు చూపిస్తుందని వారు అన్నారు. విద్యపై ప్రభుత్వాలు తమ బాధ్యతను మరిచి కార్పొరేట్లకు రెడ్ కార్పొరేట్ పరుస్తున్నారు అని వారు అన్నారు. వసతి గహాల ఎ విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాడుతూ ఉందని వారు తెలిపారు. విద్యార్థులందరికీ కలిసి జాతీయ విద్యా విధానంతో జరుగుతున్న విద్యా వ్యాపార చరిత్ర ధ్వంసం కేంద్ర ఆదిపత్యం పై తిరగబడాలని వారు హెచ్చరించారు. విద్య దాతల
ఆశయాలకు ప్రతిరూపాలైన ఏడేడ్ విద్యాసంస్థలను ప్రైవేటు పరానికి రుచిగొల్పారు అని వారు. విద్యార్థులు రానున్న రోజుల్లో విద్యా సమస్యలపై పోరాటాలు చేయాలని ముందుండి మన హక్కులు మనం సాధించాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి హరి వర్ధన్ నాయకులు రేణుక,ఇందు,సురేఖ,అయిషా అజయ్, అభి, తదితరులు పాల్గొన్నారు.



# శ్రీవారికి బంగారు శంఖు, చక్రాలు విరాళం

**తిరుమల, ఉత్తేజిత ప్రతినిధి, జూలై 29.**



చెన్నైకు చెందిన సుదర్శన్ ఎంటర్ ప్రైజెస్ సంస్థ తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామికి మంగళవారం సుమారు రూ. 2.40 కోట్లు విలువైన దాదాపు రెండున్నర కేజీల బంగారు శంఖు, చక్రాలను విరాళంగా అందించింది. ఈ మేరకు ఆ సంస్థ ప్రతినిధులు శ్రీవారి ఆలయంలోని రంగ నాయకుల మండపంలో టీటీడీ అదనపు ఈవో శ్రీ సి. హెచ్.వెంకయ్య చౌదరికి శంఖు, చక్రాలను అందజేశారు.

# ఒకప్పుడు కూలీ, ఇప్పుడు లాటరీ కింగ్..



లాటరీ బిజినెస్‌లో అవకతవకలు చేసిన ఆ వ్యక్తి ఏకంగా లాటరీ కింగ్‌గా ఎదిగాడు. ఇక లాటరీ బిజినెస్‌లో ఏటా రూ. 15 వేల కోట్ల టర్నోవర్ జరిపినట్లు అధికారులు గుర్తించారు. అయితే అతడి బిజినెస్‌లో అవకతవకలు గుర్తించడంతో రంగంలోకి దిగిన ఈడీ అధికారులు సంచలన విషయాలు కనుగొన్నారు. ఆ లాటరీ కింగ్‌కు చెందిన రూ. 1000 కోట్ల ఆస్తులను అటాచ్ చేశారు. లాటరీ కింగ్ శాంటియాగో మార్టిన్.. వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్-ఈడీ అధికారుల దర్యాప్తులో విస్తుపోయే వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. కొన్ని నెలల క్రితం ఎలక్షన్ బాండ్ల సమాచారం బయటికి వచ్చి సమయంలో లాటరీ కింగ్ శాంటియాగో మార్టినే పేరు దేశవ్యాప్తంగా మారుమోగింది. వివిధ పార్టీలకు ఎన్నికల బాండ్ల రూపంలో ఈ లాటరీ కింగ్ శాంటియాగో మార్టిన్.. ఏకంగా 5 ఏళ్లలోనే రూ. 1300 కోట్లు వివిధ రాజకీయ పార్టీలకు అందించాడు. ఇదంతా లాటరీ బిజినెస్‌తో సంపాదించిందే కావడం గమనార్హం. అయితే లాటరీ బిజినెస్‌లో మోసాలకు పాల్పడి వేల కోట్ల సంపదను కూడబెట్టినట్లు ఈడీ అధికారులు గుర్తించారు. అంతేకాకుండా ఒక్క ఏడాదిలోనే రూ. 15 వేల కోట్లు సంపాదించినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దర్యాప్తులో వెల్లడైంది. ఈడీ దాడులతో శాంటియాగో మార్టిన్ ఆస్తులు, మోసాలు మొత్తం వెలుగులోకి వచ్చాయి.

ఫ్యూచర్ గేమింగ్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థను స్థాపించిన శాంటియాగో మార్టిన్.. లాటరీల పేరుతో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తడంతో 2014లో దీనిపై సీబీఐ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఆ తర్వాత 2018లో శాంటియాగో మార్టిన్ సహా ఆయన బంధువులు, ఫ్యూచర్ గేమింగ్ సొల్యూషన్స్‌లో పనిచేసిన ఉద్యోగులపై ఈడీ అధికారులు మనీలాండరింగ్ కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా ఇటీవల అతడి రూ. 1000 కోట్ల ఆస్తులను ఈడీ అటాచ్ చేసింది. ఈ క్రమంలోనే మరింత లోతైన దర్యాప్తు చేపట్టగా సంచలన విషయాలు బయటికి వచ్చాయి. లాటరీ బిజినెస్‌లో వచ్చిన అక్రమ సొమ్ముతో ఆస్తులు కొనేందుకు శాంటియాగో మార్టిన్ ఏకంగా 350కి పైగా బోగస్ కంపెనీలను ప్రారంభించినట్లు తేలింది. అంతేకాకుండా ఎన్నో కార్లు కొనుగోలు చేశాడు. లాటరీ టికెట్లు కొనే వారికి కచ్చితంగా లాటరీ తగిలే టికెట్లను విక్రయించి.. వారి నుంచి ఆస్తులను కొనుగోలు చేసేవాడని దర్యాప్తులో ఈడీ అధికారులు గుర్తించారు. అంతేకాకుండా.. తన బంధువులు, ఫ్రెండ్స్‌ను లాటరీ డిస్ట్రిబ్యూటర్లుగా నియమించాడు. వీళ్లు ప్రైజ్ విన్నింగ్ లాటరీ టికెట్లను తమ వద్దే ఉంచుకుని మిగతా టికెట్లను మాత్రమే అమ్మేవారు.

ఈడీ అధికారుల తనిఖీల్లో అలాంటి వందలాది టికెట్ల కట్టలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇక ఈడీ అటాచ్ చేసిన ఆస్తుల్లో కొన్నింటిని శాంటియాగో మార్టిన్ అమ్మేసినట్లు అధికారులు గుర్తించారు. లాటరీ టికెట్లు విక్రయించి.. ఫ్యూచర్ గేమింగ్ సంస్థ ఏడాదికి రూ. 15వేల కోట్ల ఆదాయాన్ని పొందినా.. ప్రభుత్వానికి మాత్రం చాలా తక్కువ మొత్తంలో లాభాలను చూపించిందని ఈడీ వర్గాలు తెలిపాయి. ఇక ఈ ఫ్యూచర్ గేమింగ్ కంపెనీకి సిక్కిం ప్రభుత్వ లాటరీ స్కీమ్ నుంచే భారీగా లాభాలు వచ్చాయని.. ఆ తర్వాత స్థానంలో పశ్చిమ బెంగాల్ ఉన్నట్లు దర్యాప్తులో వెల్లడైంది.

భారత్‌కు పొరుగున ఉన్న మయన్మార్‌లో సాధారణ కూలీ అయిన శాంటియాగో మార్టిన్.. 1988లో భారత్‌కు వచ్చాడు. తమిళనాడులో లాటరీ వ్యాపారం ప్రారంభించి కర్ణాటక, కేరళ రాష్ట్రాలకు విస్తరించాడు. ఆ తర్వాత ఈశాన్య భారతదేశానికి మారిన శాంటియాగో మార్టిన్.. అక్కడ ప్రభుత్వ లాటరీ స్కీమ్‌లతో బిజినెస్ మొదలుపెట్టాడు. కొన్నేళ్లకు భూటాన్, నేపాల్‌లోనూ తన బిజినెస్‌లను విస్తరించాడు. ఆ తర్వాత స్థిరాస్తి, నిర్మాణ, టెక్స్‌టైల్, ఆతిథ్య రంగాల్లోకి అడుగుపెట్టి.. ఫ్యూచర్ గేమింగ్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రారంభించాడు. ఈ సంస్థకు వరల్డ్ లాటరీ అసోసియేషన్‌లో సభ్యత్వం కూడా ఉండటం గమనార్హం. ఈ కంపెనీ ఆన్‌లైన్ గేమింగ్, క్యాసినో వంటి వాటిని కూడా నిర్వహిస్తుంది. ఇక ఈ సంస్థ నుంచి వచ్చిన డబ్బుతో 2019-2024 మధ్య రూ. 1300 కోట్ల ఎన్నికల బాండ్లను కొనుగోలు చేసి.. వివిధ పార్టీలకు విరాళంగా ఇచ్చినట్లు ఇటీవల వెల్లడైంది. డీఎంకే, టీఎంసీ వంటి పార్టీలకు రూ.వందల కోట్ల విరాళాలను శాంటియాగో మార్టిన్ అందినట్లు తెలిసింది.

# ప్రాణాలు తీసిన పబ్జీ..

పబ్జీ గేమ్ ముగ్గురు పిల్లల ప్రాణాలు తీసింది. రైలు పట్టాలపై కూర్చొని.. చెవిలో హెడ్‌ఫోన్స్ పెట్టుకుని.. పక్కన ఏం జరుగుతుందో తెలియకుండా లోకాన్ని మరిచిపోయిన ఆ ముగ్గురు బాలురు.. క్షణాల్లోనే లోకాన్ని విడిచివెళ్లిపోయారు. పట్టాలపై పబ్జీ గేమ్ ఆడుతుండగా.. వేగంగా వచ్చిన రైలు వారిని ఢీకొట్టడంతో ముగ్గురూ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు.. సంఘటనా స్థలానికి చేరుకుని.. ఆ ముగ్గురు బాలుర ఆచూకీ గుర్తించి.. వారి కుటుంబ సభ్యులకు తెలియజేశారు.

పబ్జీ గేమ్. ఇది సరదాగా ఆడే ఆట అయినప్పటికీ.. ఈ పబ్జీ గేమ్‌కు బానిసైన వారి పరిస్థితి ఎలా ఉండేదో మనం ఇప్పటికే చాలా సంఘటనల్లో చూశాం.

పగలు, రాత్రి తేడా లేకుండా పబ్జీ గేమ్ ఆడుతూ.. అందులోనుంచి బయటికి రాలేక అదే ఉచ్చులో చిక్కుకున్న వారిని మనం చాలా మందిని చూశాం. అయితే తేజాగా ఇదే పబ్జీ గేమ్ ముగ్గురు బాలుర ప్రాణాలు తీసింది. చెవిలో ఇయర్ ఫోన్స్ పెట్టుకుని.. రైలు పట్టాలపై కూర్చొని పబ్జీ ఆడుతున్న ముగ్గురు బాలురను అటు వైపు పట్టాల పైనుంచి వచ్చిన రైలు ఢీకొనడంతో వారు స్పాట్‌లోనే మృతిచెందిన ఘటన బీహార్‌లో సంచలనంగా మారింది. ఈ ఘటనతో అప్రమత్తమైన పోలీసులు, రైల్వే సిబ్బంది.. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని పిలుపునిచ్చారు.

పాట్నాలోని పశ్చిమ చంపారన్ జిల్లాకు చెందిన ముగ్గురు బాలురు.. నార్కటియాగంజ్-ముజఫర్‌పుర్ రైల్వే మార్గంలో పట్టాలపై కూర్చున్నారు. అయితే వారు పబ్జీ ఆడుతుండగా అదే మార్గంలో వచ్చిన రైలు.. వారిని ఢీకొట్టుకుంటూ వెళ్లింది. దీంతో వారు ముగ్గురు అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. వారు ముగ్గురు చెవుల్లో ఇయర్‌ఫోన్స్ పెట్టుకొని ఉండడం వల్ల.. పట్టాలపై వస్తున్న రైలును వారు గమనించకపోవడంతోనే ఈ ప్రమాదం జరిగి ఉంటుందని పోలీసులు ప్రాథమికంగా అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇక ఈ రైలు ప్రమాదంలో చనిపోయిన వారిని ఫర్కాన్ ఆలం, సమీర్ ఆలం, హబీబుల్లా అన్సారీగా గుర్తించినట్లు తెలిపారు.

ఇక ఆ ముగ్గురు బాలుర మృతికి సంబంధించిన విషయాన్ని వారి కుటుంబాలకు సమాచారం అందించారు. వారి మృతదేహాల ను పోస్ట్‌మార్టం చేసేందుకు తరలించినట్లు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి తదుపరి విచారణ జరుపుతున్నట్లు వెల్లడించారు. అయితే ఇటీవల కొందరు వ్యక్తులు.. ఇలా సురక్షితం కాని ప్రదేశా ల్లో హెడ్‌సెట్ పెట్టుకుని.. పక్కన ఏం జరుగుతుందో పట్టించు కోకుండా ఉండడం వల్ల వారి ప్రాణాలకే కాకుండా ఇతరుల ప్రాణాలకు కూడా ముప్పు కలుగుతోందని పోలీసులు ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా ఉండేందుకు అలర్ట్‌గా ఉండాలని తల్లిదండ్రులు, అధికారులు తమ పిల్లలకు అవగాహన కల్పించాలని పోలీసులు సూచించారు.

# దుమ్ము రేపిన వందేభారత్ స్లీపర్..



ప్రస్తుతం నడుస్తోన్న ఛైర్‌కార్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ప్రయాణికుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. రెండేళ్ల కిందట మోదీ ప్రభుత్వం వీటిని పట్టాలెక్కించింది. 100 శాతానికిపైగా ఆక్యుపెన్సీతో నడుస్తోన్న ఈ రైళ్లు.. గమ్యానికి తొందరగా చేరుస్తున్నాయి. దీంతో ఎక్కువ మంది ఇందులో ప్రయాణానికి మొగ్గు చూపుతున్నారు. ప్రస్తుతం ఈ రైళ్లు 700 నుంచి 800 కిలోమీటర్ల దూరంలోని స్టేషన్ల మధ్య నడుస్తున్నాయి. త్వరలోనే వందే భారత్ స్లీపర్ రైలు రాబోతోంది.

కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కారు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన సెమీ-హైస్పీడ్ రైలు వందేభారత్ ఎక్స్‌ప్రెస్. ప్రస్తుతం ఛైర్‌కార్‌తోనే నడుస్తుండగా.. త్వరలోనే స్లీపర్ రైళ్లు పట్టాలెక్కనుంది. ఇందుకు సంబంధించిన ట్రయల్ రన్ కొనసాగుతోంది. వేగాన్ని క్రమక్రమంగా పెంచేందుకు చేపడుతోన్న పరీక్షల్లో రైలు గరిష్ఠంగా గంటకు 180 కిలోమీటర్ల వేగం అందుకుంది. ఈ మేరకు కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ఓ వీడియోను ఎక్స్ (ట్విట్టర్)లో పోస్ట్ చేశారు. అందులో వందే భారత్ స్లీపర్ ఎక్స్‌ప్రెస్ రైలు 180 కి.మీ. వేగంతో దూసుకెళ్లింది. అయితే, అంత వేగంలోనూ సీటు వద్ద ఉన్న ట్రేపై ఉంచిన గ్లాసులో చుక్క నీరు కూడా తొణకలేదు.

ప్రస్తుతం, ఈ వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ సూచనల మేరకు రాజస్థాన్‌లోని కోటా డివిజన్‌లో ఈ ట్రయల్ రన్ నిర్వహించారు. జనవరి 1న రైలును 130 కి.మీ. వేగంతో నడిపారు.

# చంద్రబాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ"

కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి





ఎమ్మిగనూరు జులై 29 మంగళవారం హామీల అమలులో పూర్తిగా విఫలమైన కూటమి ప్రభుత్వంపై ప్రజలు ప్రశ్నించాలి.వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు కామర్తి నాగేశప్ప, 2వ వార్డు కౌన్సిలర్ గడిగే అంపమ్మఎమ్మిగనూరు, జూలై 29: వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్,మాజీ పార్లమెంట్ సభ్యురాలు శ్రీమతి బుట్టా రేణుక గారి ఆదేశాల మేరకు ఎమ్మిగనూరు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం 1వ, 2వ వార్డుల్లో తెరుబజార్ ప్రాంతంలో "చంద్రబాబు ష్యూరిటీ %-% మోసం గ్యారంటీ" అనే చైతన్యాత్మక ప్రచార కార్యక్రమం పార్టీ పట్టణ అధ్యక్షుడు, 1వ వార్డు కౌన్సిలర్ కామర్తి నాగేశప్ప, 2వ వార్డు కౌన్సిలర్ గడిగే అంపమ్మ,2వ వార్డ్ ఇంచార్జ్ గడిగే చంద్ర గార్ల ఆధ్వర్యంలో నిర్వహించబడింది.స్థానిక ప్రజలకు కూటమి ప్రభుత్వ హామీల తాలూకా వాస్తవ పరిస్థితిని వివరిస్తూ క్యూఆర్ కోడ్‌ల ద్వారా ప్రజలకు ఆ హామీలపై అమలు స్థితి, సమాచారాన్ని అందజేశారు. కూటమి ప్రభుత్వంగా అధికారంలోకి వచ్చిన కూటమి టీడీపీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని నాయకులు విమర్శించారు

వైయస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం చేనేత రంగాన్ని ఆదుకునేందుకు అనేక మార్గాల్లో విశేష ప్రయత్నాలు చేసింది. "నేతన్న నేస్తం" వంటి పథకాలు అమలు చేసి, రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది చేనేత కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించారు. ఈ పథకం ద్వారా ప్రతి అర్హత కలిగిన చేనేత కుటుంబానికి రూ.24,000 చొప్పున సంవత్సరానికి నేరుగా వారి ఖాతాలో జమ చేయడం జరిగింది. ప్రభుత్వ సహకారం కారణంగా ముడిసరుకు అందుబాటులోకి వచ్చింది, ఉత్పత్తులకు మార్కెట్ లభించింది. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా అన్ని సంక్షేమ పథకాలు నేరుగా చేనేత కుటుంబాల దాకా చేరేలా చేసారు.పారదర్శక పాలనతో నేతన్నలు ప్రభుత్వంపై నమ్మకంతో ముందుకు సాగారు. చేనేత వస్త్రాల కొనుగోళ్లను ప్రభుత్వం ప్రోత్సహించి, విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో వీటి వినియోగాన్ని పెంచింది. అంతేకాక, ఈ-కామర్స్ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చి, చేనేత ఉత్పత్తులకు దేశవ్యాప్తంగా మార్కెట్ అందేలా చేశారు. మొత్తంగా గత జగన్ పాలనలో చేనేత జీవనోపాధికి బలమైన మద్దతు లభించింది.ఇక తాజాగా అధికారంలోకి వచ్చిన చంద్రబాబు గారి కూటమి ప్రభుత్వం, ఎన్నికల సమయంలో చేనేత రంగానికి వాగ్దానాలు చేసినప్పటికీ, అధికారంలోకి వచ్చాక మొదటి నుంచే మోసపూరిత ధోరణిని అవలంబిస్తోంది. ప్రభుత్వం ఏర్పడి నెల రోజులైనా "నేతన్న నేస్తం" వంటి పథకాలపై ఎటువంటి ప్రకటన చేయలేదు. గతంలో అమలైన పథకాల్ని సమీక్షిస్తున్న పేరుతో నిలిపివేసింది. నేతన్నల ఖాతాల్లో వేసిన నగదు నిలిపివేయడం ద్వారా వారి కుటుంబాల జీవనాధారం గందరగోళానికి గురైందిఎన్నికల ముందు తాము తీసుకువస్తామని చెప్పిన ప్రత్యేక పథకాల గురించి ప్రభుత్వం నోరు మెదపకపోవడం వల్ల నేతన్నలు తీవ్ర నిరాశలో ఉన్నారు. మార్కెట్ లింకేజీలు, ముడిసరుకు సబ్సిడీలు, ఉత్పత్తులకు ఆర్డర్లు వంటి అంశాల్లో కొత్త ప్రభుత్వం ఒక్క అడుగు కూడా ముందుకేసిన సూచనలు కనిపించడం లేదు. పథకాలు అమలుకాని స్థితిలో చేనేత రంగం తిరిగి మగ్గిపోవడం ప్రారంభమైంది.

## జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులు భూసేకరణ, నిర్మాణ పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలి : జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్

తిరుపతి,, ఉత్తేజిత ప్రతినిధి, జూలై 29



జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్ట్ పనులు సంబంధించిన పలు భూ సంబంధిత పెండింగ్ నిర్మాణ పనులను ప్రణాళిక భద్దంగా నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని జిల్లా జాయింట్ శుభం బన్సల్ తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జాతీయ రహదారులకు, రైల్వే ప్రాజెక్ట్ పనులు సంబంధించిన పలు భూ సంబంధిత పెండింగ్ అంశాలు, నిర్మాణ పురోగతి పనులపై జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ తో కలిసి జిల్లా కలెక్టర్ వర్చువల్ విధానంలో తిరుపతి, నెల్లూరు , చెన్నై నేషనల్ హైవే పి డి లు, గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి ఆర్డీఓలు, కిరణ్మయి, భానుప్రకాష్ రెడ్డి సంబంధిత మండలాల తాసిల్దార్లు తదితర సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... తిరుపతి జిల్లాలో జాతీయ రహదారుల అభివృద్ధి కొరకు చేపడుతున్న జాతీయ రహదారుల నిర్మాణ పనులు, రైల్వే ప్రాజెక్ట్ పనులు పురోగతిలో ఉన్న పనులపై రేణిగుంట, పూడి, గూడూరు, రేణిగుంట, పాకాల, తిరుపతి టౌన్ సంబంధించిన రైల్వే ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలన్నారు. నడికుడి శ్రీకాళహస్తి రైల్వే ప్రాజెక్టు పనులకు సంబంధించిన పనులు వేగవంతం చేయాలని తెలిపారు. ఆరు లైన్లు రహదారులు నిర్మాణం, తిరుపతి బైపాస్ వేగవంతం చేయాలని, రేణిగుంట నుండి చెన్నై రహదారుల పనులు పూర్తి చేయాలని భూ సేకరణకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. ప్యాకేజీ 2,3,4 జాతీయ రహదారి పనులు సాగరమాల కింద చేపట్టిన వాటిని పెండింగ్ లేకుండా రెవెన్యూ డివిజనల్ అధికారులు నేషనల్ హైవే అధికారులతో సమన్వయంతో చేసుకొని నాణ్యత తో పనులుపూర్తి కావాలని అన్నారు. తిరుపతి రేణిగుంట బైపాస్ సంబంధించిన పెండింగ్ భూ సమస్యలను పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ లను ఆదేశించారు. ఏపీఐఐసీ ప్యాకేజీ 5, ఎడిబి రోడ్లు పనులు త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ విజయ్ భరత్ రెడ్డి, డెప్యూటీ తాసిల్దార్ లు, తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరు పట్టణంలో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులపై లాఠీచార్జి చేయించిన పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ సీఐ శ్రీనివాసరావును తక్షణమే సస్పెండ్ చేయాలి సిఐటియు డిమాండ్

కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి



ఎమ్మిగనూరు జులై 29 మంగళవారం నెల్లూరు పట్టణ పురపాలక సంఘంలో పారిశుద్ధ్య కార్మికులను ప్రైవేటీకరణ చేయడానికి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నది మా కడుపు కొట్టొద్దు. పరిశుద్ధ కార్మికులను రెగ్యులర్ చేయాలని పోరాటాలు చేస్తుంటే నెల్లూరు సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ సిఐ గారైన రౌడీ మాదిరిగా వ్యవహరిస్తూ పారిశుద్ధ కార్మికులను రక్త గాయాలయ్యే వరకు నాటి చార్జి చేయడం కూటమి ప్రభుత్వంలో రౌడీ రాజ్యమేలుతుందని సిఐటియు మండల కార్యదర్శి బి రాముడు విమర్శించారు ఎమ్మిగనూరు పట్టణ కేంద్రంలో మున్సిపల్ ఆఫీసు నందు మాట్లాడుతూ నెల్లూరు పురపాలక సంఘమును పారిశుద్ధ్య కార్మికులను ప్రైవేటీకరణ చెయ్యొద్దు మా కడుపులు కొట్టుదని పారిశుద్ధ కార్మికులు 14 రోజుల నుండి ఆందోళన చేస్తున్న వీరిని చర్చలకు పిలవకుండా రాష్ట్ర ప్రభుత్వం జిల్లా ప్రభుత్వ యంత్రాంగం పోలీసులను రెచ్చగొట్టి కార్మికులపై ఉసిగొలిపి రౌడీ మాదిరిగా పారిశుద్ధ కార్మికులను రక్త గాయాలయ్యేటట్లు లాఠీచార్జి చేయడం చాలా అన్యాయం అన్నారు గత ప్రభుత్వం పారిశుద్ధ కార్మికుల సమస్యలు పట్టించుకోలేదని మా ప్రభుత్వం వస్తే పారిశుద్ధ్య కార్మికులను రెగ్యులర్ చేస్తామని వేతనాలు పెంచుతామని ముఖ్యమంత్రి అనేక సభల్లో ప్రకటించారు మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు చేపట్టిన 17 రోజులు సమ్మెలో తెలుగుదేశం నాయకులు సమ్మె శిబిరములకు వచ్చి మీకు మేము అండగా ఉంటామని మద్దతు తెలిపారు ప్రభుత్వం వచ్చిన తర్వాత మున్సిపల్ పారిశుద్ధ కార్మికుల సమస్యలు పట్టించుకోగా పోలీసులు రెచ్చగొట్టి రౌడీ మూకల మాదిరిగా వ్యవహరించారని సిఐటియు నాయకులు విమర్శించారు తక్షణమే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పారిశుద్ధ కార్మికులను పూలతో సత్కరించి చంద్రబాబు నాయుడు ఫాలో సత్కరించి పారి శుద్ధి కార్మికులను గౌరవిస్తామని తెలిపిన రోజులు పోలీసులకు గుర్తు రాదా అని తెలిపారు కాబట్టి పారిశుద్ధ కార్మికులపై అన్యాయంగా పోలీసులు లాటించార్జ్ చేయించిన నెల్లూరు సిఐ శ్రీనివాసరావును తక్షణమే సస్పెండ్ చేయాలని సిఐటియు నాయకులు ప్రభుత్వాన్ని

డిమాండ్ చేశారు అలాగే కూటమి ప్రభుత్వం దళితులు పేదలు బలహీన వర్గాల కార్మికులపై పోలీసులు దౌర్జన్యాల ఆపాలని వీరికి

రక్షణ కల్పించాలని వీరి సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ సమావేశంలో మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ అధ్యక్ష కార్యదర్శులు బి కేసన్న కే ఇస్మాయిల్ జే నాగరాజు ఎం నరసప్ప కే కాజా తిక్కయ్య రంగస్వామి తదితరులు పాల్గొన్నారు

## కర్నూలు జిల్లా కేడిసిసి బ్యాంకు ప్రెసిడెంట్ డి. విష్ణువర్ధన్ రెడ్డి గారిని అలాగే కేడిసిసి బ్యాంకు సిఇఓ రామాంజినేయులు సార్ గారిని మర్యాద పూర్వకంగా కలిసిన

కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి







గోనెగండ్ల జులై 29 మంగళవారం కేడీసీసీ బ్యాంకు ప్రెసిడెంట్ డి విష్ణువర్ధన్ రెడ్డిని మర్యాదపూర్వం కలిసిన గోనెగండ్ల సింగిల్ విండో ప్రెసిడెంట్ ఎన్ వి రామాంజినేయులు గారు మరియు ఎన్ వి శ్రీధర్ నాయుడు,సర్పంచ్ పూజారి చంద్రశేఖర్,అడ్వకెట్ వెంకటేశ్వర్లు, ఎన్వీ బాబు నాయుడు,ఎన్వీ మద్దిలేటి తదితరులు కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోనెగండ్ల సొసైటీ లోని రైతులందరితో సకాలంలో అప్పులను కట్టించి అర్హులైన ప్రతి రైతుకి సబ్సిడీ రుణాలను, ఎరువులను అలాగే సబ్సిడీ విత్తనాలను ఇప్పించి జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలపాలని వారు కోరారు. రైతుల సమస్యలను త్వరగా తీర్చేలా చూడాలని వారు సూచించారు. అలాగే సింగిల్ విండో ప్రెసిడెంట్ ఎన్వీ రామాంజినేయులు మాట్లాడుతూ మా సొసైటీకి అవసరమైన ఎల్ టి మరియు క్రాప్ లోన్లు మంజూరు చేయాలని వారిని కోరారు. ఎందుకు వారు సానుకూలంగా స్పందించి కచ్చితంగా చేస్తామన్నారు.

## ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధి టిడిపి తోనే సాధ్యం- ఎమ్మెల్యే కోట్ల

బేతంచర్ల : ఉత్తేజిత ప్రతినిధి



: ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధి టిడిపి ప్రభుత్వంతోనే సాధ్యం అని డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి,అన్నారు.బేతంచెర్ల మండల పరిధిలోని కొలుముల పల్లె,బలపాలపల్లె, పాపసాని కొట్టాల, తవిసి కొండ,గ్రామలలో సూపరిపాలనలో తోలి అడుగు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ... ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు సూపర్ 6 పథకాలు హామీ ఇచ్చిందని,అందులో తల్లికి వందనం,ఫ్రీగ్యాస్,మెగా డీఎస్సీ,ఆగస్టు1న అన్నదాత సుఖీభవ,ఆగస్టు 15న అక్క చెల్లెమ్మలకు ఉచిత బస్సు సౌకర్యం మొదలగు పథకాలు అందజేసిందిని

,త్వరలోపూర్తిస్థాయి లో పథకాలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రజలకు అందజేస్తుందని ఆయన తెలియజేశారు.మండల కన్వీనర్ ఎల్లనాగయ్య,పోలురు రాఘవరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు పాల శేఖర్,పోలూరు శ్రీనివాస్ రెడ్డి,భీమేశ్వర్ రెడ్డి,ఉన్నం సుధాకర్,

ఈశ్వరయ్య,నాగరాజు,రమేష్,రామనాథం, టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

08

## అలిపిరి - జూపార్కు మార్గంలో వ్యర్థాలు వేయకుండా చర్యలు చేపట్టండి.

తిరుపతి,ఉత్తేజిత ప్రతినిధి, జూలై 29.



అలిపిరి నుండి జూ పార్కు వెళ్ళే మార్గంలో రోడ్డు పక్కన ఎటువంటి వ్యర్థాలు వేయకుండా తగు చర్యలు చేపట్టాలని నగరపాలక సంస్థ అధికారులను కమిషనర్ ఎన్.మౌర్య ఆదేశించారు. అలిపిరి నుండి చెర్లోపల్లి వరకు వెళ్ళే మార్గాన్ని మంగళవారం నగరపాలక సంస్థ అధికారులతో కలసి కమిషనర్ పరిశీలించారు. అలిపిరి నుండి జూ పార్కు వరకు రోడ్డుకు ఇరువైపులా చెత్త, భవన నిర్మాణ వ్యర్థాలు ఉండడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అలిపిరి నుండి జూ పార్కు వరకు భవన నిర్మాణ వ్యర్థాలు, ఆహార పదార్థాల వ్యర్థాలను వేయడం వలన కుక్కలు, వన్య ప్రాణులు వస్తున్నాయని అన్నారు. దీంతో చిరుత పులులు వంటివి రోడ్లపైకి రావడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని అన్నారు. అలిపిరి నుండి రోడ్డు పక్కన ఎక్కడా వ్యర్థాలు వేయకుండా సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. రాత్రి సమయాల్లో ప్రత్యేకంగా సిబ్బందితో పెట్రోలింగ్ ఏర్పాటు చేసి వ్యర్థాలను వేసే వారిని గుర్తించి జరిమానాలు విధించాలని అన్నారు. రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన దుకాణాలను తొలగించి, పారిశుద్ధ్యం మెరుగ్గా ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్ గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫీసర్ రవి, డీసీపీ ఖాన్, డి.ఈ. మధుబాబు, ఏసిపి బాలాజి, వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ నాగేంద్ర, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య, తదితరులు ఉన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

బేతంచెర్ల : ఉత్తేజిత ప్రతినిధి : బేతంచర్ల పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో కౌన్సిల్




సర్వసభ సమావేశం జరిగింది నగర పంచాయతీలో నెలకొన్న సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తానని చైర్మన్ సిహెచ్ చల్లం రెడ్డి,కమిషనర్ హరిప్రసాద్,లు అన్నారు. మంగళవారం పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలోవార్డ్ కౌన్సిల్ సర్వ సభ సమావేశం నిర్వహించారు.వార్డులలో నెలకొన్న పలు సమస్యలపై వార్డ్ కౌన్సిల్ సమావేశం దృష్టికి తీసుకువచ్చారు.డ్రైనేజీ కాలువలు,సిసి రోడ్లు,చైర్మన్ మాట్లాడుతూ సత్రం దగ్గర నుండి కొలుముల పల్లె ట్యాంక్ వరకు 800 మీటర్లు ఉంటే 8స్పీడ్ బ్రేకర్లు వేయడం సరైనది కాదని చైర్మన్ సిహెచ్ చలం రెడ్డి,అన్నారు.ప్రమాదాల నివారణ కొరకు వేసినందున ఇబ్బందులు కలగకుండా చూడాలని అవసరమైన చోట స్లోపుగా వేయాలని వారు అన్నారు.

# కొడుకులే కాడెద్దులైన వేళ...

సి.బెళగల్ ఉత్తేజిత న్యూస్

పొలం సాగు చేయాలంటే కచ్చితంగా నాగలిపట్టాలి. పంట వేసే ముందు దుక్కి దున్ని నారు పోసి నీరు పెట్టాలి. కానీ రైతు దగ్గర ఎద్దులు లేవు. ఇక బాడుగలు భరించలేక కొడుకులనే కాడెద్దులుగా చేసుకొని ఉల్లి పంట లో దెంత లాగుడు పని చేపట్టారు. వివరాల్లోకి వెళితే మంగళవారంసి.బెళగల్ మండలం పోలకల్ గ్రామానికి చెందిన పూలదాస్ ఇమ్మానుయేలు తనకున్న ఎకరాన్నర పొలంలో ఉల్లి పంట సాగు చేశాడు. ఉల్లి పంటలు గడ్డి తీయడానికి కూలీల ఖర్చు, ఎద్దుల బాడుగ ఖర్చు భరించలేక తన కొడుకులని కాడెద్దులుగా చేసుకొని ఉల్లి పంటలో గడ్డి తీసేందుకు దెంతలాగుడు పని చేపట్టారు. ఉల్లి పంటలు దెంతలాగడానికి ఎద్దుల బాడుగ ప్రస్తుతం గ్రామంలో 2000 వరకు ఉందని, బాడుగలు భరించలేక తన కొడుకులని కాడెద్దులుగా మార్చుకొని తనకున్న ఎకరాన్నార పొలంలో కూలి మనిషి సహాయంతో దెంతలాగుడు పని చేపట్టామని తెలిపారు. ఇమ్మానియేల్ కుమారుడు బాలు ఇంటర్ పూర్తి చేశారని, ఆనంద్ పదవ తరగతి పూర్తి చేశారని రైతు ఇమ్మానియేల్ తెలిపారుఉల్లి పంటలో దెంత లాగుతున్న దృశ్యం





## తిరుపతి నుంచి షిరిడికి ప్రత్యేక రైళ్లు..

తిరుపతి: ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని దక్షిణ మధ్య రైల్వే మరో కీలక నిర్ణయం తీసుకుంది. తిరుపతి సాయినగర్ షిరిడి మధ్య ప్రత్యేక రైలు సర్వీసులు నడపనుంది. ఆగస్ట్ 3వ తేదీ నుంచి సెప్టెంబర్ 29 వరకూ తిరుపతి షిరిడి ప్రత్యేక రైళ్లు అందుబాటులో ఉంటాయని దక్షిణ మధ్య రైల్వే ఓ ప్రకటనలో వెల్లడించింది. ప్రతి ఆదివారం తిరుపతి నుంచి షిరిడీ ప్రత్యేక రైలు బయల్దేరనుంది. మొత్తం 18 ప్రత్యేక రైలు సర్వీసులను దక్షిణ మధ్య రైల్వే అందుబాటులోకి తెస్తోంది.

రైళ్లల్లో ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని దక్షిణ మధ్య రైల్వే మరో కీలక నిర్ణయం తీసుకుంది. ముఖ్యంగా ఆధ్యాత్మిక ప్రాంతాలైన తిరుపతి , షిరిడి మధ్య నడిచే రైళ్లల్లో ప్రయాణికుల రద్దీని అధికంగా ఉంటోంది. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని తిరుపతి షిరిడీ మధ్య 18 ప్రత్యేక రైలు సర్వీసులు నడపాలని దక్షిణ మధ్య రైల్వే నిర్ణయించింది. ఆగస్ట్ 3వ తేదీ నుంచి సెప్టెంబర్ నెలాఖరు వరకూ తిరుపతి షిరిడి ప్రత్యేక రైలు సర్వీసులు ప్రయాణికులకు అందుబాటులో ఉంటాయి. ఆగస్ట్ 3 నుంచి సెప్టెంబర్ 29 వరకూ తిరుపతి సాయినగర్ షిరిడి మధ్య 18 ప్రత్యేక రైలు సర్వీసులను దక్షిణ మధ్య రైల్వే నడపనుంది.

ఆగస్ట్ మూడో తేదీ నుంచి 07637 నంబర్‌తో తిరుపతి సాయినగర్ షిరిడి రైలు ప్రతి ఆదివారం అందుబాటులో ఉంటుంది. ఆదివారం ఉదయం నాలుగు గంటలకు తిరుపతి రైల్వేస్టేషన్‌లో బయల్దేరే తిరుపతి – షిరిడి ప్రత్యేక రైలు.. రేణిగుంట జంక్షన్, గూడూరు, నెల్లూరు, ఒంగోలు రైల్వేస్టేషన్, చీరాల, తెనాలి, గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి, మిర్యాలగూడ, నల్గొండ, సికింద్రాబాద్, లింగంపల్లి, వికారాబాద్, జహీరాబాద్, బీదర్, భల్కి, ఉద్గిర్ రైల్వేస్టేషన్, లాతూర్ రోడ్, పర్లి, గంగాఖేర్, పర్భని, సేలు, జల్నా, ఔరంగాబాద్ స్టేషన్, నాగరసోల్, మన్మడ్, కోపర్‌గావ్ రైల్వేస్టేషన్ల మీదుగా సాయినగర్ షిరిడికి మరుసటి రోజు (సోమవారం) ఉదయం 10 గంటల 45 నిమిషాలకు చేరుకుంటుంది. ఆగస్ట్ 3 నుంచి సెప్టెంబర్ 28 వరకూ ప్రతి ఆదివారం ఈ రైలు అందుబాటులో ఉంటుంది.

మరోవైపు 07638 నంబర్?తో సాయినగర్ షిరిడీ నుంచి తిరుపతికి కూడా ప్రత్యేక రైలు సర్వీసులు అందుబాటులో ఉన్నాయి. ఆగస్ట్ నాలుగో తేదీ నుంచి సెప్టెంబర్ 29వ తేదీ వరకూ ప్రతి సోమవారం రాత్రి 7 గంటల 35 నిమిషాలకు షిరిడి తిరుపతి ప్రత్యేక రైలు అందుబాటులో ఉంటుంది. సోమవారం రాత్రి 7:35 గంటలకు షిరిడిలో బయల్దేరే ఈ ప్రత్యేక రైలు.. బుధవారం తెల్లవారుజామున ఒంటి గంట 30 నిమిషాలకు తిరుపతి రైల్వేష్టేషన్ చేరుకుంటుంది. తిరుపతి సాయినగర్ షిరిడి ప్రత్యేక రైళ్లల్లో.. ఏసీ టూటైర్, ఏసీ త్రీటైర్ క్లాసులతో పాటుగా స్లీపర్, జనరల్ సెకండ్ క్లాస్ బోగీలు కూడా అందుబాటులో ఉంటాయని దక్షిణ మధ్య రైల్వే ఓ ప్రకటనలో వెల్లడించింది.

## ఏపీకి భారీగా పెట్టుబడులు.. ఐదు జిల్లాలకు మహర్దశ

ఆంధ్రప్రదేశ్: భారీగా పెట్టుబడులు రానున్నాయి. అనకాపల్లి జిల్లాలో లారస్ ఫార్మా జోన్, సోలార్ ప్యానెళ్ల తయారీ యూనిట్‌లు ఏర్పాటు కానున్నాయి. శ్రీకాకుళంలో లైట్ బ్రిక్స్ తయారీ యూనిట్, కర్నూలులో సోలార్ ప్యానెళ్ల తయారీ యూనిట్‌లు రానున్నాయి. చిత్తూరు జిల్లాలో డెయిరీ ఉత్పత్తుల కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం భూములను కేటాయించింది. దీని ద్వారా వేల కోట్ల పెట్టుబడులు, ఉద్యోగాలు లభించనున్నాయి. ఆయా జిల్లాల్లో పరిశ్రమలు ఏర్పాటుకానున్నాయి. ఫార్మా, సోలార్ ప్యానల్ల తయారీ, లైట్ బ్రిక్స్ ఇలా పలు కంపెనీలు ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం భూముల్ని కేటాయించింది. ఏపీ ప్రభుత్వం అనకాపల్లి జిల్లాలో లారస్ ఫార్మా జోన్ అభివృద్ధికి భూమిని కేటాయించింది. రాంబిల్లి ఇండస్ట్రియల్ పార్క్ ఫేజ్–2లో 531.77 ఎకరాల భూమిని కేటాయించింది. ఈ భూమికి సంబంధించి.. ఎకరానికి రూ.30 లక్షల చొప్పున లారస్ సంస్థ సంస్థ చెల్లించనుంది. ఆ సంస్థ వివిధ దశల్లో రూ.5,600 కోట్ల పెట్టుబడులు.. 6,350 మందికి ఉపాధి కల్పించనుందని డీపీఆర్‌లో పేర్కొన్నట్లు ప్రభుత్వం తెలిపింది.

మరోవైపు అనకాపల్లిలో జిల్లాలోనే మరో పరిశ్రమ ఏర్పాటుకానుంది. రాంబిల్లిలో ఆర్‌ఈ న్యూ సంస్థ 6 గిగావాట్ల సోలార్ ప్యానల్ల తయారీ యూనిట్ ఏర్పాటు చేయనుంది. ఈ మేరకు వారికి ఆ సంస్థకు 135.96 ఎకరాలు కేటాయించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ యూనిట్ ఏర్పాటుతో రూ.3,700 కోట్ల పెట్టుబడులు.. 1,200 మందికి ఉపాధి లభిస్తుందని చెబుతున్నారు. ఇటు శ్రీకాకుళం జిల్లాలో కూడా మరో కంపెనీ ఏర్పాటు చేయనున్నారు. ఏఏసీ లైట్ బ్రిక్స్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేసేందుకు వీఎస్‌ఆర్ సర్కన్ ఇండస్ట్రీస్ సంస్థ వచ్చింది. రణస్థలం మండలం సాంచంలో ఈ సంస్థకు ఎకరానికి రూ.11.62 లక్షల చొప్పున 22.45 ఎకరాల భూమిని కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

కర్నూలు జిల్లాకు మరో సోలార్ ప్యానల్ల తయారీ యూనిట్ ఏర్పాటుకానుంది. ఓర్వకల్లు మెగా ఇండస్ట్రియల్ హబ్‌లో రూ.6,933 కోట్ల పెట్టుబడితో 5 గిగావాట్ల సోలార్ సెల్, 5 గిగావాట్ల సోలార్ మాడ్యూల్ల తయారీ యూనిట్‌ను అగస్త్య ఎనర్జీ ఇండస్ట్రీస్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ ఏర్పాటు చేయనుంది. ఈ యూనిట్ ఏర్పాటుతో మొత్తం 2,138 మందికి ఉపాధి కల్పించే ఈ ప్రాజెక్టుకు ప్రత్యేక ప్రోత్సాహకాలను అనుమతించింది ప్రభుత్వం. మల్లవల్లి మెగా ఫుడ్ పార్క్‌లో అవిశా ఫుడ్స్ అండ్ ఫ్యూయల్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు 13.85 ఎకరాలు, మోడల్ ఇండస్ట్రియల్ పార్క్‌లో 115.65 ఎకరాలను ఎకరం రూ.16.5 లక్షల చొప్పున కేటాయిస్తూ ఉత్తర్వుల జారీ చేశారు.

### గులకరాయి దాడి కేసు నిందితుడు

# సతీష్ ఆచూకీ దొరికింది..

విజయవాడ: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై రాయి దాడి కేసులో నిందితుడు వేముల సతీష్ కుమార్ కడపలో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. తల్లిదండ్రులు మందలించడంతోనే సతీష్ ఇంటి నుంచి వెళ్లిపోయా డని లాయర్ సలీమ్ తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా జగన్‌పై రాయి దాడి జరగడం అప్పట్లో సంచలనంగా మారింది. ఈ కేసుతో తనకు సంబంధం లేదని సతీష్ ఆరోపించాడు. బెయిల్‌పై విడుదలైన సతీష్, ఆ తరువాత కనిపించకుండా పోయాడు. పోలీసులు అతడి ఆచూకీ కనుగొనడంతో ఊపిరి పీల్చుకున్నారు.

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై గులకరాయితో దాడి చేసిన కేసులో నిందితుడిగా ఉన్న వేముల సతీష్ కుమార్ ఆచూకీ దొరికింది. సతీష్ కడపలో ఉన్నట్లు విజయవాడ పోలీసులు గుర్తించారు. అక్కడి నుంచి సతీష్‌ను విజయవాడకు తీసుకొచ్చారు.. తల్లిదండ్రులకు అప్పగించారు. తల్లిదండ్రులు మందలించడంతోనే సతీష్ ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు లాయర్ సలీమ్ చెబుతున్నారు. కుమారుడి ఆచూకీ దొరకడం.. తిరిగి ఇంటికి రావడంతో తల్లిదండ్రులు ఆనందంలో ఉన్నారు. విజయవాడలోని నివాసంలో సతీష్ ఈ నెల 17న రాత్రి తల్లిదండ్రులతో కలిసి నిద్రపోయాడు. అయితే ఈ నెల 18న ఉదయం ఇంట్లో సతీష్ కనిపించకపోవడంతో అతడి కోసం తల్లిదండ్రులు గాలించారు.. అతడి ఆచూకీ తెలియకపోవడంతో ఈ నెల 20న విజయవాడ సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.. దీంతో వారు వెతికి ఆచూకీ కనిపెట్టారు. అయితే పోలీసులు సతీష్ కనిపించకపోవడంతో రాజకీయ కారణాలు ఉన్నాయా?.. ప్రేమ వ్యవహారమే కారణమా అని అనుమానించారు. అయితే చివరికి తల్లిదండ్రులు మందలించడంతోనే ఇలా వెళ్లిపోయినట్లు తేలింది.

2024 ఎన్నికల సమయంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మేమంతా సిద్ధం బస్సు యాత్ర నిర్వహించారు. ఏప్రిల్ 13 రాత్రి విజయవాడ అజిత్ సింగ్ నగర్ వివేకానంద స్కూల్ సెంటర్ దగ్గర.. వైఎస్ జగన్ బస్సుపై ఉన్న సమయంలో రాయితో దాడి జరిగింది. ఈ ఘటనలో వైఎస్ జగన్ ఎడమ కంటికి, ఆయన పక్కనే ఉన్న స్థానిక ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాస్ కంటికి కూడా గాయాలయ్యాయి. ఈ ఘటనలో వేముల సతీష్ కుమార్ అనే కుర్రాడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటన అప్పట్లో సంచలనంగా మారింది. అయితే ఈ కేసుతో తనకు సంబంధంలేదని.. తనను ఇరికించారని సతీష్ అన్నాడు. తాను ఏ తప్పు చేయకపోయినా అరెస్ట్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేరం ఒప్పుకోవాలని తనను పోలీసులు బెదిరించినట్లు సతీష్ చెప్పుకొచ్చారు. ఆరోజు బస్సు యాత్రకు వస్తే డబ్బులు ఇస్తారని చెప్పడంతో అక్కడికి వెళ్లానన్నారు. అప్పట్లో సతీష్ చేసిన ఆరోపణలు సంచలనంగా మారాయి. అయితే అతడ్ని జైలుకు తరలించగా.. కొద్ది రోజుల తర్వాత బెయిల్‌పై విడుదలయ్యాడు. కోడి కత్తి శ్రీను కేసులో లాయర్‌గా ఉన్న సలీమ్ సతీష్ తరపున కోర్టులో వాదనలు వినిపించారు. ఈ కేసు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. అయితే చాలా రోజుల తర్వాత సతీష్ మాయం కావడంతో పోలీసులు కంగారుపడ్డారు.. చివరికి అతడి ఆచూకీ దొరకడంతో ఊపిరి పీల్చుకున్నారు. సతీష్ తల్లిదండ్రులతో కలిసి విజయవాడలోనే నివాసం ఉంటున్నాడు.. రోజువారీ కూలి పనులు చేసుకుంటున్నాడు.



# ఆగస్ట్ 7న పక్కా, నెలకు రూ.2500 వరకూ లబ్ధి!

ఏపీ: చేనేతలకు తీపికబురు. చేనేత కుటుంబాల ఇళ్లకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. చేనేతల ఇళ్లకు నెలకు 200 యూనిట్ల వరకూ, పవర్ లూమ్స్‌కు 500 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ ఇవ్వాలని మార్చిలో జరిగిన మంత్రివర్గ సమా వేశంలో ఏపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తాజాగా ఆగస్ట్ 7న నుంచి ఈ ఉచిత విద్యుత్ పథకానికి శ్రీకారం చుట్టనున్నట్లు సమాచారం. ఆగస్ట్ 7న జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ పథకం ప్రారంభించే యోచనలో ఏపీ ప్రభుత్వం ఉన్నట్లు తెలిసింది.



రాష్ట్రంలోని చేనేత కార్మికులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం త్వరలోనే శుభవార్త వినిపించనుంది. ఆగస్ట్ 7వ తేదీన జాతీయ చేనేత దినోత్సవం జరుపుకోనున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే జాతీయ చేనేత దినోత్సవం నాడు.. రాష్ట్రంలోని నేత కార్మికులకు లబ్ధి చేకూరేలా కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఆధునిక సాంకేతికత మరింత అభివృద్ధి చెందుతున్న కొద్దీ సంప్రదాయ వృత్తులు, చేతివృత్తుల వారికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా నేతన్నల పరిస్థితి రోజురోజుకూ మరింత దిగజారుతోంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని వారికి ఆసరాగా ఉండేలా ఏపీ ప్రభుత్వం ఇటీవల కీలక నిర్ణయం తీసుకుంది. చేనేత కార్మికుల ఇళ్లకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ అందించాలని నిర్ణయించింది. అలాగే పవర్‌లూమ్స్‌లకు కూడా నెలకు 500 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ ఇవ్వాలని నిర్ణయించింది. మార్చి నెలలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఏపీ కేబినెట్‌లో చర్చించి ఈ ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. ఏపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కారణంగా రాష్ట్రంలోని 93 వేల చేనేత కార్మికుల కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది. అలాగే 10,534 పవర్‌లూమ్ యూనిట్లకు ప్రయోజనం చేకూరనుంది. 2024 ఏపీ ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వస్తే నేత కార్మికుల ఇళ్లకు ఉచితంగా విద్యుత్ అందిస్తామని టీడీపీ కూటమి హామీ ఇచ్చింది. ఇక ఇచ్చిన మాట మేరకు మంత్రివర్గ సమావేశంలో ఈ ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. అయితే పథకం మాత్రం ఇంకా అమల్లోకి తేలేదు. అయితే ఆగస్ట్ 7న జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేనేతల ఇళ్లకు ఉచిత విద్యుత్ పథకం అమలు చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. ఉచిత విద్యుత్ పథకం అమలు చేసేందుకు ఇప్పటికే అర్హులైన లబ్ధిదారులను గుర్తించే పనిలో అధికారులు ఉన్నారు. ఇక ఈ ఉచిత విద్యుత్ పథకం అమలు చేస్తే నేత కార్మికుల ఒక్కో కుటుంబానికి నెలకు రూ.950 నుంచి రూ.1,250 వరకూ ప్రయోజనం చేకూరనుంది. ఇక పవర్ లూమ్స్ విషయానికి వస్తే ఒక్కో నిర్వాహకుడికి నెలకు రూ.2,500 వరకూ లబ్ధి చేకూరనుంది. లబ్ధిదారులను క్షేత్రస్థాయిలో ఎంపిక చేసిన అధికారులు.. జాబితాను ఉన్నతాధికారు లకు సమర్పించారు. జాబితా పరిశీలన చేపట్టి.. ఆగస్ట్ ఏడు నుంచి చేనేతలకు ఉచిత విద్యుత్ పథకం అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

## పొలంలో దొరికిన విలువైన వజ్రం..

ఆంధ్రప్రదేశ్: వజ్రాల వేట ఊపందుకుంది! ముఖ్యంగా కర్నూలు జిల్లాలో వర్షాలు కురుస్తుండటంతో, అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు జనం తండోపతండాలుగా తరలి వస్తున్నారు. ఓ రైతుకు విలువైన వజ్రం దొరకడంతో వ్యాపారులు బేరసారాలకు దిగారు. కానీ ధర విషయంలో ఏకాభిప్రాయం కుదరలేదు. వ్యాపారులు సిండికేట్ గా ఏర్పడి తక్కువ ధరకే కొంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంతకీ ఆ వజ్రం ఎంత ధర పలికిందో తెలుసా?

ఏపీలో వజ్రాల వేట మొదలైంది.. వర్షాలు కురుస్తుండటంతో కర్నూలు జిల్లాలో సందడి మొదలైంది. వజ్రాల కోసం తమ అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి ఎంతోమంది ఇతర ప్రాంతాల నుంచి కూడా వస్తారు. చిన్న రంగురాళ్లు తమ జీవితాలను మారుస్తాయని వారి నమ్మకం. కేవలం కర్నూలు జిల్లా నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి కూడా వజ్రాలను గాలించేందుకు వస్తున్నారు. అయితే తాజాగా కర్నూలు జిల్లాలో ఓ రైతుకు ఖరీదైన వజ్రం దొరికినట్లు తెలుస్తోంది. ఈ విషయం తెలియడంతో వ్యాపారులు రంగంలోకి దిగాడు.. ఆ వజ్రాన్ని బేరం పెట్టారు. అయితే వ్యాపారులు ఆ వజ్రాన్ని రూ.8 లక్షలకు కొనుగోలు చేస్తామని రైతుకు చెప్పారు.. కానీ రైతు మాత్రం వ్యాపారులకు షాకిచ్చారు. ఆ వజ్రాన్ని రూ.18 లక్షలకు ఇస్తానని చెప్పారట. దీంతో బేరం కుదరలేదని చెబుతన్నారు.. దానిని ఇంకా కొనుగోలు కాలేదని తెలుస్తోంది. అయితే వజ్రాల విషయంలో వ్యాపారులంతా కలిసి సిండికేట్ అయ్యారనే టాక్ వినిపిస్తోంది. తక్కువ రేటుకే వజ్రాలను కొనుగోలు చేస్తున్నారని రైతులు, కూలీలు ఆవేదన వ్యక్యం చేస్తున్నారు. ఖరీదైన వజ్రాలను తక్కువ ధరకే అమ్మేయమని తమపై ఒత్తిడి చేస్తున్నారని చెప్పుకొచ్చారు.



తుగ్గలి మండలం పెండేగల్లులో మూడు వారాల క్రితం ఓ మహిళా కూలీ పొలం పను చేస్తుండగా ఖరీదైన వజ్రం దొరికింది. అయితే అది 15 క్యారెట్లుగా తేల్చారు.. కానీ బేరం కుదరకపోవడంతో ఇంకా ఎవరూ కొనుగోలు చేయలేదని చెబుతున్నారు. మే నెలలో కూడా ఓ వ్యక్తికి పెరవలి దగ్గర రూ.30 లక్షల విలువ చేసే వజ్రం దొరికినట్లు ప్రచారం జరిగింది. ఓ వ్యాపారి ఆ వజ్రాన్ని కొనుగోలు చేశారట.. అలాగే పెరవలికి చెందిన ఓ రైతుకు వజ్రం దొరకగా..రూ.లక్షన్నర చెల్లించి కొనుగోలు చేశారట. ఇలా పలువురికి వజ్రాలు దొరికాయట.

కర్నూలు జిల్లా మాత్రమే కాదు అనంతపురం జిల్లాకూడా వజ్రాల వేట జరుగుతోంది. వజ్రకరూరు ప్రాంతంలో వర్షం పడితే తమకు అదృష్టం వస్తుందని అక్కడి ప్రజలు ఎదురు చూస్తున్నారు. వాన పడగానే పిల్లలు, పెద్దలు అందరూ వజ్రాల కోసం గాలిస్తున్నారు. ప్రతి ఏటా వర్షాకాలంలో వజ్రకరూరు మరియు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు పొలాల్లో వజ్రాల కోసం వెతుకుతారు. వర్షానికి భూమిలోపల ఉన్న వజ్రాలు బయటపడతాయని వారి నమ్మకం. మొత్తం మీద కర్నూలు, అనంతపురం జిల్లాల్లో వజ్రాల వేట కొనసాగుతోంది. అయితే ఈ వజ్రాల కోసం గాలిస్తున్నవారు తమ పొలాలను కాళ్లతో తొక్కేసి నాశనం చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందుకే వజ్రాల కోసం తమ పొలాల్లో వెతక్కొద్దంటూ కొందరు బోర్డులు ఏర్పాటు చేశారట.



# ఎక్స్‌ప్రెస్, మెము రైళ్లు రద్దు..

ఆంధ్రప్రదేశ్: విశాఖపట్నం శివారు ప్రాంతంలో.. తాడి–దువ్వాడ స్టేషన్ల మధ్య నాన్ ఇంటర్ లాకింగ్, ట్రాక్ పునరుద్ధరణ పనులు చేస్తున్నారు. ఈ కారణంగానే ఆగస్టు 26 నుంచి పలు ఎక్స్‌ప్రెస్, ప్యాసిం జర్ రైళ్లను రద్దు చేస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 26, 28, 30 తేదీల్లో విజయవాడ – విశాఖప ట్నం రత్నాచల్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (12718), కాకినాడ–విశాఖపట్నం (17267), విశాఖపట్నం–కాకినాడ మెము ప్యాసింజర్లు (17268), రాజమండ్రి–విశాఖపట్నం (67285), విశాఖపట్నం–రాజమండ్రి (67286), విశాఖపట్నం–విజయవాడ రత్నాచల్ (12717) రైళ్లను రద్దు చేస్తున్నట్టు వెల్లడించారు. ఆగస్టు 26, 30 తేదీల్లో గుంటూరు–విశాఖపట్నం (22876), విశాఖపట్నం–గుంటూరు ఉదయ్ ఎక్స్‌ప్రెస్ (22875) రద్దు చేసినట్లు ప్రకటించారు. విజయవాడ మీదుగా నడిచే రైళ్లను కూడా రద్దు చేశారు. విజయవాడ, గూడూరు సెక్షన్‌లో కొత్తగా మూడో రైల్వే లైను నిర్మాణ పనుల్లో భాగంగా నాన్ ఇంటర్ లాకింగ్ పనులతో మరికొన్ని రైళ్లను రద్దు చేశారు. ఈ నెల 28, 29.. వచ్చే నెల 6 నుంచి 24 వరకు విజయవాడ–గూడూరు మధ్య నడిచే 67225/67226 రైళ్లను రద్దు చేశారు. ఆగస్టు 14, 17, 18 తేదీల్లో గూడూరు–సికింద్రాబాద్‌ల మధ్య నడిచే 12709/12710 రైళ్లు రద్దయ్యాయి. ఆగస్టు 17, 18, 19 తేదీల్లో తిరుపతి–లింగంపల్లి మధ్య నడిచే 12733/12744 రైళ్లను రద్దు చేశారు. ఆగస్టు 11 నుంచి 20 వరకు విజయవాడ–గూడూరు మధ్య నడిచే 12743/12744 రైళ్లను రద్దు చేశారు. ఆగస్టు 11 నుంచి 19 వరకు నర్సాపూర్–ధర్మవరం మధ్య నడిచే 17247/17248 రైళ్లు రద్దు చేశారు. ఆగస్టు 12 నుంచి 19 వరకు రేణిగుంట–కాకినాడ టౌన్ మధ్య నడిచే 17249/17250 రైళ్లు రద్దయ్యాయి. ఆగస్టు 13 నుంచి 20 వరకు తిరుపతి–ఆదిలాబాద్ మధ్య నడిచే 17405/17406 రైళ్లను రద్దు చేశారు. ఆగస్టు 13 నుంచి 18 వరకు తిరుపతి–విశాఖపట్నం మధ్య నడిచే 22707/22708 రైళ్లను రద్దు చేశారు. ఆగస్టు 17, 18 తేదీల్లో తిరుపతి–నర్సాపూర్ మధ్య నడిచే 07131/07132 రైళ్లను రద్దు చేశారు.

## శ్రీకాళహస్తీశ్వరుడికి భక్తుడి ఖరీదైన కానుక..

తిరుపతి: జిల్లా శ్రీకాళహస్తి ఆలయానికి ఓ భక్తుడు రూ.12 లక్షల విలువైన బంగారు, డైమండ్ నెక్లెస్‌ను విరాళంగా అందజేశారు. ఇదిలా ఉండగా, ఆలయంలో రాహుకేతు పూజల కోసం వచ్చిన భక్తులు ఒక్కసారిగా పాము కనిపించడంతో భయంతో పరుగులు తీశారు. ఆలయ అధికారులు అప్రమత్తంగా ఉండి పామును అడవిలో వదిలిపెట్టారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి ఆలయానికి భక్తుడు ఖరీదైన కానుకను అందజేశారు. శ్రీకాళహస్తికి చెందిన డి శ్రీహరిశంకర్ అవదాని, డి.పద్మావతిలు సుమారు 100 గ్రాముల బంగారు డైమండ్ నెక్లెస్ శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామివారికి వితరణగా అందజేశారు. ఈ నెక్లెస్ విలువ రూ.12 లక్షలు ఉంటుందని చెబుతున్నారు. దీనిని ఆదివారం ఈవో బాపిరెడ్డిని కలిసి స్వయంగా అందజేశారు.. భక్తుడికి స్వామి అమ్మవార్ల తీర్థప్రసాదాలు అందజేశారు ఆలయ అధికారులు, పండితులు. తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తి ఆలయంలో రాహుకేతు క్షేత్రంలో ఓ పెద్ద పాము కనిపించడంతో భక్తులు భయపడ్డారు. సర్ప దోష నివారణ పూజల కోసం వచ్చిన భక్తులకు ఈ అనుభవం ఎదురైంది.

శ్రీకాళహస్తి ఆలయంలో రాహు కేతు పూజలు జరుగుతాయి.. దీని కోసం భక్తులు రూ.750 టికెట్ కొనుగోలు చేస్తారు. అయితే ఆదివారం నాడు పూజలు జరిగే మండపం మెట్ల దగ్గర పాము కనిపించింది. దీంతో భక్తులు ఒక్కసారిగా భయంతో పరుగులు తీశారు.. వెంటనే ఆలయ సిబ్బందికి సమాచారం అందించారు. ఆలయ సీఎస్వో వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే ఫారెస్ట్ సిబ్బంది ఆలయానికి చేరుకుని పామును జాగ్రత్తగా పట్టుకున్నారు.. దానిని ఒక సంచిలో బంధించి తీసుకెళ్లి రామాపురం అడవుల్లో వదిలిపెట్టారు. పామును సురక్షితంగా పట్టుకోవడంతో భక్తులు, ఆలయ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. శ్రీకాళహస్తి ఆలయంలో గతంలో కూడా పాములు కనిపించాయంటున్నారు. జాతక దోషాలు ఉన్నాయని, డబ్బులు పంపితే పూజలు చేయిస్తామని నమ్మిస్తున్నారు. ఉద్యోగం, పెళ్లి, పిల్లలు లేని బాధతో వచ్చే భక్తుల ఫోన్ నంబర్లు సేకరించి ఈ మోసాలకు పాల్పడుతున్నారు. ముఖ్యంగా యువతను లక్ష్యంగా చేసుకుని మోసగాళ్లు వల వేస్తున్నారు. పూజలు, హోమాలు పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నారు. ఈ విషయం ఆలయ అధికారుల దృష్టికి రాగా.. ప్రైవేటు వ్యక్తుల మోసాలకు గురికావద్దని అధికారులు సూచిస్తున్నారు.

## వీఐపీలు ఇలా చేస్తే బావుంటుంది..

తిరుమల: టీటీడీ నిధులను ఆధ్యాత్మిక కార్యక్రమాలకే వినియోగించాలని, రాజకీయ జోక్యం ఉండకూడదని సూచించారు. కన్నడ హీరో శివరాజ్ కుమార్, దర్శకుడు గోపీచంద్ మలినేని కూడా స్వామివారిని దర్శించుకున్నారు. తిరుమల శ్రీవారి దర్శనాల విషయంలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు కీలక సూచన చేశారు. వీఐపీలు ఏడాదికి ఒక్కసారి మాత్రమే తిరుమల శ్రీవారి దర్శనా నికి రావాలని సూచించారు.. ముఖ్యంగా ప్రజా ప్రతినిధులు ఈ నిబంధన పాటిస్తే బావుంటు ందన్నారు. సామాన్య భక్తులకు ప్రాధాన్యం ఇచ్చేందుకు ఈ సూచన చేశారు. టీటీడీ నిధుల్ని శ్రీవారి భక్తుల కోసం, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు మాత్రమే వినియోగించాలని.. ఈ నిధుల విషయంలో రాజకీయ జోక్యం ఉండకూడదన్నారు. ఊరికో గుడి, బడి ఉండాలని.. బడి బాధ్యత ప్రభుత్వానికి ఉంటే.. గుడి బాధ్యత టీటీడీ తీసుకోవాలని వ్యాఖ్యానించారు.

అంతకముందు వెంకయ్యనాయుడు సోమవారం ఉదయం వీఐపీ బ్రేక్ దర్శనంలో స్వామివారిని దర్శించుకున్నారు. దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు ఆశీర్వచనం అందించగా.. అడిషనల్ ఈవో వెంకయ్య చౌదరి తీర్థప్రసా దాలు అందజేశారు. మరోవైపు తిరుమల శ్రీవారిని కన్నడ హీరో శివరాజ్ కుమార్, దర్శకుడు గోపీచంద్ మలినేని, ఎమ్మెల్యేలు యశస్విని రెడ్డి, శ్రీధర్‌లు వేర్వేరుగా శ్రీవారిని దర్శించుకున్నారు. వీరు కుటుంబ సభ్యులతో కలిసి వీఐపీ బ్రేక్ దర్శనంలో స్వామివారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. 'తిరుపతి శ్రీ కోదండరామ స్వామివారి ఆలయంలో నవంబరులో పలు విశేష ఉత్స వాలు జరుగనున్నాయి. వాటి వివరాలు ఇలా ఉన్నాయి. ఆగస్టు 2, 9, 16, 23, 30 తేదీల్లో శనివారం సందర్భంగా ఉదయం 6 గంటలకు శ్రీ సీతారామ లక్ష్మణుల మూలవర్లకు అభిషేకం నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను ఆలయ నాలుగు మాడ వీధుల్లో తిరుచ్చిపై ఊరేగిస్తారు. ఆగస్టు 9వ తేదీన పౌర్ణమి సందర్భంగా



ఉదయం 9.30 గంటలకు శ్రీ సీతారామ లక్ష్మణుల ఉత్సవర్లకు అష్టోత్తర కలశాభిషేకం, సాయంత్రం 5.30 గంటలకు ఆలయ నాలుగు మాడ వీధుల నుంచి శ్రీరామచంద్ర పుష్కరిణి వరకు తిరుచ్చి ఉత్సవం నిర్వహిస్తారు. సాయం త్రం 6.30 గంటలకు ఆస్థానం చేపడతారు. ఆగస్టు 16న శ్రీకృష్ణాష్టమి ఆస్థానం. ఆగస్టు 18న ఉట్లోత్సవం. ఆగస్టు 20న పునర్వసు నక్షత్రం సంద ర్భంగా ఉదయం 11 గంటలకు శ్రీ సీతారాముల కల్యాణం జరుగనుంది. సాయంత్రం 5.30 గంటలకు స్వామి, అమ్మవారిని తిరుచ్చిపై ఆలయ నాలుగు మాడ వీధుల గుండా శ్రీరామచంద్ర పుష్కరిణి వద్దకు ఊరేగింపుగా తీసుకెళతారు. సాయంత్రం 6.30 గంటలకు ఊంజల్‌సేవ నిర్వహిస్తారు. ఆగస్టు 23న అమావాస్య సందర్భంగా ఉదయం 9 గంటలకు సహస్ర కలశాభిషేకం చేపడతారు. రాత్రి 7 గంటలకు హనుమంత వాహనసేవ జరుగనుంది' అని టీటీడీ విశేష ఉత్సవాలపై ఒక ప్రకటనలో తెలిపింది.

# ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటికీ మద్యం..



**తెలంగాణ:** కేసీఆర్ పాలనలో ప్రతి చేనుకు నీళ్లు అందించగా, రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రతి పల్లెకు మద్యాన్ని అందిస్తోందని కేటీఆర్ విమర్శిం చారు. కాంగ్రెస్ హయాంలో మద్యం అమ్మకాలు పెరిగి, రాష్ట్రం తాగుబోతుల తెలంగాణగా మారుతోందని ఆరోపించారు. మద్యం ద్వారా వచ్చే ఆదాయంపైనే ప్రభుత్వం దృష్టి పెట్టిందని, ఇది తెలంగాణ ప్రగతిని దెబ్బతీసే చర్య అని ఆయన అన్నారు. ఒక వ్యక్తి సగటున మద్యం కోసం చేసే ఖర్చు గణనీయంగా పెరిగిందని కేటీఆర్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

కేసీఆర్ పాలనలో ప్రతి చేనుకూ నీళ్లు అందిస్తే.. రేవంత్ సర్కార్‌లో ప్రతీ పల్లెకూ మద్యాన్ని అందిస్తున్నారంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటికీ మద్యం అంటూ ఎక్స్ వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. గతంలో మద్యం అమ్మకాలపై విమర్శలు చేసిన హస్తం పార్టీ.. ఇప్పుడు అదే మద్యం ద్వారా వచ్చిన ఆదాయం గడిస్తుందని ఎద్దేవా చేశారు. తెలంగాణను తాగుబోతుల తెలంగాణగా మారుస్తూ.. మద్యం ప్రియుల బలహీనతను రాష్ట్ర ఖజానా ఆదాయ వనరుగా మార్చుకునే కుట్ర జరుగుతోందని ట్వీట్ చేశారు. అన్ని రంగాల్లో తెలంగాణ ప్రగతిని దెబ్బతీసి.. ఇప్పుడు ఆదాయం కోసం మద్యం అమ్మకాలను కాంగ్రెస్ సర్కార్ నమ్ముకుందంటూ కేటీఆర్ అన్నారు. ఏడాది కిందట ఒక వ్యక్తి మద్యం కోసం రూ. 897 ఖర్చు చేస్తే.. ఏడాదిన్నర కాంగ్రెస్ హయాంలో అది సగటను రూ. 1,623కు పెరిగిందంటూ విమర్శించారు. రేవంత్ హయాంలో పాలన గాలికి.. ప్రగతి కాటికి అన్నట్లు మారిందంటూ ఆయన ఎద్దేవా చేశారు. "నాడు కేసీఆర్ పాలనలో పల్లె పల్లెకు ప్రగతి రథచక్రాలు, ప్రతి చేనుకు నీళ్లు ప్రతి చేతికి పని. ఇంటింటికీ తాగునీళ్లు, ఆడబిడ్డలకు తప్పిన ఇబ్బందులు. నాడు ప్రగతి బాట పట్టిన తెలంగాణను తాగుబోతుల తెలంగాణగా మారుస్తున్నారని నిందలు. నేడు పల్లె పల్లెలో మద్యం దుకాణాలు ఏర్పాటు చేసి మద్యం ప్రియుల బలహీనతను రాష్ట్ర ఖజానాకు ఆదాయ వనరుగా మార్చుకునే కుట్ర. అన్ని రంగాల్లో తెలంగాణ ప్రగతిని దెబ్బతీసి, ఇప్పుడు తీరిగ్గా ఆదాయం కోసం మద్యం అమ్మకాలను నమ్ముకున్న అసమర్థ కాంగ్రెస్ సర్కార్. ఏదాది కిందట సగటున ఒక వ్యక్తి మద్యం కోసం చేసే ఖర్చు రూ. 897, ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో సగటున ఒక వ్యక్తి మద్యం మీద చేస్తున్న ఖర్చు రూ. 1623కు పెరిగింది. లైసెన్స్ గడువు మూడేళ్లకు పెంచి, దరఖాస్తు ధర రూ. 3 లక్షలకు పెంచాలని నిర్ణయం. ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటికీ మద్యం.. పాలన గాలికి ప్రగతి కాటికి. జాగో తెలంగాణ జాగో" అంటూ కేటీఆర్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. రాష్ట్రంలోని ఎక్సైజ్ విధానంలో కాంగ్రెస్ పార్టీ కొత్త విధానాలు తీసుకురాబోతోంది. స్థానిక సంస్థల ఎన్నికలు ఉండటంతో ముందస్తు నోటిఫికేషన్ జారీ చేయాలంటూ ఇప్పటికే ఎక్సైజ్ శాఖకు కూడా ఆదేశాలు అందాయి. మండల పరిధిలో తక్కువ అమ్మకాలు ఉన్న వైన్స్ షాపులు గుర్తించి వాటిని గ్రామ స్థాయికి మార్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఏ4 దుకాణాలకు ప్రభుత్వం రెండేళ్లు ఉన్న లైసెన్స్ గడవును మూడేళ్లకు పెంచేలా ఎక్సైజ్ శాఖ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

## ముందు ఇన్నోవా, వెనుక డీసీఎం..

**హైదరాబాద్:** అంతా వాళ్లు అనుకున్నట్టే జరుగుతుంది. హైదరాబాద్ దాటేస్తే ఇక వాళ్ల రాతే మారిపోతుంది. ముందు ఇన్నోవా.. వెనుక డీసీఎం అంతా పక్కా ప్లాన్ ప్రకారమే జరుగుతుంది. కాసేపు కళ్లు మూసుకుంటే రూ. 5 కోట్లు చేతిలో వచ్చి పడతాయి. అందరి కళ్లల్లో ఆనందం.. సడెన్‌గా అప్పుడే ఈగల్ సర్‌ప్రైజ్ అటాక్ చేసింది. దెబ్బకు వాళ్ల ప్లాన్స్ అన్నీ తలకిందులు అయ్యాయి.. వాళ్ల చేతికి బేడీలు పడటంతో ఇప్పుడు ఊసలు లెక్కపెట్టుకుంటున్నారు. తెలంగాణలో డ్రగ్స్, గంజాయి పేరు వినిపించినా.. ఆ వాసన వచ్చినా వెంటనే ఈగల్ టీమ్ అక్కడ వాలిపోతుంది. మాదక ద్రవ్య రహిత రాష్ట్రంగా తెలంగాణను చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్న ఈగల్ డ్రగ్స్ దందాను నామరూపాలు లేకుండా చేస్తోంది. మొన్నామధ్య మల్నాడు కిచెన్‌లో డ్రగ్స్ దందాను వెలుగులోకి తీసుకొచ్చిన ఈగల్.. తాజాగా రూ. 5 కోట్ల విలువజేసే గంజాయిను పట్టుకున్నారు.

రంగారెడ్డి జిల్లా బాటసింగారం వద్ద ఖమ్మం ఈగల్ టీమ్ భారీగా గంజాయిని స్వాధీనం చేసుకుంది. పండ్లు సరఫరా చేసే ట్రేలలో పెట్టి తరలిస్తున్న భారీ గంజాయి నిల్వలను పట్టుకుంది. ఈగల్, రాచకొండ పోలీసులు చేసిన ఈ ఆపరేషన్‌లో మొత్తం 935 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. 455 ప్యాకెట్లలో ఉన్న గంజాయి విలువ సుమారు రూ.5 కోట్ల వరకు ఉంటుందని అంచనా. ఒడిశా నుంచి మహారాష్ట్రకు వెళ్తున్న ఓ డీసీఎంపై పోలీసులకు అనుమానం వచ్చింది. పండ్ల ట్రేలతో ఉన్న ఆ డీవీసీఎంను ఈగల్, రాచకొండ పోలీసులు బాటసింగారం పండ్ల మార్కెట్ సమీపంలో ఆపి తనిఖీలు నిర్వహించారు. డీసీఎం లోపల చూడగా 35 సంచుల్లో 455 గంజాయి ప్యాకెట్లను పండ్ల ట్రేలలో పెట్టినట్లు పోలీసులు గుర్తించారు. దాంతో వెంటనే డీసీఎంను సీజ్ చేసిన పోలీసులు.. గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ 435 ప్యాకెట్లలో 935 కిలోల గంజాయి ఉందని తెలిపారు. ఈ గంజాయి విలువ రూ.5 కోట్ల వరకు ఉంటుందని చెప్పారు. ఈ కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. మహారాష్ట్రకు చెందిన పవార్ కుమార్ అనే కీలక నిందితుడిని అరెస్ట్ చేశామన్నారు. విక్కీ సేత్ అనే వ్యక్తి ద్వారా గంజాయిని ఒడిశా నుంచి తరలిస్తున్నట్లు వెల్లడించారు. డీసీఎంకు ఎస్కార్ట్‌గా వెళ్తున్న ఇన్నోవా కారును గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసులో మొత్తం ముగ్గురిని అరెస్టు చేయగా, మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు పోలీసులు వివరించారు.

## ఎంపీ స్టిక్కర్ కారుతో కేసులో కొత్త మలుపు..



**హైదరాబాద్:** నగరం నడబొడ్డున ఉన్న కొండాపూర్‌లో ఆదివారం (జూలై 27) రేవ్ పార్టీని పోలీసులు భగ్నం చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో పలువురు నిందితులను పోలీసులు అరెస్టు చేయగా.. షాకింగ్ విషయాలు వెలుగులోకి వస్తు న్నాయి. ఈ కేసులో తాజాగా ఓ కొత్త మలుపు చోటు చేసుకుంది. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న కార్లలో ఒకదానిపై ఎంపీ (లోక్‌సభ సభ్యుడు) స్టిక్కర్ కనిపించడం పలు అనుమానాలకు తావిస్తోంది. రేవ్ పార్టీని నిర్వహించిన ప్రధాన నిందితుడు అశోక్ నాయుడు ఆ కారు వినియోగిస్తున్నట్లు తెలిసింది.

వివరాల్లోకి వెళితే... ఆదివారం కొండాపూర్ ఎస్‌వీ సర్వీస్ అపార్ట్‌మెంట్‌లో రేవ్ పార్టీ నిర్వహిస్తున్నారన్న పక్కా సమాచారంతో పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో మొత్తం 11 మందిని అరెస్ట్ చేశారు. వీరిలో పార్టీలో పాల్గొన్నవారు ఎక్కువగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారిగా గుర్తించారు. విజయవాడకు చెందిన నాయుడు అలియాస్ వాసు, శివం నాయుడు అనే వ్యక్తులు ఏపీ నుంచి కొంతమంది యువతులను తీసుకొచ్చి యువకులతో కలిసి ఈ పార్టీని ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. నిందితుల నుంచి భారీగా గంజాయి, డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న వాటిలో 2 కిలోల గంజాయి, 50 గ్రాముల ఓజీ కుష్ గంజాయి, 11.57 గ్రాముల మ్యాజిక్ ముష్రూమ్, ఇతర డ్రగ్స్ ఉన్నాయి. వీటితో పాటు ఆరు కార్లు, 11 సెల్‌ఫోన్లు, కండోమ్ ప్యాకెట్లను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీకెండ్ సందర్భంగా ఈ రేవ్ పార్టీని అశోక్ నాయుడు నిర్వహించినట్లు పోలీసులు గుర్తించారు. ప్రతి వీకెండ్‌లో ఇలాంటి పార్టీలు నిర్వహిస్తారని.. ఏపీ నుంచి యువతులను తీసుకొచ్చి బడా బాబులతో కలిసి రేవ్ పార్టీలు ఏర్పాటు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ముఖ్యంగా డ్రగ్స్ అలవాటు ఉన్న యువతుల్ని ట్రాప్ చేసి.. డబ్బున్న, రాజకీయ నాయకులతో కలిసి పార్టీలు ఆర్గనైజ్ చేస్తున్నట్లు తెలిసింది. ఇక పోలీసులు సీజ్ చేసిన రెండు కార్లలో ఒకటైన ఫార్చ్యూనర్ కారుపై లోక్‌సభ ఎంపీ స్టిక్కర్ ఉండటం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశమైంది. దీంతో పోలీసులు ఆ కారులో ఎవరు వచ్చారు? ఆ ఎంపీ పేరేంటి ? ఆయనే రేవ్ పార్టీకి హాజరయ్యారా ? లేదా ఆయన బంధువులెవరైనా ఆ కారులో వచ్చారా ? అనే కోణంలో పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. అశోక్ నాయుడుకు రాజకీయ నాయకులతో ఉన్న సంబంధాలపై కూడా పోలీసులు ఆరా తీస్తున్నారు. ఈ కేసులో మరిన్ని అరెస్టులు, కీలక విషయాలు బయటపడే అవకాశం ఉంది.

## షటిల్ ఆడుతుండగా గుండెపోటు..

**హైదరాబాద్:** హైదరాబాద్ నాగోల్‌లో విషాదకర ఘటన చోటు చేసుకుంది. స్థానికంగా ఉన్న ఇండోర్ స్టేడియంలో ఓ యువకుడు షటిల్ ఆడుతుండగా గుండెపోటుకు గురయ్యాడు. అప్పటి వరకు ఉత్సాహంగా షటిల్ ఆడిన 25 ఏళ్ల యువకుడు గుండ్ల రాకేష్ ఆకస్మాత్తుగా గుండెపోటుకు గురై ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన ఆదివారం (జూలై 27) సాయంత్రం చోటు చేసుకుంది.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా తల్లాడ మాజీ ఉప సర్పంచ్ గుండ్ల వెంకటేశ్వర్లు కుమారుడైన రాకేష్.. హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. నాగోల్ పరిధిలో స్నేహితులతో కలిసి ఉంటున్నాడు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం షటిల్ ఆడేందుకు ఇండోర్ స్టేడియం వెళ్లాడు. స్నేహితులతో షటిల్ ఆడుతూనే.. ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. దీంతో అక్కడున్న వారు వెంటనే అతడికి సీపీఆర్ చేసి ఆసుపత్రికి తరలించారు. అయితే.. అప్పటికే రాకేష్ మరణించినట్లు వైద్యులు ధృవీకరించారు. ఈ విషాదకర ఘటన స్టేడియంలోని సీసీ కెమె రాల్లో రికార్డయింది. ఇటీవలి కాలంలో ముఖ్యంగా యువతలో ఆకస్మిక గుండెపోటు మరణాలు గణనీయంగా పెరిగాయి. కొవిడ్-19 మహమ్మారి తర్వాత ఈ తరహా ఘట నలు మరింత ఆందోళనకరంగా మారాయి. కొవిడ్ వైరస్ గుండె, రక్తనాళాలపై దీర్ఘకాలిక ప్రభావం చూపగలదని కొందరు వైద్య నిపుణులు చెబుతున్నారు. కొవిడ్ నుంచి కోలుకున్న వారిలో కొందరికి మయోకార్డిటిస్ (గుండె కండరాల వాపు), రక్తం గడ్డకట్టడం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని అంటున్నారు. ఇది గుండెపోటుకు దారితీయ వచ్చునని చెబుతున్నారు.దాంతో పాటుగా.. ఆధునిక జీవనశైలిలో శారీరక శ్రమ లేకపోవడం, ఎక్కువ సమయం కూర్చుని పనిచేయడం, నిద్రలేమి గుండె ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయని చెబుతున్నారు. అనారోగ్య కరమైన ఆహారం అధిక కొవ్వు, చక్కెర, ప్రాసెస్ చేసిన ఆహారాలు తీసుకోవడం వల్ల కొలెస్ట్రాల్ స్థాయిలు పెరిగి రక్తనాళాలు పూడుకుపోయే ప్రమాదం ఉందని అంటున్నారు. పని ఒత్తిడి, మానసిక ఒత్తిడి నేటి యువతలో సర్వసాధారణ అయిపోయాయని.. దీర్ఘకాలిక ఒత్తిడి రక్తపోటును పెంచి గుండెపోటుకు కారణమవుతుందని నిపుణులు సూచిస్తున్నారు. గుండెపోటు బారిన పడకుండా ఉండాలంటే..ఆహారపు అలవాట్లు మార్చుకోవాలని, కాసేపైనా వ్యాయామం చేయాలని సూచిస్తున్నారు.

## ఎరువులు కొంటే చాలు.. రూ.2 లక్షల వరకు..

**తెలంగాణ:** రైతన్న తన పంట పొలాన్ని కంటికి రెప్పలా కాపాడుకుంటాడు. ఎండకు, వానకు తట్టుకొని, చీడపీడల బారి నుంచి పంటను రక్షించుకుంటూ.. చివరికి చేతికి వచ్చేదాకా అహర్నిశలు శ్రమిస్తాడు. పండిన పంటకు మార్కెట్‌లో మంచి ధర వచ్చిందంటే.. అప్పటిదాకా పడిన కష్టాన్ని పూర్తిగా మర్చిపోయి మురిసిపోతాడు. అయితే.. ప్రస్తుతం చాలా మంది రైతులు రసాయన ఎరువులపైనే ఎక్కువగా ఆధారపడుతున్నారు. పంటకు వేసే ఎరువులు కొనే సమయంలో చాలా మంది రైతులు ఒక ముఖ్యమైన విషయాన్ని విస్మరిస్తుంటారు.. అదే రసీదు తీసుకోవడం. ఈ రసీదుకు ఉచిత బీమా వర్తిస్తుందని చాలా మంది రైతులకు తెలియదు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో, రైతన్నలు పొలం పనుల్లో నిమగ్నమై ఉంటారు. ఈ సమయంలో అనుకోని ప్రమాదాలు జరిగితే.. ఆ కుటుంబం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. అలాంటి క్లిష్ట పరిస్థితుల్లో అండగా నిలవడానికి ఇఫ్కో ఎరువుల సంస్థ ఒక అద్భుతమైన పథకాన్ని ప్రవేశపెట్టింది. సంకట హరన్ బీమా పథకం. ఈ బీమా పథకం సహకార సంఘాల ద్వారా అధిక మొత్తంలో ఎరువులను కొనుగోలు చేసే ప్రతి రైతుకు వర్తిస్తుం ది. దీనికోసం రైతులు ప్రత్యేకంగా ప్రీమియం చెల్లించాల్సిన అవసరం ఏమాత్రం లేదు. కేవలం ఇఫ్కో ఫెర్టిలైజర్స్‌ను కొనుగోలు చేస్తే చాలు.. ఈ బీమా వర్తిస్తుంది. ఒకవేళ రైతు మరణించినా, లేదా అంగవైకల్యం సంభవించినా ఈ బీమా వర్తిస్తుంది. ఇది రైతన్నలకు ఆర్థిక భద్రతను కల్పిస్తుంది. రైతులు ఈ బీమా ప్రయోజనం పొందాలంటే.. ఎరువులను కొనుగోలు చేసినప్పుడు ఇచ్చే రసీదును తప్పనిసరిగా భద్రపర్చుకోవాలి. రసీదు పత్రంతో పాటు కొన్ని ధ్రువీకరణ పత్రాలు కూడా అవసరం. రైతు మరణానికి సంబంధించి ఒకవేళ కేసు నమోదైతే.. ఎఫ్ఐఆర్ కాపీ, పోస్టుమార్టం రిపోర్ట్, మరణ ధ్రువీకరణ పత్రం (డెత్ సర్టిఫికెట్) సమర్పించాల్సి ఉంటుంది. ఈ పత్రాలను ప్రమాదం జరిగిన తేదీ నుండి రెండు నెలల్లోగా ఇఫ్కో కార్యాలయంలో అందజేయాలి. ఈ బీమా సదుపాయం గురించి చాలా మంది రైతులకు అవగాహన లేదు. ఈ విషయమై అన్నదాతలకు విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. ప్రధానంగా రోడ్డు ప్రమాదాలు, నీటిలో మునిగిపోవడం, పాముకాటు, లేదా ఏదైనా వ్యవసాయ యంత్రం వల్ల ప్రమాదానికి గురైతే ఈ ఇన్సూరెన్స్ పరిహారం చెల్లిస్తారు. సహకార సంఘాల ద్వారా ఇఫ్కో ఎరువులను కొనుగోలు చేసే వారికి ఈ ఇన్సూరెన్స్ సదుపాయం కల్పిస్తారు.

# సిగాచి కంపెనీ యాజమాన్యంతో రేవంత్ రెడ్డి కుమ్మక్కయ్యారు

**తెలంగాణ:** సిగాచి పరిశ్రమ ప్రమాదంపై తెలంగాణ ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీష్ రావు తీవ్ర ఆరోపణలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కంపెనీ యాజమాన్యంతో కుమ్మక్కయ్యారని, అందుకే ఇంతవరకు ఎవరినీ అరెస్టు చేయలేదని ఆయన అన్నారు. బాధితులకు నష్టపరిహారం అందించడంలో ప్రభుత్వం విఫలమైందని, వెంటనే పరిహారం చెల్లిం చకపోతే కలెక్టరేట్ ముందు దీక్ష చేస్తానని హెచ్చరి ంచారు. బాధితుల ఆర్తనాదనలు మిన్నంటుతున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్టైనా లేదంటూ విలేకర్ల ముందు ఆయన నిప్పులు చెరిగారు.

సిగాచి పరిశ్రమ యాజమాన్యంతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుమ్మక్కయ్యాడంటూ మాజీ మంత్రి హరీష్ రావు ఆరోపించారు. జూన్ 30న సిగాచి పరిశ్రమలో జరిగిన ఘోర ప్రమాదంపై ఇప్పటి వరకు కంపెనీ ప్రతినిధులపై ఎందుకు కేసు నమోదు చేయలేదంటూ ఆయన ప్రశ్నించారు. మరణించిన కార్మికుడి కొడుకు కంప్లెయింట్ ఇచ్చినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కేసులో ఎవర్ని కాపాడే ప్రయత్నం చేస్తున్నారంటూ రేవంత్ రెడ్డిని సూటిగా ప్రశ్నించారు. పాశమైలారం సిగాచి పరిశ్రమలో జరిగిన ఘోర అగ్ని ప్రమాదం ఇప్పటికీ అందరి కళ్లెదుటే ఉంది. ఈ విషాద ఘటనలో 46 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోగా.. మరో ఎనిమిది మంది ఆచూకీ దొరకలేదు. ఈ పెను విషాదంలో ప్రాణాలు కోల్పోయిన వారితో పాటు గాయపడిన వారికి నష్టపరిహారం అందిస్తామని ప్రభుత్వం చెప్పింది. అయితే ఇప్పటివరకు కంపెనీ నుంచి గానీ, ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు నష్ట పరిహారం అందలేదని.. ఆలస్యం చేస్తే కలెక్టరేట్ ముందు టెంట్ వేసి దీక్ష చేస్తామంటూ మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు హెచ్చరించారు.



సంగారెడ్డి కలెక్టరేట్‌కు సోమవారం వచ్చిన హరీష్ రావు సిగాచి పరిశ్రమ బాధితుల తరఫను కలెక్టర్‌తో మాట్లాడారు. ఇప్పటి వరకు బాధితులకు ఆర్థిక సాయం అందలేదని చెప్పారు. పరిహారం వారానికి ఇస్తారా? లేక పది రోజులకా అనేది స్పష్టంగా చెప్పాలని.. లేకపోతే కలెక్టరేట్ ముందు టెంట్ వేసి దీక్ష చేస్తామంటూ హెచ్చరించారు. ప్రభుత్వంతో మాట్లాడి పేదలకు నష్టపరిహారం అందించాలని, అది జరగని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతమ చేస్తామన్నారు. గతంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇలాంటి సంఘటనే జరిగినప్పుడు మూడు రోజుల వ్యవధిలోనే ప్రభుత్వం రూ. కోటి నష్ట పరిహారం బాధిత కుటుంబాలకు అందజేసిందని హరీష్ రావు కలెక్టర్‌కు గుర్తు చేశారు. కొంతమందికి రూ.10 లక్షలు కూడా అందజేయలేదని, గాయపడిన వారికి రూ.50 లక్షలు అందించాలని డిమాండ్ చేశారు. బాధితులకు అండగా ఉండాలంటూ కలెక్టర్‌ను కోరారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా నష్టపరిహారం అందించాలని సూచించారు.

అంతకుముందు సిగాచి పరిశ్రమ బాధిత కుటుంబాలను హరీష్ రావు పరామర్శించారు. తమ వాళ్లను కోల్పోయిన తమకు ప్రభుత్వం అండగా నిలవలేదంటూ బాధితులు గుండెలవిసేలా రోదించారు. బాధితులతో మాట్లాడిన హరీష్ రావు అనంతరం ర్యాలీగా కలెక్టరేట్‌కు వెళ్లారు. బాధితులు మీడియాతో మాట్లాడుతూ నెల రోజులు గడుస్తున్నా ఇంత వరకు తమ వాళ్ల ఆచూకీ లేదంటూ కన్నీళ్లు పెట్టుకున్నారు. కనీసం డెడ్ బాడీ లేకపోయినా.. మిస్సింగ్ అని లెటర్ ఇవ్వమంటే మునిసిపల్ అధికారులు ఇవ్వడం లేదంటూ వాపోయారు. తమని ఎవ్వరూ పట్టించుకోవడం లేదంటూ కన్నీరుమున్నీరుగా విలపించారు.



## దరఖాస్తులు ఇక నుంచి వాట్సాప్ ద్వారానే..

**హైదరాబాద్:** ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సరికొత్త విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఇకపై పౌరులు నేరుగా కలెక్టరేట్‌కు వెళ్లకుండానే వాట్సాప్ ద్వారా ఫిర్యాదులు పంపవచ్చు. 7416687878 నంబర్‌కు ఫిర్యాదులు పంపితే, వాటిని స్వీకరించి, ప్రత్యేక పోర్టల్‌లో నమోదు చేస్తారు. వారం రోజుల్లో ఫిర్యాదుపై తీసుకున్న చర్యల వివరాలను తిరిగి వాట్సాప్ ద్వారానే తెలియజేస్తారు. ఈ విధానం ద్వారా ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, దివ్యాంగులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని కలెక్టర్ హరిచందన తెలిపారు.

హైదరాబాద్ నగరంలో పౌరుల సమస్యలను పరిష్కరించేందుకు.. ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రజావాణి దరఖాస్తుల విషయంలో ఇప్పటివరకు ప్రతి సోమవారం ప్రజలు హైదరాబాద్ కలెక్టరేట్ కార్యాలయానికి నేరుగా వెళ్లి ఫిర్యాదులు సమర్పించాల్సి వచ్చేది. గత ప్రభుత్వాల హయాంలో ఈ ప్రక్రియ ఎంతో శ్రమతో కూడుకున్నది. దూరం నుంచి వచ్చే వృద్ధులు, దివ్యాంగులు, ప్రైవేటు ఉద్యోగులు, కూలీ పనులకు వెళ్లేవారు తమ పనులను మానుకొని, బస్సులు పట్టుకొని కలెక్టరేట్‌కు వచ్చి, గంటల తరబడి నిరీక్షించి.. తమ గోడును వినిపించుకోవడానికి నానా ఇబ్బందులు పడేవారు. ప్రయాణ ఖర్చులు, సమయం వృథా, బారులు తీరిన క్యూలు వారికి పెద్ద భారంగా మారేవి. ఈ ఇబ్బందులను గమనించిన హైదరాబాద్ కలెక్టర్ హరిచందన.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు ఒక కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రజలకు మరింత సులభంగా తమ ఫిర్యాదులు చేరవేసేలా.. నేటి నుంచి వాట్సాప్ ద్వారా ప్రజావాణికి దరఖాస్తులు స్వీకరించే అవకాశం కల్పించారు. ఈ మేరకు కలెక్టర్ హరిచందన సోమవారం తన అధికారిక ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ఈ శుభవార్తను ప్రకటించారు. 'హైదరాబాద్ పౌరులారా.. ఇప్పుడు పాలన మీ దగ్గరికి వస్తోంది' అని ఆమె పేర్కొన్నారు.

ఇకపై పౌరులు కలెక్టరేట్‌కు వెళ్లకుండానే, తమ ఫిర్యాదులను 7416687878 నంబర్‌కు వాట్సాప్ ద్వారా పంపించవచ్చని తెలిపారు. ఈ నంబర్‌కు వచ్చిన ఫిర్యాదులను సంబంధిత సిబ్బంది నిరంతరం పర్యవేక్షిస్తారు. వాటిని ప్రత్యేకంగా నిర్వహిస్తున్న పోర్టల్‌లో నమోదు చేసి, ఫిర్యాదుదారులకు ఒక ఐడీ నంబర్ కేటాయిస్తారు. వారంలోపు ఆ ఫిర్యాదులపై తీసుకున్న చర్యల వివరాలను, సమాచారాన్ని తిరిగి వాట్సాప్ ద్వారానే తెలియజేస్తారు.

## ఇందిరమ్మ ఇళ్లకు బిల్లులు..



**తెలంగాణ:** ఇందిరమ్మ ఇళ్ల నిధుల విడుదల కోసం రూఫ్ లెవెల్ ఫోటోలు తప్పనిసరి కావడంతో గ్రామ పంచాయతీ సిబ్బంది ప్రాణాలు పణంగా పెడుతున్నారు. కింద నుంచి తీసిన ఫోటోలు అప్‌లోడ్ కాకపోవడంతో.. భద్రతా పరికరాలు లేకుండానే ఇళ్లపైకి ఎక్కి, నిచ్చెనల సాయంతో ఫోటోలు తీస్తున్నారు. అది రిస్కుతో కూడుకున్నదని.. అధికారులు ఫోటో అప్‌లోడ్ విధానాల్లో మార్పులు, డ్రోన్ల వినియోగానికి అనుమతి ఇవ్వాలని సిబ్బంది కోరుతున్నారు.

ఈ పథకం కింది ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం నాలుగు విడతల్లో చేస్తున్నారు. అయితే లబ్ధిదారులకు నిధులు విడుదల చేసే క్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బందికి ఊహించని సవాళ్లు ఎదురవుతున్నాయి. ఇంటి నిర్మాణం పూర్తయిన వివిధ దశలను ఫోటోలు తీసి అప్‌లోడ్ చేయాల్సి ఉండగా.. ముఖ్యంగా రూఫ్ లెవెల్ (పైకప్పు స్థాయి) ఫోటో తప్పనిసరి కావడంతో సిబ్బంది ప్రాణాలను పణంగా పెడుతున్నారు. నిబంధనల ప్రకారం.. ఇంటి నిర్మాణం ఒక్కో దశ పూర్తయిన తర్వాత ఆ దశకు సంబంధించిన ఫోటోలను అప్‌లోడ్ చేస్తేనే లబ్ధిదారుల ఖాతాల్లో రూ. లక్ష చొప్పున నిధులు జమ అవుతాయి. అయితే, రూఫ్ లెవెల్ ఫోటో కింద నుండి తీస్తే అప్‌లోడ్ కావడం లేదని సిబ్బంది వాపోతున్నారు. దీంతో ఫోటోలు తీయడం కోసం భద్రతా పరికరాలు లేకుండానే పక్కనున్న పాత ఇళ్లపైకి ఎక్కడం, నిచ్చెన సాయంతో, లేదా ఆటోలపై ఎక్కి సాహసాలు చేయడం నిత్య దృశ్యాలుగా మారాయి. తాజాగా, ఒక గ్రామ పంచాయతీ సిబ్బంది భద్రతా పరికరాలు లేకుండానే నిర్మాణంలో ఉన్న ఇంటి పైకప్పు మీద నిలబడి ఫోన్ ద్వారా ఇంటి పై భాగాన్ని ఫోటో తీయడం చర్చనీయాంశంగా మారింది. 'ఫోటో క్యాప్చర్ అయితేనే లబ్ధిదారునికి డబ్బులు వస్తాయంటున్నారు. కానీ కింద నుండి ఫోటో తీస్తే అప్‌లోడ్ అవ్వడం లేదు. పైకెక్కకుండా మరొక మార్గం లేదు. మా భద్రత ఎవరిది?' అంటూ పంచాయతీ సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. క్రమశిక్షణతో పనిచేసే సిబ్బంది తమ ప్రాణాలను తెగించి విధులు నిర్వహించాల్సిన పరిస్థితి రావడం ఆందోళనకరంగా మారింది. రూఫ్ లెవెల్ ఫోటో పద్ధతుల్లో మార్పులు చేయాలని, ఫోటో అప్‌లోడ్ ప్రక్రియలో మరింత ఫ్లెక్సిబిలిటీ ఇవ్వాలని స్థానిక సిబ్బంది ఉన్నతాధికారులను కోరుతున్నారు. అవసరమైతే డ్రోన్ల వాడకానికి అవకాశం కల్పించాలని కూడా వారు విజ్ఞప్తి చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవ పరిస్థితులను బట్టి మార్గదర్శకాలను సవరించాలని, తద్వారా సిబ్బంది భద్రతకు భరోసా కల్పించాలని డిమాండ్ మొదలైంది. ఉన్నతాధికారులు ఈ విషయంపై తక్షణమే స్పందించి, తగిన చర్యలు తీసుకోవాలని గ్రామ పంచాయతీ సిబ్బంది ఆశిస్తున్నారు.

# ఇంగువ నీళ్లు తాగితే షుగర్ కంట్రోల్‌లో ఉంటుంది





చెట్టు వేర్ల నుంచి లభించే ఇంగువ జీర్ణ రసాలు ఉత్పత్తి అవడానికి తోడ్పడుతుంది. ఎంజైమ్‌ల చర్యను ప్రభావితం చేస్తుంది. దీంట్లో ఔషధాల గుణాలూ ఎక్కువే. ఇంగువ నీళ్లు తాగితే.. జీర్ణక్రియ మెరుగుపడుతుంది, ఆహారంలోని పోషకాల శోషణకు సహాయపడుతుంది. ఇంగువ నీళ్లు అజీర్తి, కడుపులో మంట, అన్నం సరిగా జీర్ణమవకపోవడం లాంటి సమస్యలు దూరం అవుతాయి. జీవక్రియ ప్రక్రియలకు సహాయపడుతుంది. రోజూ ఇంగువ వాటర్ తాగితే.. జీవక్రియ మెరుగుపడుతుంది, తద్వారా శరీరంలోని కొవ్వు కరుగుతుంది..

జీవక్రియకు మేలు చేస్తుంది.. చెట్టు వేర్ల నుంచి లభించే ఇంగువ జీర్ణ రసాలు ఉత్పత్తి అవడానికి తోడ్పడుతుంది. ఎంజైమ్‌ల చర్యను ప్రభావితం చేస్తుంది. దీంట్లో ఔషధాల గుణాలూ ఎక్కువే. ఇంగువ నీళ్లు తాగితే.. జీర్ణక్రియ మెరుగుపడుతుంది, ఆహారంలోని పోషకాల శోషణకు సహాయపడుతుంది. ఇంగువ నీళ్లు అజీర్తి, కడుపులో మంట, అన్నం సరిగా జీర్ణమవకపోవడం లాంటి సమస్యలు దూరం అవుతాయి. జీవక్రియ ప్రక్రియలకు సహాయపడుతుంది. రోజూ ఇంగువ వాటర్ తాగితే.. జీవక్రియ మెరుగుపడుతుంది, తద్వారా శరీరంలోని కొవ్వు కరుగుతుంది.

యాంటీఇన్ఫ్లమేటరీ గుణాలు ఉంటాయి.. ఇంగువలోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి జీవక్రియ వ్యాధులు, ఊబకాయంతో సంబంధం ఉన్న వాపును తగ్గించడానికి తోడ్పడుతుంది. తద్వారా బరువు కంట్రోల్‌లో ఉంటుంది, అనారోగ్యాల ముప్పు తగ్గుతుంది. కొన్ని పరిశోధనల ప్రకారం, ఇంగువ రక్తంలో చక్కెర స్థాయిలను ప్రభావితం చేయవచ్చు. ఇంగువ నీళ్లు రక్తంలో చక్కెర స్థాయిలను కంట్రోల్‌లో ఉంచడానికి, బరువు తగ్గడానికి సహాయపడుతుంది. ఇది ఆకలి కోరికలను నిర్వహించడానికి సహాయపడుతుంది.


ఎలా తయారు చేసుకోవాలి.. ఇంగువ వాటార్ తయారు చేయడానికి ముందుగా గ్లాస్ నీళ్లను ఐదు నిమిషాల పాటు మరిగించండి. ఆ తర్వాత చిటికెడు ఇంగువ వేయండి. దీన్ని కొంతసేపు అలానే ఉంచి.. ఫిల్టర్ చేసి ఇంగువ నీళ్లు తాగండి. మీకు కావాలనుకుంటే నిమ్మరసం, తేనె యాడ్ చేసుకోవచ్చు.




# ఎమోషనల్లీ స్ట్రాంగ్‌గా ఉన్నారో లేదో..

మానసికంగా దృఢంగా ఉంటేనే మంచి నిర్ణయాలు తీసుకోగలం. ఎలాంటి సమస్యలొచ్చినా ముందుకెళ్ళగలం. అందరూ మానసికంగా దృఢంగా ఉండరు. దీని వల్లే చాలా సమస్యలొస్తాయి. మరి ఎమోషనల్లీ స్ట్రాంగ్‌గా ఉన్నారో లేదో ఎలా తెలుసుకోవాలో ఇప్పుడు చూడండి. మీ గురించి మీకు కచ్చితమైన అవగాహన ఉందో లేదో తెలుసుకోండి. ఏ విషయాలు మీకు కోపం తెప్పిస్తాయి. మీ భావోద్వేగాలు ఎలా ఉంటాయి? మానసికంగా ఎలా ఉన్నారో తెలుసుకోండి. సొంత పనులపై అవగాహన ఉండడం, సరైన వ్యక్తిని ఎంచుకోవడం, ఇబ్బందులు రాకుండా తప్పించుకోవడం వంటివి తెలిసి ఉంటారు.

పరిస్థితులకి తగ్గట్టు.. ఇది ప్రతిఒక్కరూ చేయరు. ఏ పరిస్థితుల్లో ఉన్నా మానసికంగా స్ట్రాంగ్‌గా ఉండి పరిస్థితిని అర్థం చేసుకుని ఆలోచనలు తీసుకుంటారు. అలాగే, ఎక్కువ ఆలోచించకుండా నిర్ణయాలు తీసుకుంటారు. ఇది సమస్యలు సాల్వ్ చేయడానికి, కొత్త విషయాలని అర్థం చేసుకోవడానికి హెల్ప్ చేస్తుంది.

వదులుకోవడం.. కొన్ని పరిస్థితుల్లో మనం ఏం చేయలేమనుకుంటే దానిని వదులుకోవడానికి కూడా వెనుకాడరు. వదులుకోవడం వల్ల వచ్చే ప్రతి ప్రాబ్లమ్‌ని ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉంటారు. ఇది వారికి గొప్ప సక్సెస్. అలాగే వారు ఎవరినైనా అర్థం చేసుకోగలరు. చాలా మందికి ఇతరులని అర్థం చేసుకోవడం కష్టం. కానీ, ఇతరులు భావాలను అర్థం చేసుకోవడం, వారికి అవసరమైన సాయాన్ని అందించడం ఎమోషనల్లీ స్ట్రాంగ్‌గా ఉన్నవారు చేస్తారు. ఎవరైనా ఏమైనా సాధిస్తే వారిని అప్రిషియేట్ చేస్తారు. ప్రతి ఒక్కరి విషయంలోనూ పాజిటీవ్‌గా ఉంటారు. తమ చుట్టూ ఉన్నవారికి సపోర్ట్ ఇస్తారు. సొంతంగా స్టాండ్ తీసుకుంటారు. కచ్చితమైన అభిప్రాయాలను కలిగి ఉంటారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ అభిప్రాయాలను మార్చుకోరు.

# వాము ఆకులని నమిలి తింటే...





వాము ఆరోగ్యానికి ఎంత మంచిదో.. వాము ఆకులు అంతేకంటే ఎన్నో లాభాలు ఉన్నాయి. ఇందులో ఐరన్ ఎక్కువగా ఉంటుంది. దీంతో బాడీలో రక్తహీనత దూరమవుతుంది. వీటిని తినడం వల్ల చాలా సమస్యలు దూరమవుతాయి. అవేంటో తెలుసుకోండి.

కిడ్నీ రాళ్ళు.. ఈ ఆకులు తింటే ట్యాక్సిన్స్ శరీరం నుండి బయటికి వెళ్తాయి. అందుకోసం ఈ ఆకులని తేనె, వెనిగర్‌తో కలిపి తీసుకోవచ్చు. కిడ్నీల్లో రాళ్ళ సమస్య తగ్గుతుంది. ఇందులో యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌ని బ్యాలెన్స్ చేస్తాయి. ఇది ఇమ్యూనిటీని పెంచుతుంది.



నోటి దుర్వాసన.. వాము ఆకుల్లో యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు నోటి ఆరోగ్యాన్ని మెరుగ్గా చేస్తాయి. ఈ ఆకులని నమిలితే నోటిలోని బ్యాక్టీరియా తగ్గుతుంది. కావిటీస్, నోటి దుర్వాసన, ఇతర నోటి ఇన్ఫెక్షన్ల ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

రక్తహీనత దూరం.. చాలా మంది ఐరన్ లోపంతో బాధపడుతుంటారు. అలాంటి వారు ఈ ఆకులని తింటే ఐరన్ పుష్కలంగా ఉంటుంది. ఇది రక్తహీనత దూరమవుతుంది. దీనికోసం జ్యూస్‌లా కూడా తీసుకోవచ్చు.

పీరియడ్స్ టైమ్‌లో నొప్పి.. పీరియడ్స్ టైమ్‌లో నొప్పి ఎక్కువగా ఉంటుంది. ఇలాంటి సమస్యల్ని తగ్గించడంలో వాము ఆకులు హెల్ప్ చేస్తాయి. వీటిని తింటే పీరియడ్స్ టైమ్‌లో వచ్చే నొప్పి తగ్గుతుంది.

జీర్ణసమస్యలు.. కొన్ని అధ్యయనాలు ప్రకారం, వాము ఆకులని తీసుకోవడం వల్ల జీర్ణ సమస్యలు దూరమవుతాయి. ఇందులో యాంటీ యాసిడ్ లక్షణాలు గుణాలు ఉన్నాయి. దీని వల్ల కడుపు నుండి అదనపు ఆమ్లాన్ని తగ్గించి అసిడిటీ, గుండెల్లో మంటని తగ్గిస్తుంది.

కఫం దూరం.. చలికాలం, వర్షాకాలంలో చాలా మందికి జలుబు, దగ్గు వస్తుంటుంది. దీని కారణంగా కఫం వస్తుంటుంది. అయితే, వాము ఆకులని నమిలి తినడం వల్ల దగ్గు, జలుబు కాకుండా శ్వాస కోశ సమస్యలు కూడా దూరమవుతాయి. శ్లేష్మం దూరమవుతుంది.

వాము ఆకులోని పోషకాలు.. వాము ఆకుల్లో ప్రోటీన్, ఫైబర్, విటమిన్స్, కాల్షియం, ఐరన్, ఫాస్పరస్ వంటి ఖనిజాలు ఉంటాయి. ఈ ఆకులని రెగ్యులర్‌గా తింటే చాలా సమస్యలు దూరమవుతాయి.

బరువు తగ్గడం.. ఈ ఆకుల్లో కేలరీలు, ఫైబర్ ఎక్కువగా ఉంటాయి. దీని వల్ల బరువు తగ్గించడంలో హెల్ప్ చేస్తాయి. ఈ ఆకులని నమిలి తింటే ఆకలి కంట్రోల్ అవుతుంది. కడుపు నిండిన ఫీలింగ్ ఉంటుంది. బరువు కంట్రోల్ అవుతుంది.

# గోర్లపై తెల్లగా మారాలంటే..



ఆరోగ్యంగా, పొడుగ్గా ఉండే గోర్లంటే అందరికీ ఇష్టమే. వీటి కోసం ఎన్నో ప్రయత్నాలు చేస్తారు. గోర్లు పొడుగ్గా చాలా మందికే పెరుగుతాయి. కానీ, మనం రోజూ చేసే పనుల వల్ల నల్లగా మారతాయి. అలాంటి గోర్లను తెల్లగా మార్చాలంటే కొన్ని హెల్ప్ చేస్తాయి.

టూత్‌పేస్ట్.. టూత్‌పేస్ట్‌తో మీ గోర్లని సున్నితంగా స్క్రబ్ చేయండి. వైట్ టూత్‌పేస్ట్ మీ గోర్లపై మరకలు ఈజీగా పోతాయి. కాబట్టి, దీనిని అప్లై చేయండి. వీటితో పాటు మీ గోర్లని మరకలని తగ్గించేందుకు మీరు సిగరెట్ తాగడం తగ్గించాలి. గ్లౌజెస్ వేసుకోవడం తగ్గించాలి. కొన్ని జెల్స్ రాయొచ్చు.



లెమన్ సాల్ట్.. నిమ్మ, ఉప్పు కలిపి స్క్రబ్ చేయడం వల్ల కూడా గోర్లు తెల్లగా మారతాయి. అందుకోసం ముందుగా సమాన భాగాల్లో నిమ్మరసం, ఉప్పు కలిపి పేస్టులా చేసి గోర్లపై రాయండి. కాసేపు ఉంచి ఆ తర్వాత క్లీన్ చేయండి. దీంతో గోర్లు తెల్లగా మారతాయి.




బేకింగ్ సోడా.. హైడ్రోజన్ పెరాక్సైడ్, బేకింగ్ సోడాని రెండింటిని కలిపి పేస్ట్‌లా చేయండి. దానిని కాటన్ సాయంతో గోర్లపై అప్లై చేసి బాగా రుద్దండి. 10 నిమిషాల తర్వాత గోరువెచ్చని ననీటితో క్లీన్ చేయండి.






టీట్రీ ఆయిల్.. టీట్రీ ఆయిల్‌ని కొద్దిగా తీసుకుని గోర్లపై వేసి స్క్రబ్ చేయండి. ఇలా మీకు వీలున్నంత సేపు చేసి క్లీన్ చేయండి. రెగ్యులర్‌గా చేస్తే ఉపయోగం ఉంటుంది.

వైట్ వెనిగర్.. గోరువెచ్చని నీటిలో ఓ టీస్పూన్ వైట్ వెనిగర్ వేయండి. అందులో గోర్లని ఉంచి నాననివ్వండి. ఇప్పుడు శుభ్రమైన టవల్‌తో తుడవండి. చివర్లో లోషన్ రాయండి.

స్క్రబ్.. అదే విధంగా, గోర్లని ఎప్పటికప్పుడు స్క్రబ్ చేయాలి. దీంతో మరకలు మాయమవుతాయి. ఇందుకోసం నెయిల్ పాలిష్ న్యూట్రలైజర్‌ని వాడండి. తర్వాత, నెయిల్ స్క్రబ్ బ్రష్‌ని వాడి మీ గోర్లపై మరకల్ని దూరం చేయొచ్చు. అసిటోన్‌లో నానబెట్టిన కాటన్ ప్యాడ్‌తో మీ గోళ్ళని క్లీన్ చేయండి.

బేకింగ్ సోడా, నిమ్మరసం..

గోర్లని తెల్లగా చేయడంలో బేకింగ్ సోడా, నిమ్మరసం చాలా బాగా పనిచేస్తాయట. సో అందుకోసం బేకింగ్ సోడా, నిమ్మరసం కలిపి పేస్టులా చేయాలి. దీనిని గోర్లపై 30 సెకన్ల పాటు రుద్దండి. తర్వాత ఓ 10 నిమిషాల పాటు ఉంచి ఆ తర్వాత గోరువెచ్చని నీటితో కడగాలి.

# కిచెన్ సామాన్లతో అడుకుంటుంటే అడ్డుపడుతున్నారా..?



ఇంట్లో చంటి పిల్లలు ఉంటే.. ఇల్లు ఇల్లులా ఉండదు. ఇక పాకుతుండే, నడిచే పిల్లలు ఉంటే.. చిందరవందరగా ఉంటుంది. ఇల్లాంతా బొమ్మలు, కిచెన్ సామాన్లు, బుక్స్, కూరగాయలు పరిచేసి ఉంటాయి. పిల్లలకు ఆడుకోవడానికి ఎన్ని బొమ్మలున్నా.. కిచెన్ సామాన్లు కనిపిస్తే వదిలిపెట్టరు. ప్లేట్లు, గ్లాసులు, గిన్నెలతో నానా రచ్చ చేస్తుంటారు. చాలామంది తల్లిదండ్రులు పిల్లలు కిచెన్ సామాన్లు, కూరగయాలతో అడుకుంటుంటే, వాళ్ల నుంచి అవి బలవంతంగా లాగేసుకుంటూ ఉంటారు. వాళ్ల చేతికి బొమ్మలు తీసుకొచ్చి ఇస్తుంటారు. అయితే, పిల్లలను కిచెన్ సామాన్లతో అడుకోనివ్వాలని ప్రముఖ డాక్టర్ ఛాయా షా అన్నారు. పిల్లలను బొమ్మలకు బదులుగా, కిచెన్ సామాన్లతో ఎందుకు ఆడుకోనివ్వాలో ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో వివరించారు. పిల్లలు కిచెన్ సామాన్లతో ఆడితే ఎలాంటి ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయో తెలిపారు.

వారిలో కమ్యూనికేషన్‌స్కిల్స్‌పెరుగుతాయి.. పిల్లలు.. కిచెన్‌సామాన్లు, గిన్నెలు, ప్లేట్లతో ఆడుకుంటే వారిలో కమ్యూనికేషన్, లాంగ్వేజ్ స్కిల్స్ అభివృద్ధి చెందుతాయని డాక్టర్‌ఛాయ అన్నారు. అంటే, పిల్లలు త్వరగా మాట్లాడటం నేర్చుకుంటారు, ఎక్కువ పదాలను తెలుసుకుంటారు. మీ చిన్నారి ఇంకా మాట్లాడం స్టార్ట్‌చేయకపోతే.. వాళ్లకు మాటలు త్వరగా నేర్పించాలనుకుంటే వాళ్లు ఆడుకోవడానికి కిచెన్‌సామాన్లు ఇచ్చేయండి. పాత్రలతో ఆడుకోవడం ద్వారా పిల్లవాడు వాటి పేర్లను కూడా నేర్చుకుంటాడని డాక్టర్ షా చెప్పారు. కూజా, జగ్, చెంచా వంటి అనేక పదాలను మాట్లాడటం నేర్చుకుంటాడు.


మోటార్‌స్కిల్స్‌పెరుగుతాయి.. చిన్నారులు కిచెన్‌పాత్రలు, గిన్నెలతో ఆడుకుంటే వారిలో మోటార్‌స్కిల్స్‌పెరు గుతాయి. ప్రకారం, చక్కటి మోటార్‌స్కిల్స్‌అంటే.. మన చేతులు, మణికట్టులోని చిన్న కండరాలను కదిలించే సామర్థ్యం పెరుగుతుంది. మీ చిన్నారిలో మోటర్‌నైపుణ్యాలు పెరుగుపరచడం చాలా ముఖ్యం. చిన్నారి.. పాత్రలు, స్పూన్లు, ప్లేట్లు వంటి వివిధ ఆకృతుల పాత్రలను పట్టుకున్నప్పుడు, అది అతని చేతి, వేళ్లు, మణికట్టులోని చిన్న కండరాలు అభివృద్ధి చెందడానికి సహాయపడతాయి.



చదువులో సహాయపడతాయి.. చిన్నపిల్లలు కిచెన్‌సామాన్లు, గిన్నెలతో అడుకుంటే.. అది వారి చదువులోని సహాయపడుతుందని డాక్టర్‌ఛాయా అన్నారు. పిల్లలు సైన్స్, ఫిజిక్స్, మ్యాథ్స్‌వంటి సబ్జెక్ట్‌స్కిల్స్‌ను నేర్చుకుంటారు. కాబట్టి, మీ పిల్లవాడు పెద్దయ్యాక చదువులో ముందు ఉండాలనుకుంటే, పసి వయస్సులో వారిని కిచెన్‌పాత్రలతో ఆడుకోనివ్వండి.

ఇంద్రియాలు అభివృద్ధి చెందుతాయి.. చిన్నారులు కిచెన్‌సాన్లతో అడుకుంటే.. వారిలో ఇంద్రియాలు అభివృద్ధి చెందుతాయని డాక్టర్‌షా అన్నారు. చూడటం, వినడం, తాకడం, రుచి చూడటం, వాసన చూడటం లాంటివి త్వరగా అభివృద్ధి చెందుతాయి. మనం మన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని తెలుసుకోగలుగుతాం. పిల్లలు వివిధ పాత్రలు, మెటల్, ప్లాస్టిక్ లేదా ఉక్కు వంటి లోహాలను తాకినప్పుడు, అది వారిలో ఇంద్రియ అభివృద్ధికి సహాయపడుతుంది.

# ప్రతి సంవత్సరం.. చేయించుకోవాలి..!




రక్తహీనత, ఇన్ఫెక్షన్లు, విటమిన్ల లోపం, కొలెస్ట్రాల్ స్థాయిలను గుర్తించడానికి బ్లడ్ టెస్ట్ కచ్చితంగా వంటి తీవ్ర పరిస్థితులను గుర్తించడానికీ.. రక్త పరీక్ష ఉత్తమ మార్గం. బ్లడ్ టేస్ట్ అనారోగ్యాలను గుర్తించడానికే కాదు.. శరీరంలో జరిగే అనేక మార్పులను తెలుసుకోవడానికీ సహాయపడుతుంది.

అందుకే, మన హెల్త్ ట్రాక్ చేయడానికీ డాక్టర్స్ బ్లడ్ టెస్ట్ ప్రిస్క్రైబ్ చేస్తూ ఉంటారు. అయితే, కొన్ని బ్లడ్ టెస్ట్‌లు ప్రతి ఏడాదీ కచ్చితంగా చేయించుకోవాలని నిపుణులు అంటున్నారు.

లిపిడ్ ప్యానల్ బ్లడ్ టెస్ట్.. రెండు రకాల కొలెస్ట్రాల్ స్థాయిలను గుర్తిస్తుంది. అధిక సాంద్రత కలిగిన లిపోప్రొటీన్ లేదా లేదా మంచి కొలెస్ట్రాల్. మంచి కొలెస్ట్రాల్ మన రక్తం నుండి హానికరమైన పదార్థాలను తొలగిస్తుంది. లివర్ వాటిని వ్యర్థాలుగా విభజించడానికి సహాయపడుతుంది. మంచి కొలెస్ట్రాల్ ధమనులలో ఫలకాన్ని కరిగిస్తుంది. గుండె జబ్బుల ప్రమాదాన్ని పెంచుతుంది. లిపిడ్ ప్యానల్ టెస్ట్ చేయించుకోవడానికి.. 8 గంటల పాటు ఉపవాసం ఉండాలి. థైరాయిడ్ గ్రంథి థైరాయిడ్-స్టిమ్యులేటింగ్ హార్మోన్ ట్రైయోడోథైరోనిన్ నిర్దిష్ట హార్మోన్లను ఎలా ఉత్పత్తి చేస్తుందో, వాటికి ఎలా స్పందిస్తుందో తెలుసుకోవడానికి సహాయపడుతుంది.



# ఎటూ తేల్చుకోలేకపోతోన్న మేకర్స్...

మెగాస్టార్ చిరంజీవి నటిస్తోన్న సోషియో ఫాంటసీ ఎంటర్‌టైనర్ 'విశ్వంభర' రిలీజ్‌పై ఇంకా స్పష్టత రాలేదు. తొలుత మే, తర్వాత జులై రిలీజ్ ప్లాన్ చేసినా, అది జరగలేదు. సెప్టెంబర్ 25న వస్తుందనే ప్రచారం జరిగినా, అదే రోజున 'ఓజీ', 'అఖండ 2' లాంటి భారీ సినిమాలు ఉండడంతో మేకర్స్ వెనక్కి తగ్గే సూచనలు కనిపిస్తున్నాయి. మరోవైపు వీఎఫ్ఎక్స్ పనులు ఆలస్యం అవుతుండటంతో డిసెంబర్‌లో విడుదల చేసే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. అదే జరిగితే డిసెంబర్, జనవరిలో వరుస సినిమాలతో మెగా అభిమానులకు పండుగే అని టాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి.

టాలీవుడ్‌లో ఇప్పుడు కుర్ర హీరోల కంటే పెద్ద హీరోలే దూకుడు మీదున్నారు. ఒక్కొక్కరు రెండు మూడు ప్రాజెక్టులు చేతిలో పెట్టుకుని బాక్సాఫీస్ వేటకి సిద్ధమవుతున్నారు. ఈ కోవలోనే మెగాస్టార్ చిరంజీవి కూడా ప్రస్తుతం రెండు ప్రాజెక్టుల్లో నటిస్తుండగా శ్రీకాంత్ ఓదెలతో ఒకటి, బాబీతో మరొక ప్రాజెక్ట్‌కి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేశారు. ప్రస్తుతం మెగా ఫ్యాన్స్ దృష్టంగా ' విశ్వంభర 'పైనే ఉంది. వశిష్ఠ డైరెక్షన్లో తెరకెక్కుతోన్న ఈ సోషియో ఫాంటసీ మూవీలో త్రిష, ఆషికా రంగనాథ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు.

తెలుగు తెరపై మునుపెన్నడూ చూడని సరికొత్త లోకాన్ని ప్రేక్షకులకి పరిచయం చేసేందుకు మెగాస్టార్ చిరంజీవి రెడీ అవుతున్నారు. ఈ విశ్వంలో 14 లోకాలు ఉండగా.. వాటిపైన ఉండే 15వ లోకమైన విశ్వంభరలో ఉండే హీరోయిన్ కోసం హీరో చేసే పోరాట సమాహారమే 'విశ్వంభర' కథని డైరెక్టర్ వశిష్ఠ కొద్దిరోజుల క్రితమే రివీల్ చేశారు. దీంతో ఫ్యాన్స్‌తో పాటు సగటు సినీ ప్రేక్షకులకి సైతం ఈ చిత్రంపై అంచనాలు పెరిగిపోయాయి.

మొన్న సంక్రాంతికే విడుదల కావాల్సిన ఈ మూవీ షూటింగ్ పూర్తికాకపోవడం, వీఎఫ్ఎక్స్ పనుల ఆలస్యంతో రేసు నుంచి తప్పుకుంది. టీజర్‌లో గ్రాఫిక్స్‌పై తీవ్ర విమర్శలు రావడంతో మేకర్స్ దానిపై ఫోకస్ పెట్టారు. వీఎఫ్ఎక్స్ వర్క్ కోసమే ఏకంగా రూ.75 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు టాక్. గతవారమే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది. ఇందులో ఫ్యాన్స్‌కి కిక్కిచ్చేలా ఐటెమ్ సాంగ్ పెడుతుండగా.. దానికోసం నాగిని భామ మౌనిరాయ్‌తో కలిసి చిరంజీవి స్టెప్పులే శారు. షూటింగ్ పూర్తయినా 'విశ్వంభర'ని ఎప్పుడు రిలీజ్ చేసేది మాత్రం మేకర్స్ ఇంకా చెప్పలేకపోతున్నారు. తొలుత మే, జులై అంటూ ప్రచారం జరిగినా ఆ నెలలు దాటిపోయాయి. ఆగస్టులో కూలీ, వార్ 2 వంటి పెద్ద సినిమాలు ఉండటంతో రిలీజ్ కష్టమే. సెప్టెంబర్ 25న రిలీజ్ చేస్తారని ప్రచారం జరిగినా అదికూడా కష్టంగానే కనిపిస్తోంది. ఎందుకంటే ఆ రోజు ఓజీ, అఖండ 2 చిత్రాలు పోటీపడుతున్నాయి. ఆ రెండింటి మధ్యలో దూరితే మొదటికే మోసం వస్తుందని మేకర్స్ ఆలోచనలో పడ్డారు.

మరోవైపు వీఎఫ్ఎక్స్ పనులు సెప్టెంబర్‌లోగా పూర్తికావడం కష్టంగా ఉందట. అలాంటప్పుడు కాస్త లేటైనా మంచి ఔట్‌పుట్ అందించాలన్న ఉద్దేశంగా 'విశ్వంభర' మేకర్స్ ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం నడుస్తోన్న టాక్ ప్రకారం డిసెంబర్‌లో ఈ మూవీని తీసుకొచ్చే అవకాశాలున్నాయంటున్నారు. అదే నిజమైతే డిసెంబర్, జనవరి నెలల్లో బ్యాక్ టు బ్యాక్ చిత్రాలతో చిరంజీవి సినీ ప్రేక్షకుల్ని అలరించడం ఖాయం. అనిల్ రావిపూడి, చిరంజీవి కాంబినేషన్లో వస్తోన్న మెగా 157 మూవీ సంక్రాంతికి రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. మరోవైపు డిసెంబర్ 5న రావాల్సిన 'ది రాజా సాబ్' మూవీ సంక్రాంతికి షిఫ్ట్ కానున్నట్లు ప్రచారం జరుగుతోంది.



# ఛాన్స్ అడిగితే కుదరదు అన్నారు..

ప్రముఖ దర్శకుడు శేఖర్ కమ్ముల ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర విషయాలు షేర్ చేసుకున్నారు. "ఫిల్మ్ మేకింగ్ కోర్సు చేస్తున్న సమయంలో ఇండియాకు వచ్చినప్పుడు 'నిన్నే పెళ్లాడతా' సినిమా చూసి కృష్ణవంశీ గారితో పనిచేయాలని కోరుకున్నాను. అప్పుడు ఆయన 'సింధూరం' తీస్తున్నారు. సెట్స్‌కి వెళ్లి అడిగితే ఇప్పటికే 30 శాతం షూటింగ్ పూర్తయిందని, ఇప్పుడు కొత్తవారిని తీసుకోలేమని రిజెక్ట్ చేశారు. ఆయన అలా ఎందుకు అన్నారో నేను డైరెక్టర్ అయిన తర్వాతే తెలిసింది' అని తెలిపారు.

టాలీవుడ్ సెన్సిబుల్ డైరెక్టర్‌గా పేరొందిన శేఖర్ కమ్ముల ఇటీవల ' కుబేర 'తో మంచి హిట్ అందుకున్న సంగతి తెలిసిందే. సున్నితమైన ప్రేమకథలను భావోద్వేగంతో ప్రేక్షకుల్ని కట్టిపడేసేలా తెరకెక్కించే దిట్ట అయిన శేఖర్ కమ్ముల తొలిసారి తన శైలికి భిన్నంగా ఈ చిత్రాన్ని తీసి ప్రేక్షకుల్ని మెప్పించారు. ధనుష్, అక్కినేని నాగార్జున, రష్మిక నటన ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఆనంద్, హ్యాపీడేస్, గోదావరి, లీడర్, లైఫ్ ఈజ్ బ్యూటీఫుల్, ఫిదా, లవ్‌స్టోరీ, కుబేర.. చిత్రాలతో తెలుగు సినీ పరిశ్రమలో తనకంటూ స్పెషల్ ఇమేజ్ సొంతం చేసుకున్న శేఖర్ కమ్ములని ఇండస్ట్రీకి వచ్చిన కొత్తలో క్రియేటివ్ డైరెక్టర్ కృష్ణవంశీ రిజెక్ట్ చేశారంట. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా షేర్ చేసుకున్నారు. తన సినిమాల రిలీజ్ టైమ్‌లో తప్ప పెద్దగా మీడియా ముందుకు రాని శేఖర్ కమ్ముల తాజాగా ఓ ఛానల్ కార్యక్రమంలో పాల్గొని ఎన్నో విషయాలను పంచుకున్నారు.

'అమెరికాలో ఫిల్మ్ మేకింగ్ కోర్సు చేసే సమయంలో ఓసారి ఇండియాకి వచ్చా. అప్పుడే 'నిన్నే పెళ్లాడతా' సినిమా రిలీజ్ అయింది. ఆ మూవీ చూసి కృష్ణవంశీ భలే తీశాడు అనిపించి ఆయన దగ్గర పనిచేయాలనుకున్నారు. అప్పుడు ఆయన ' సింధూరం ' తీస్తున్నారు. షూటింగ్ జరుగుతున్నప్పుడు సెట్స్‌కి వెళ్లి ఆయన్ని కలిశాను. నా వివరాలన్నీ చెప్పి అసిస్టెంట్ డైరెక్టర్‌గా అవకాశం ఇవ్వమని అడిగాను. 'ఇప్పటికే 30శాతం షూటింగ్ పూర్తయింది. అసిస్టెంట్ డైరెక్టర్లుగా చాలామంది పనిచేస్తున్నారు. నిన్ను జాయిన్ చేసుకోవడం కష్టం' అని చెప్పి ఆయన రిజెక్ట్ చేశారు. సినిమా షూటింగ్ మధ్యలో కొత్త వారిని తీసుకోవాల్సి వస్తే ఎంత గందరగోళంగా ఉంటుందో నేను డైరెక్టర్ అయ్యాక ఆ విషయం నాకు అర్థమైంది. కృష్ణవంశీ గారితో పనిచేసే అవకాశం నాకు రాకపోయినా ఆయనతో అనుబంధం మాత్రం ఏర్పడింది. ఆయన వర్కింగ్ స్టైల్ నాకు నచ్చుతుంది. నేను తీసే ప్రతి సినిమా ముందుగా ఆయనకే చూపిస్తుంటా' అని తెలిపారు శేఖర్ కమ్ముల.

తాను సినిమాల్లోకి రావడానికి ముఖ్య కారణం చిరంజీవి అని గతంలో ఎన్నోసార్లు చెప్పిన శేఖర్ కమ్ముల.. మరోసారి ఆ విషయాన్ని స్పష్టం చేశారు. 'నాది సినీ బ్యాక్‌గ్రౌండ్ ఉన్న ఫ్యామిలీ కాదు. నాకు చిన్నప్పటి నుంచి సినిమాలంటే పెద్దగా ఇష్టం ఉండేది కాదు. కాలేజీ రోజుల్లో చిరంజీవి షూటింగ్ జరుగుతుంటే వెళ్లి చూశాను. అక్కడ కొన్ని వేల మంది ఉంటే చిరంజీవి నన్ను పిలిచి మాట్లాడారు. ఆలస్యం చేయకుండా ఆయన్నుంచి ఆటోగ్రాఫ్ తీసుకున్నాను. ఆ ప్రభావంతో సినిమాల్లోకి రావాలని నిర్ణయించుకుని అమెరికాకి వెళ్లి ఫిల్మ్ మేకింగ్ కోర్సు చేసి డైరెక్టర్ అయ్యారు. నేను తీసిని సినిమాల్లో 'లీడర్' అంటే మా నాన్నకి చాలా ఇష్టం. నేను కొడుకుగా పుట్టినందుకు ఆ సమయంలో ఆయన గర్వంగా ఫీలయ్యారు. దానికి కచ్చితంగా సీక్వెల్ తీస్తా' అని చెప్పుకొచ్చారు.

# సోషల్ మీడియాలో పనికిమాలినోళ్లు ఎక్కువయ్యారు



సోషల్‌మీడియాలో జరుగుతున్న ట్రోలింగ్ పట్ల నటి రకుల్ ప్రీత్ సింగ్ తీవ్ర స్థాయిలో స్పందించింది. మన దేశంలో చాలామందికి పనీపాటా లేక ఇతరుల జీవితం మీద పిచ్చిపిచ్చిగా కామెంట్లు చేయడమే అలవాటైంది. ట్రోలింగ్ తప్ప వారికి ఇంకేమీ పని ఉండదు" అంటూ రకుల్ పేర్కొంది. ఆమె వ్యాఖ్యలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. రకుల్ మాటలతో సెలబ్రెటీలు ఎదుర్కొంటున్న మానసిక వేదనకి అద్దం పడుతోందని నెటిజన్లు అంటున్నారు. సోషల్‌మీడియా స్వేచ్ఛను దుర్వినియోగం చేయకుండా జాగ్రత్త పడాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నారు. రకుల్ ప్రీత్ సింగ్... తెలుగు ప్రేక్షకులకి పరిచయం అక్కర్లేని పేరు. 'కెరటం' మూవీలో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన 'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్'తో హిట్టు అందుకున్న ఈ పంజాబీ భామ.. లౌక్యం, పండగ చేస్కో, బ్రూస్‌లీ, నాన్నకు ప్రేమతో, సరైనోడు, ధ్రువ చిత్రాలతో తెలుగు ప్రేక్షకుల్ని అలరించింది. ఆ తర్వాత ఆమె చేసిన స్పైడర్, మన్మథుడు, చెక్ చిత్రాలు డిజాస్టర్లు కావడంతో తెలుగు మేకర్స్ ఆమెను పట్టించుకోవడం మానేశారు. ఆ తర్వాత బాలీవుడ్ కి వెళ్లినా ఆమె జాతకం మారలేదు. బాలీవుడ్ నటుడు, నిర్మాత అయిన జాకీ భగ్నానీతో ప్రేమలో పడి పెద్దల అంగీకారంతో వివాహ బంధంలోకి అడుగుపెట్టింది. ప్రస్తుతం చేతిలో పెద్దగా సినిమాలు లేకపోయినా సోషల్‌మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ ఫ్యాన్స్‌ని అలరిస్తూనే ఉంటుంది రకుల్. సోషల్‌మీడియాలో ఏదైనా టాపిక్‌గా డిస్కషన్, ట్రోలింగ్ జరుగుతుంటే వాటిపై తన అభిప్రాయాల్ని నిర్మొహమాటంగా చెప్పేస్తుంటుంది రకుల్. ఒక్కోసారి ఆమె చేసే కామెంట్స్ తెగ వైరల్ అవుతుంటాయి. సెలబ్రెటీలపై సోషల్‌మీడియాలో తరుచూ ట్రోలింగ్ జరుగుతుండటం కామన్‌గా మారిపోయిన సంగతి తెలిసిందే. వీటిని కొందరు సెలబ్రెటీలు పట్టించుకోవడం మానేస్తుంటే.. మరికొందరేమో చాలా ఫీలవుతుంటారు. ఇదే విషయమై రకుల్ తాజాగా షాకింగ్ కామెంట్స్ చేసింది. అందరికీ స్మార్ట్‌ఫోన్లు ఉండటం, డేటా ప్యాక్‌లు సరసమైన ధరల్లో ఉండటంతో ప్రతి ఒక్కరూ సోషల్‌మీడియాని వాడుతున్నారు. అయితే దురదృష్టవశాత్తూ మనదేశంలో చాలామందికి ఎలాంటి పనీపాటా ఉండదు. అందువల్ల ఇతరుల జీవితాల్లోకి తొంగిచూడటం, పిచ్చిపిచ్చి కామెంట్లు చేయడం అలవాటుగా మారిపోయింది. ఇతరులని ట్రోల్ చేయడం తప్ప వారికి ఇంకేమీ పని ఉండదు' అంటూ రకుల్‌ప్రీత్ సింగ్ సంచలన వ్యాఖ్యలు చేసింది. ఆమె మాటలని చాలామంది సమర్థిస్తున్నారు. సోషల్‌మీడియాలో జరిగే ట్రోలింగ్ వల్ల సెలబ్రెటీలు ఎంత ఆవేదనకు గురవుతున్నారో రకుల్ వ్యాఖ్యలు అద్దం పడుతున్నాయని అంటున్నారు. గతంలో నటి అవనీత్ కౌర్ పోస్టుకి విరాట్ కోహ్లి లైక్ కొట్టడంపై జరిగిన రచ్చకి సంబంధించి రకుల్ ప్రీత్ సింగ్ ఘాటుగా స్పందించింది. 'కోహ్లి లైక్ కొట్టాక అవ్‌నీత్ కౌర్ ఇన్‌స్టా అకౌంట్‌కి 2 మిలియన ఫాలోవర్లు పెరిగారట. ఇది చాలా బాధ కలిగించే విషయం. మనం ఎంత ఖాళీగా ఉన్నామో ఇలాంటి సంఘటనల వల్ల తెలుస్తుంది. అసలు కోహ్లి కావాలని లైక్ కొట్టాడా.. పొరపాటున జరిగిందా అన్నది ఆలోచించకుండా ఆమె అకౌంట్‌ని ఫాలో అయిపోయారు. జనాలు సోషల్‌మీడియా చూస్తూ సమయాన్ని ఎలా వృథా చేస్తున్నారో ఇలాంటి సంఘటన వల్ల తెలుస్తుంది' అంటూ నెటిజన్లకు చురకలు అంటించింది రకుల్ ప్రీత్ సింగ్.



# హీరో, డైరెక్టర్ మధ్య ఈగో క్లాష్..

దుల్కర్ సల్మాన్ హీరోగా నటిస్తున్న 'కాంత' చిత్రం 1950ల మద్రాస్ నేపథ్యంలో తెరకెక్కుతోంది. భాగ్యశ్రీ హీరోయిన్ గా నటిస్తుండగా, సముద్రఖని కీలక పాత్రలో కనిపించనున్నారు. దర్శకుడు సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను రానా దగ్గుబాటితో కలిసి దుల్కర్ నిర్మిస్తున్నారు. సెప్టెంబర్ 12న పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. దుల్కర్ సల్మాన్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'కాంత'. భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్ గా నటిస్తున్న ఈ సినిమాలో దర్శక నటుడు సముద్రఖని కీలక పాత్ర పోషించారు. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వంలో ఈ పీరియాడికల్ మూవీ తెరకెక్కుతోంది. దుల్కర్‌తో కలిసి హీరో రానా దగ్గుబాటి, ప్రశాంత్ పొట్లూరి, జోమ్ వర్గీస్ ఈ సినిమాని నిర్మిస్తున్నారు. ఇప్పటికే రిలీజైన హీరో హీరోయిన్ల ఫస్ట్ లుక్ పోస్టర్లకు మంచి రెస్పాన్స్ వచ్చింది. సోమవారం(జులై 28) దుల్కర్ పుట్టినరోజు సందర్భంగా టీజర్ ను రిలీజ్ చేశారు. 1950ల మద్రాస్ బ్యాక్ డ్రాప్ లో 'కాంత' సినిమా తెరకెక్కుతున్నట్లు తెలుస్తోంది. రియల్ లైఫ్ లో పోషించిన హీరో హీరోయిన్ పాత్రల్లోనే దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే కనిపిస్తున్నారు. దర్శక రచయిత పాత్రను సముద్రఖని పోషించారు. 'శాంత' అనే పేరుతో రూపొందిస్తున్న సినిమా విషయంలో డైరెక్టర్, హీరోకి మధ్య ఈగో క్లాష్ నేపథ్యంలో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్టు టీజర్ చూస్తే అర్థమవుతోంది. సెప్టెంబరు 12న ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు.



# పులిని చూసి నక్క వాతలు..

కన్నప్ప చిత్రంపై మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు తమ్మారెడ్డి భరద్వాజ. పులిని చూసిన వాతలు పెట్టుకున్నట్లు బాహుబలి, ఆర్ఆర్ఆర్ చిత్రాలను చూసి అందరూ అలాంటి సినిమాలే తీయాలని అనుకుని నష్టపోతున్నారు. 'కన్నప్ప'లో భక్త భావం పక్కదారి పట్టి ఇతర విషయలు డామినేట్ చేసేశాయన్నారు. శివపార్వతులని చూస్తే వెకిలిగా ఉన్నారని మండిపడ్డారు. వాళ్లకి ఇచ్చిన రెమ్యునరేషన్ బొక్క అని మోహన్‌బాబుకి కాల్ చేసి చెప్పానన్నారు. ఆయన కామెంట్లు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి.

మంచు విష్ణు ప్రధాన పాత్రధారిగా స్వీయ నిర్మాణంలో తెరకెక్కిన ' కన్నప్ప ' గత నెలలో రిలీజై బాక్సాఫీస్ దగ్గర నిరాశ పరిచిన సంగతి తెలిసిందే. ప్రభాస్ లాంటి పాన్ ఇండియా స్టార్ కీలక పాత్రలో నటించడం, మోహన్‌లాల్, శరత్‌కుమార్, మోహన్‌బాబు , అక్షయ్ కుమార్, కాజల్ అగర్వాల్ నటించడంతో దీనిపై భారీ అంచనాలున్నాయి. అయితే తొలిరోజు ఫర్వాలేదనిపించిన ఈ చిత్రం ఆ తర్వాత పూర్తిగా నిరాశపరిచి ఫ్లాప్‌గా నిలిచింది. తాజాగా ఈ చిత్రంపై దర్శక నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ కీలక వ్యాఖ్యలు చేశారు. 'కన్నప్ప' చిత్రంలో భక్తిభావం మిస్ అయిందని, నానా రకాల క్యారెక్టర్లు దూర్చేసి కథని పక్కదారి పట్టించడంతోనే ప్రేక్షకులు తిరస్కరించారని అన్నారు.


'కన్నప్ప' సినిమాని నేను ఎనిమిదో రోజున చూసి తొమ్మిదో రోజున దాని గురించి మాట్లాడాను. అప్పటికే సినిమా పని అయిపోయింది. నేను వెళ్లినప్పుడు కూడా థియేటర్లో పెద్దగా జనాలు లేరు. అందుకే వాళ్లు చేసిన తప్పుల్ని ధైర్యంగా చెప్పాను. అప్పుడు కూడా చెప్పకపోతే వాళ్ల తప్పులు ఎలా తెలుసుకుంటారు. విష్ణుతో పాటు మోహన్‌బాబుకి కూడా ఫోన్ చేసి సినిమాలో చేసిన తప్పుల్ని చెప్పాను. మీరు కొన్ని తప్పులు చేయకపోయి ఉంటే సినిమా బ్రహ్మాండంగా ఆడేదని చెప్పాను. కలెక్షన్లు సరిగ్గా రాకపోయినా ఆ సినిమాని నేను ఫ్లాఫ్ అనను. బిలో యావరేజ్ అనే అంటాను. ప్రభాస్ లాంటి స్టార్ హీరో డేట్లు ఇచ్చినప్పుడు దాన్ని నిలబెట్టుకుని ఉంటే సెన్సేషనల్ హిట్ అయ్యేది. సినిమా బాగా తీయడం వేరు.. కంటెంట్‌ని చంపుకోవడం వేరు. పులిని చూసి వాత పెట్టుకున్నట్లు బాహుబలి, ఆర్ఆర్ఆర్ సినిమాల్ని చూసి అలాగే తీయాలంటే సాధ్యం కాదు. శ్రీకాళహస్తి మహత్యం, కన్నప్ప కథలకు సంబంధించి అన్ని భాషల్లో కలిపి పదికి పైగా సినిమాలు తీస్తే అన్నీ హిట్టయ్యాయి. దానికున్న కంటెంట్ అలాంటిది. కానీ 'కన్నప్ప' ఎందుకు ఫ్లాప్ అయ్యిందన్నది వారు ఆలోచించుకోవాలి.

'కన్నప్ప'లో భక్తిభావం కనిపించలేదు. శివుడు పార్వతి పాత్రధారులు అస్సలు సెట్ కాలేదు. తెరపై చూస్తుంటే వాళ్లిద్దరు వెకిలిగా కనిపించారు. ఈ విషయాన్ని విష్ణు, మోహన్‌బాబుకి నేను డైరెక్ట్‌గా ఫోన్ చేసి చెప్పాను. మీరు పట్టించుకుని ఉంటే సినిమా ఇలా ఉండేది కాదని మోహన్‌బాబుతో అన్నాను. ప్రభాస్ క్యారెక్టర్ చాలా బాగా డిజైన్ చేశారు. శివుడు సరిగ్గా లేనప్పుడు ఇక భక్తి ఎక్కడి నుంచి వస్తుంది. శివ పార్వతుల కింద ఎవరో అనామకుల్ని పెట్టినా బాగుండేది. స్టార్లు అని తీసుకొచ్చారు. అంతా వేస్ట్ అయింది. వాళ్లకిచ్చిన రెమ్యునరేషన్ బొక్క. సినిమా బాగుందో లేదో బయటికి చెప్పకపోతే మరోసారి వేరొకరు ఇలాంటి సినిమాలు తీస్తారు. రాఘవేంద్రరావు, బాలకృష్ణ కలిసి తీసిన 'పాండురంగ మహత్యం' కూడా ఇలాగే తేడా కొట్టేసింది. పాత సినిమాకి, దానికి చాలా తేడా ఉంది. అందులో భక్తి కనిపించలేదు. ఇష్టం వచ్చినట్లు కథలో మార్పులు చేసేస్తే ప్రేక్షకులు చూడరు. అనుభూతి రావాలి, రోమాలు నిక్కబొడుచుకోవాలి. కామన్ ఆడియన్‌ని మెప్పించేలా ఎమోషన్ క్రియేట్ చేయాలి. అప్పుడే భక్తి సినిమాలు హిట్ అవుతాయి. 'అన్నమయ్య' సినిమాలో వంద తప్పులున్నాయి. కానీ అందులో వచ్చే సీన్స్ గానీ, ఎమోషన్స్ గానీ ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నాయి. సినిమా ఆఖరున 15 నిమిషాలు భక్తిని పీక్స్‌కి తీసుకెళ్లిపోయారు. అందుకే ఆ సినిమా ప్రేక్షకుల్ని అంతలా ఆకట్టుకుంది' అని చెప్పుకొచ్చారు తమ్మారెడ్డి భరద్వాజ.

# కాంబో రిపీట్

2023లో బాబీ డైరెక్షన్‌లో వచ్చిన 'వాల్తేరు వీరయ్య ' సినిమాతో హిట్ అందుకున్న మెగాస్టార్ చిరంజీవి మరోసారి ఆయనతో సినిమా చేసేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. మొన్న సంక్రాంతికి నందమూరి బాలకృష్ణతో 'డాకు మహరాజ్ 'తో హిట్టు కొట్టిన బాబీకి మరోసారి మెగాస్టార్‌తో సినిమా తీసే అవకాశం రావడం బంపరాఫర్ అనే చెప్పాలి. ఈ సినిమాని మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తుండగా సెప్టెంబర్ నుంచి సెట్స్ మీదికి వెళ్లనున్నట్లు సమాచారం మెగాస్టార్ చిరంజీవి బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో దూకుడు మీదున్నారు. ప్రస్తుతం వశిష్ఠ డైరెక్షన్లో 'విశ్వంభర' చేస్తూనే అనిల్ రావిపూడితో మరో మూవీలో నటిస్తున్నారు. 'విశ్వంభర' షూటింగ్ ఇటీవలే పూర్తికాగా.. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది. అటు అనిల్ రావిపూడి జెట్ స్పీడుతో సినిమాని తెరకెక్కిస్తున్నాడు. ఇందులో లేడీ సూపర్‌స్టార్ నయనతార హీరోయిన్‌గా నటిస్తోంది. 'విశ్వంభర' రిలీజ్‌పై ఇంకా క్లారిటీ లేకపోగా.. అనిల్ రావిపూడి మూవీ మాత్రం సంక్రాంతికి రానున్నట్లు గతంలోనే మేకర్స్ ప్రకటించారు. అయితే ఈ రెండు సినిమాల తర్వాత చిరంజీవి ఏ డైరెక్టర్‌తో చేస్తారన్నది ఆసక్తికరంగా మారింది. నాని నిర్మాతగా శ్రీకాంత్ ఓదెల డైరెక్షన్లో ఓ సినిమా చేయనున్నట్లు అనౌన్స్‌మెంట్ వచ్చినా ఆ ప్రాజెక్టులో కదలిక కనిపించడం లేదు.

అయితే తాజాగా వినిపిస్తోన్న సమాచారం ప్రకారం.. యంగ్ డైరెక్టర్ బాబీకి మరో ఛాన్స్ ఇచ్చారట మెగాస్టార్. బాబీ డైరెక్షన్లో



చిరంజీవి నటించిన ' వాల్తేరు వీరయ్య ' సినిమా 2023 సంక్రాంతికి రిలీజై ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఫ్లాపుల్లో ఉన్న చిరంజీవికి ఆ మూవీ మంచి బ్రేక్ ఇచ్చింది. అందులో మాస్ మహరాజ్ రవితేజ కీలకపాత్రలో కనిపించగా.. ఇద్దరు స్టార్ హీరోలని బాబీ చక్కగా హ్యాండిల్ చేసిన విధానం ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది. అలాగే చిరంజీవిలో ఉండే ఫన్‌ని బాగా వాడుకున్నాడు. మెగా ఫ్యాన్స్ అయితే వింటేజ్ చిరుని చూపించారని సంబరపడిపోయారు. ఆ ఏడాది సంక్రాంతి బరిలో బాలకృష్ణ 'వీరసింహారెడ్డి'లో పోటీని తట్టుకుని విజయం సాధించడమే కాకుండా నిర్మాతకు లాభాలు తెచ్చిపెట్టింది.

తాజాగా బాబీతో చేసేందుకు మెగాస్టార్ చిరంజీవి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారట. ప్రస్తుతం చేతిలో ఉన్న రెండు ప్రాజెక్టులు పూర్తికాగానే ఆ సినిమా సెట్స్ మీదికి వెళ్లనుందట. మైత్రీ మూవీ మేకర్స్ దీన్ని నిర్మించనున్నట్లు టాక్. ఈ ఏడాది సంక్రాంతికి నందమూరి బాలకృష్ణతో 'డాకు మహరాజ్' వంటి బ్లాక్‌బస్టర్ అందుకున్న బాబీ.. మెగాస్టార్‌తో మరోసారి అవకాశం రావడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తున్నాడు. ఇప్పటికే ప్రీ ప్రొడక్షన్ పనులు మొదలుకాగా.. సెప్టెంబర్ నుంచి సెట్స్ మీదకి వెళ్లనుందని టాక్. మరోవైపు 'దసరా' దర్శకుడు శ్రీకాంత్ ఓదెలతో చిరంజీవి ఓ సినిమా చేయనున్నట్లు ప్రకటన వచ్చిన సంగతి తెలిసిందే. ఈ చిత్రానికి హీరో నాని నిర్మించనున్నారు. అయితే శ్రీకాంత్ ప్రస్తుతం నానితో 'ది ప్యారడైజ్' చిత్రీకరణలో బిజీగా ఉన్నారు. ఆ షూటింగ్ పూర్తయ్యాకే ఆయన చిరంజీవితో ప్రాజెక్టు మొదలుపెట్టాలని ఆలోచిస్తున్నారట. అయితే ప్రస్తుతం తన చేతిలో ఉన్న రెండు ప్రాజెక్టులు ముగింపు దశకు రావడంతో గ్యాప్ లేకుండా బాబీతో సినిమా చేసేందుకు చిరంజీవి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారంట. ఈ మూవీ తర్వాత శ్రీకాంత్ ఓదెలతో ప్రాజెక్ట్ స్టార్ట్ కానున్నట్లు తెలుస్తోంది.

Printed, Edited by , Published and Owned by .M Chandrasekhar Address Plot No 12. Journalist. Colony .Near. B.T.R.Nagar. vaartha Office Back Side .KG Road. Kurnool. Andhra Pradesh .Pincode 518 001
Printed at Uttejitha printer's, KURNOOL. AP. Cell No. 9440140418, RNI APTEL/2008/24570 ,